ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 248 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 7 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం।
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
కృష్ణపక్షం; తిథి: సప్తమి మ.12.19;
నక్షత్రం: స్వాతి మ.3.45
వర్జ్యం: రా.9.40 నుండి 11.21 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు;
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు



ఖైదీలకు పెట్టే భోజనాన్ని సంతృప్తిగా ఆరగిస్తున్న శ్రీమంతుడు బాబీ చెమ్మనూర్

మారడోనాతో కలిసి మళ్లీ జైలుకొస్తా!

- జైలు అభివృద్ధికి నిధులు అందిస్తా..
- దోమలు కుడుతున్నా నేలపైనే పడుకున్నా
- అన్నం, సాంబారు రుచి మరువలేను
- అనుభూతిని వెల్లడించిన బాబీ చెమ్మనూర్
- ఆటోలో ప్రయాణించిన శ్రీమంతుడు

తమ్మలి మురళీధర్

సంగారెడ్డి, ఫిబ్రవరి 6: ఆదేశించడమే ఆలస్యం.. క్షణాల్లో ఏది కోరితే అది చెంతకు తీసుకువచ్చే మంది, మార్బలం అతని సొంతం. కూర్చొని తిన్నా తరగని కోట్లకు పడగలెత్తిన శ్రీమంతుడు. 150 ఏళ్ల గొప్ప వ్యాపార చరిత్ర. లెక్కలేనన్ని అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నా, వాటన్నింటినీ రెండురోజులపాటు కాదనుకుని జైలు ఊచలు లెక్కపెట్టాడు. మానవత్వానికి మించినది మరొకటి లేదంటూ సాధారణ వ్యక్తిగానే జీవించి అసాధారణ వ్యక్తిగా ముద్ర వేసుకున్నాడు. అతనే చెమ్మనూర్ అంతర్జాతీయ బంగారు నగల వ్యాపారి బాబీ చెమ్మనూర్. నేరస్తులు అనుభవించే ఖైదీల జీవితం ఎలావుంటుందో తెలుసుకోవాలనే ఉత్సుకత 15 ఏళ్ల క్రితం మదిలో మెదిలింది. తెలంగాణ జైళ్ల శాఖ వినూత్నంగా అమలు చేస్తున్న 'జైలు అనుభూతి' (ఫీల్ ద జైల్) అవకాశంతో ఒక రోజు జైల్లో గడిపేందుకు అన్నింటినీ పక్కన పెట్టి సోమవారం ముగ్గురు సహచరులతో జైలు జీవితాన్ని అనుభవించాడు. వచ్చేటప్పుడు తెచ్చేదేమిలేదని, వెళ్లేటప్పుడు మాత్రం మంచితనం, మానవత్వం వినా మరేమీ తోడురాదంటూ తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నాడు. ఫుట్‌బాల్ లెజెండ్, అర్జెంటీనా ఆటగాడు డిగో మారడోనాతో కలిసి సంగారెడ్డిలోని వారసత్వ జైలుకు మరో రోజు వచ్చి గడుపుతానని అంతర్జాతీయ వ్యాపార సంస్థ చైర్మన్ బాబీ చెమ్మనూర్ వెల్లడించారు. శిథిలావస్థలోవున్న పురాతన జైలు అభివృద్ధికి తనవంతు నిధులిస్తానని ప్రకటించాడు. కేరళలోని త్రిచూర్‌కు చెందిన బాబీ చెమ్మనూర్ తనతోపాటు మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి సోమవారం మధ్యాహ్నం సంగారెడ్డి జైలుకు వచ్చిన విషయం తెలిసిందే. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి 812 కిలోమీటర్లు - మిగతా 6వ పేజీలో



మన మిత్రధర్మం ఎంత పవిత్రంగా ఉందో...
ఈ విషయంలో కూడా అలానే ఉన్నాం!!





ఉగ్రవాద దాడితో అప్రమత్తమై ఆస్పత్రిలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు. (ఇన్‌సెట్‌లో) ఉగ్రవాది నవీద్ జుట్ (ఫైల్ ఫొటో). ఆస్పత్రి వద్ద పోలీసులపై దాడి చేసి లష్కరే మిలిటెంట్లు తప్పించిన ఉగ్రవాది ఇతనే.

ఆస్పత్రిపై ఉగ్రమూక దాడి

- ఇద్దరు పోలీసులు దుర్మరణం
- కాశ్మీర్‌లో లష్కరే దుండగుల ఘాతుకం
- తీవ్రవాదిని విడిపించుకుపోయిన వైనం

శ్రీనగర్, ఫిబ్రవరి 6: కశ్మీర్‌లో తీవ్రవాదులు మరోసారి తెగబడ్డారు. గతంలో పట్టుబడిన తీవ్రవాదులను చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువస్తున్న పోలీసు బృందంపై కాల్పులు జరిపారు. శ్రీనగర్‌లో అత్యంత రద్దీగా ఉండే ఎస్ఎమ్‌హెచ్ఎస్ ఆస్పత్రికి ఆరుగురు తీవ్రవాదులను తీసుకురాగా వారు వాహనం నుంచి దిగీదిగగానే పోలీసులపై లష్కర్-ఇ-తొయిబా తీవ్రవాదులు కాల్పులు జరిపారు. చికిత్సకోసం వచ్చిన తీవ్రవాదుల్లో కరడుగట్టిన పాకిస్తాన్ తీవ్రవాదిని విడిపించుకుని పరారయ్యారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. జమ్మూకశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లోని కాకాసరాయ్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కాల్పులు జరిపిన వారితో పరారైన కరడుగట్టిన తీవ్రవాది మహమ్మద్ నవీద్ ఝుట్ (22) 2014లో కుల్గాంలో పట్టుబడ్డాడు. ఇతడితోపాటు ఆరుగురు తీవ్రవాదులను ఆస్పత్రి వద్దకు తీసుకువస్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. ఈ కాల్పుల్లో హెడ్‌కానిస్టేబుల్ ముస్తాక్ అహ్మద్ అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్ బాబర్ అహ్మద్ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. అత్యంత రద్దీగా ఉండే ఆస్పత్రివద్ద పోలీసులపై తీవ్రవాదులు జరిపిన దాడిలో దురదృష్టవశాత్తూ ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, తమ నిర్బంధంలో ఉన్న కరడుగట్టిన తీవ్రవాది నవీద్‌సహా దాడికి పాల్పడిన దుండగులు పరారయ్యారని, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని డీజీపీ ఎస్పీ వైద్ తెలిపారు. తీవ్రవాదులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా ఈ దాడి జరిగిందని సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ గులామ్ హసన్ భట్ చెప్పారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం తీవ్రవాదులను చికిత్సకోసం తీసుకువచ్చిన పోలీసులు వాహనం నుంచి దిగిన - మిగతా 6వ పేజీలో

అమీతుమీకి హామీ బ్రేక్

- జైట్లీ ప్రకటనతో చల్లారిన తెదేపా
- నాబార్డు నుంచి 30శాతం నిధులు
- చంద్రబాబు లేఖకు కేంద్రం హామీ
- రైల్వే జోన్‌నూ పరిశీలిస్తామని ప్రకటన
- విభజన హామీలపై పట్టుబట్టిన ఏపీ ఎంపీలు
- లోక్‌సభలో పెద్దఎత్తున గొడవ
- స్తంభించిన సభా కార్యక్రమాలు
- చివరకు దిగవచ్చిన కేంద్రం
- ఉభయ సభల్లో ప్రకటన చేసిన జైట్లీ
- ప్రకటనకు ముందే నిష్క్రమించిన మోదీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: బడ్జెట్‌లో ఆంధ్రకు జరిగిన అన్యాయాన్ని సవరించకుంటే అమీతుమీ తేల్చుకుంటామని తెగేసి చెప్పిన తెలుగుదేశానికి హామీ బ్రేకుపడింది. పాత హామీనే కొత్త పద్ధతిలో అమలు చేస్తామంటూ ఎన్డీయే ప్రభుత్వం మరో హామీ ఇవ్వటంతో తెదేపా ఆగ్రహం చల్లారిపోయింది. కేంద్ర పథకాలతో లభించే 30శాతం నిధులను విదేశీ సహాయ పథకాల కింద కాకుండా నాబార్డ్ ద్వారా ఇప్పించాలన్న సీఎం చంద్రబాబు ప్రతిపాదనకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సంసిద్ధత వ్యక్తం చేయటంతో పార్లమెంట్ సాక్షిగా చేపట్టిన నిరసన వ్రతాన్ని తెదేపా ఎంపీలు ఉపసంహరించారు. జైట్లీ ఈ ప్రకటనను మొదట రాజ్యసభ, తరువాత లోక్‌సభలో చేశారు. రైల్వే మంత్రి పీయూష్ గోయల్ రాజ్యసభలో ఆ వెంటనే ఒక వివరణ ఇస్తూ ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు అంశం పరిశీలనలో ఉందని, ఇతర రాష్ట్రాలతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 30 శాతం నిధులను నాబార్డ్ ద్వారా ఇప్పించే అంశంపై కేంద్ర రెవెన్యూ కార్యదర్శి ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శితో చర్చిస్తారని జైట్లీ ప్రకటించారు. విభజన చట్టం హామీలకు కేంద్రం కట్టుబడి ఉందని జైట్లీ ప్రకటించిన వెంటనే, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖామంత్రి సుజన చౌదరి తమ సభ్యులను సీట్లలోకి వెళ్లాల్సిందిగా సూచించారు. జైట్లీ ప్రకటన నచ్చని కొందరు సభ్యులు లోక్‌సభ పోడియం వద్దే నిలబడటంతో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ జోక్యం చేసుకుని వెనక్కి పంపించారు. 'బడ్జెట్‌లో ఏపీకి జరిగిన - మిగతా 6వ పేజీలో



పార్లమెంట్ ప్రవేశద్వారం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తెదేపా ఎంపీలు



పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కేంద్రం కదిలింది!

- కానీ, హామీలలో స్పష్టత లేదు
- ప్రధాని మోదీ నాకు ఫోన్ చేయలేదు
- ఒత్తిడి ఇంకా కొనసాగించండి
- సమన్వయ భేటీలో చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: పార్లమెంటులో పార్టీ ఎంపీల ఆందోళనతో కేంద్రంలో కదలిక వచ్చిందని తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం అభిప్రాయపడింది. అయితే, ప్రధాని మోదీతో కేంద్రమంత్రి సుజనాచౌదరి భేటీలో స్పష్టమైన హామీ కనిపించలేదని, దాన్ని సాధారణ సమావేశంగానే భావించింది. బడ్జెట్ కేటాయింపులలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వాటి కోసం తమ పార్టీ చేస్తున్న - మిగతా 6వ పేజీలో



తెలుగు రాష్ట్రాలకు 5,483 కోట్లు కేటాయింపు

- బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వే వాటా రూ.5752 కోట్లు
- 8 శాతం పెంపుతో ఆంధ్రకు రూ.3670 కోట్లు
- ఐదు శాతం పెంపుతో తెలంగాణకు రూ.1813 కోట్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 6: తెలుగు రాష్ట్రాల్లో రైల్వేల అభివృద్ధికి కేంద్రం 5, 483 కోట్లు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.3670 కోట్లు, తెలంగాణకు రూ.1729 కోట్లు కేటాయించింది. గత ఏడాదితో పోల్చితే తెలంగాణకు 5 శాతం, ఆంధ్రకు 8 శాతం ఎక్కువ నిధులు కేటాయించారు. దక్షిణ మధ్య రైల్వేకు మొత్తం రూ.5752 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో కొత్త రైల్వే లైన్లకు రూ.1757.70 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ. 1653 కోట్లు, ట్రాఫిక్ సదుపాయాలకు రూ.210.77 కోట్లు, ప్రయాణికుల సదుపాయాలకు రూ.120.03 కోట్లను కేటాయించారు. రైల్వే విద్యుద్ధీకరణకు సంబంధించి లింగంపేట- జగిత్యాల- నిజామాబాద్ లైన్‌కు రూ.80.29 కోట్లు, వికారాబాద్- పర్లి వైద్యనాథ్‌కు రూ.262.12 కోట్లు, పింపలకుట్టి- ముదుఖేడ్- పర్భానీ లైన్ విద్యుద్ధీకరణకు రూ.224.17 కోట్లు, గద్వాల- రాయిచూరుకు రూ.46.10కోట్లు, తెనాలి- రేపల్లెకు రూ.25.98 కోట్లు, నంద్యాల- ఎర్రగుంట్ల లైన్‌కు రూ.111.48 కోట్లు, ధర్మవరం- పాకాల లైన్‌కు రూ.2100.47 కోట్లు, పూర్ణ- అకోలాకు రూ.211.58 కోట్లు కేటాయించారు. మౌలాలి వద్ద ఫ్లాష్ బట్ వెల్డింగ్ ప్లాంట్‌కు రూ.7.71 కోట్లు కేటాయించారు.

కొత్త రైల్వే లైన్ల సర్వేకు అనుమతి

నిజామాబాద్- నిర్మల్- ఆదిలాబాద్ 125 కి.మీ, పటాంచెరు-సంగారెడ్డి-జోగిపేట-మెదక్ 95 కి.మీ, మానకొండూరు-హుజూరాబాద్ 60 కి.మీ, పెద్దపల్లి-కాజీపేట, వికారాబాద్-వాడి, పగిడిపల్లి-భువనగిరి, భువనగిరి-శంకరపల్లి, కడప-గుంతకల్-బళ్లారి, విష్ణుపురం-జన్‌పహాడ్, నిజామాబాద్, ముద్కేడ్, పరబాని లైన్ల సర్వేకు అనుమతి ఇచ్చారు. కొండపల్లి-ముస్తాబాద్, గుంతకల్ పశ్చిమ-మల ప్పగేట్ ఫ్లైవోవర్ నిర్మాణానికి సర్వే చేస్తారు. అక్కన్నపేట-మెదక్ లైన్‌కు రూ.130 కోట్లు, ఓబులవారిపల్లె- - మిగతా 6వ పేజీలో

ఏపీలో సీఎస్ఐఆర్ సెంటర్

- రెండు నెలల్లో డీపీఆర్‌తో వస్తాం
- సిలికాన్ వ్యాలీ తరహాలో ఇన్నోవేషన్ వ్యాలీ
- వెల్లడించిన సీఎస్ఐఆర్ డీజీ సాహ్నీ
- సచివాలయంలో చంద్రబాబుతో భేటీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో పారిశ్రామిక, శాస్త్రీయ పరిశోధనకు ఉపకరించే ముఖ్య కేంద్రం ఏర్పాటు కాబోతోంది. దేశంలో అతి పెద్ద పరిశోధన- అభివృద్ధి సంస్థగా ఉన్న 'సీఎస్ఐఆర్' (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) ఒక కేంద్రాన్ని రాజధానిలో ఏర్పాటు చేయడానికి తగిన ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న సీఎస్ఐఆర్ ప్రయోగశాలలో కనుగొన్న పరిశోధన ఫలాలు, సరికొత్త ఆవిష్కరణలను పరీక్షించి, ప్రదర్శించడానికి వీలుగా ఇక్కడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 'సెంటర్ ఫర్ స్కేలింగ్ అప్ అండ్ డిమానిస్ట్రేషన్ ఆఫ్ రెలవెంట్ సీఎస్ఐఆర్ టెక్నాలజీస్' పేరుతో నెలకొల్పుతున్న ప్రాజెక్టుకు సంబంధించి మరో రెండు మాసాల్లో సవివర కార్యప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఆ సంస్థ డైరక్టర్ జనరల్ గిరీశ్ సాహ్నీ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం గిరీశ్ సాహ్నీ, సీఎస్ఐఆర్ డైరక్టర్లుగా ఉన్న సీనియర్ శాస్త్రవేత్తలు సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. వివిధ శాఖలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్న - మిగతా 6వ పేజీలో




సీఎస్ఐఆర్ డీజీ సాహ్నీతో సమావేశమైన సీఎం చంద్రబాబు



ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చక వేదపండితులు సంప్రదాయ బద్ధంగా యాగశాలలో ఆగమశాస్త్రానుసారం అఖండస్థాపన, వాస్తు పూజ, వాస్తుహోమం, మండపారాధనలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో విద్యుత్ దీపాల వెలుగులో దేదీప్యమానంగా వెలుగుతున్న శ్రీశైలం ఆలయ రాజగోపురం.

వారి చరిత్ర స్ఫూర్తిదాయకం

'మన తెలుగు పెద్దలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం



తెలుగు పెద్దల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: తెలుగు పెద్దల జీవిత చరిత్రలు నేటి తరానికి అందవలసినంతగా అందుబాటులో లేవని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లాది కృష్ణానంద్ అక్షరీకరించిన 'మన తెలుగు పెద్దలు' పుస్తకాన్ని మంగళవారం రాత్రి బాబు సచివాలయంలో ఆవిష్కరించారు.

కీర్తిశేషులైన 241 తెలుగు ప్రముఖుల వివరాలు, జీవన రేఖా చిత్రాలతో ప్రచురించిన ఈ పుస్తకం పాత్రికేయులకు, విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. తెలుగు పెద్దల జీవన రేఖా చిత్రాలు ఈ తరం వారికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. రాష్ట్ర సమాచార, గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 'వీరి జీవిత చరిత్రలు ఒక వినూత్న జీవన వికాసం కలిగిస్తాయి' అని అన్నారు. యావత్ తెలుగు జాతి గర్వపడేలా అనేక రంగాల్లో ఎందరో పెద్దలు విశేష కృషి చేశారని కొనియాడారు. వారి జీవిత చరిత్రలు నేటి తరానికి ప్రాతస్మరణీయం కావాలని ఉద్బోధించారు. మల్లాది కృష్ణానంద్ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కింజరావు అచ్చెన్నాయుడు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద బాబు, సమాచార శాఖ కమిషనర్ సాలడుగు వెంకటేశ్వర్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పెనుమార్పులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలోని వివిధ పాత, పాడైన పంపుసెట్ల స్థానంలో ఇంధన పొదుపు పంపుసెట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎంపిక చేసింది. వివిధ రూపాల్లో 2022 నాటికి 132 బిలియన్ల యూనిట్ల మేర విద్యుత్‌ను పొదుపు చేసేందుకు లక్ష్యంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో గ్రామీణ నీటి సరఫరా విభాగానికి చెందిన పంపుసెట్లను తొలగించి, సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తారు. విద్యుత్ పొదుపునకు సంబంధించి రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ చర్యలను లక్నోలో జరిగే నేషనల్ కాన్ఫరెన్సులో వివరించాలని సీఎస్ దినేష్ కుమార్‌ను ఆహ్వానించింది.

అమిత్ షా మాటలకు అర్థాలు వేరులే

❍ టీడీపీ వ్యాఖ్యలపై ఎదురుదాడి చేయాలని సూచన ❍ మళ్లీ ఆ పార్టీతో వెళ్లాల్సి ఉంటుందని వ్యాఖ్య

ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న ఏపీ నేతలు


ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీతో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఇటీవల కోర్ కమిటీ నేతలకు ఇచ్చిన సూచనలు, ఆదేశాలు ఏవిధంగా అర్థం చేసుకోవాలో తెలియక ఆ పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. ఇటీవల రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ నేతలతో అమిత్‌షా సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే.

ఆ సందర్భంలో మిత్రపక్షమైన తెలుగుదేశంతో వ్యవహరించాల్సిన తీరుపై అమిత్‌షా వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయలను ఏవిధంగా అర్థం చేసుకోవాలో తెలియడం లేదని సీనియర్లు వాపోతున్నారు. ఒకవైపు టీడీపీ నేతలు చేసే విమర్శలపై ఎదురుదాడి చేయాలని చెబుతూనే, వచ్చే ఎన్నికల్లో అదే పార్టీతో వెళ్లాల్సి ఉంటుందనే సంకేతాలిచ్చేలా చేసిన వ్యాఖ్యల్లో ఏది పరిగణనలోకి తీసుకోవాలో, ఏది పట్టించుకోకూడదో తెలియడం లేదని నేతలు చెబుతున్నారు. అమిత్‌షా వ్యాఖ్యల్లో అధిక శాతం తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, మళ్లీ రేపటి ఎన్నికల్లో బాబుతో చర్చలు జరపడం మీ వల్ల కానందున ఆ పని ఓ ప్రముఖుడే చేస్తారని వ్యాఖ్యానించడంతో నేతలు గందరగోళంలో పడ్డారు.

అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అమిత్‌షాతో జరిగిన భేటీలో పాల్గొన్న రాష్ట్ర నేతలు, పార్టీ, కేంద్రంపై టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దానికి స్పందించిన ఆయన 'మీరూ ఎదురుదాడి చేయండి. రాష్ట్రానికి మనం ఇచ్చినవి చెప్పండి. మేము టీడీపీపై మాట్లాడవద్దని ఎప్పుడైనా చెప్పామా? ఇక్కడి నుంచి మీకెవరైనా ఆవిధంగా మాట్లాడవద్దని ఫోన్లు చేశారా? చేయలేదు కదా? మన మీద మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఉండాలని మేమెందుకు చెబుతామ'ని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే వ్యక్తిగత విమర్శలు చేయవద్దని సూచించారు. టీడీపీ మిత్రపక్షంగా ఉంటూ మిత్రధర్మం పాటించడం లేదని, ఓ సీనియర్ నేత ఆయన దృష్టికి తీసుకువెళ్లగా 'ఆయన మనకు మిత్రుడని ఎవరన్నార'ని వ్యాఖ్యానించడంతో సమావేశంలో పాల్గొన్న నేతలు బిత్తరపోయినట్లు సమాచారం.

మళ్లీ అంతలోనే.. వచ్చే ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సమయంలో మీరెవరూ చంద్రబాబుతో మాట్లాడలేరు



అమిత్ షా

కాబట్టి, ఆ బాధ్యతను ఆ వ్యక్తికి అప్పగించాల్సి ఉంటుందని గతంలో సర్దుబాటులో కీలకపాత్ర పోషించిన ఓ ప్రముఖుడిని ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో, నేతలు మళ్లీ గందరగోళంలో పడాల్సివచ్చింది. 'మీరు వెళ్లి బాబుతో ఓ గంట మాట్లాడండి. ఆయన మా మీద ఏం చెబుతారో మీకే తెలుస్తుంద'ని నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తమ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యల్లో ఏది అనుకూలంగా భావించాలి? ఏది ప్రతికూలంగా భావించాలో తెలియక నేతలు తలపట్టుకుంటున్నారు.

అంతకుముందు టీడీపీ నేతలపై రాష్ట్ర బీజేపీ నేతలు చేసిన ఆరోపణలకు సంబంధించిన చర్చ జరిగినప్పుడు.. అమిత్‌షా ఓ కేంద్రమంత్రి వ్యవహారశైలిపై చర్చించడం ఆసక్తికలిగించింది. 'మీ మీద ఆ కేంద్రమంత్రి రోజూ నాకు ఫిర్యాదులు పంపుతుంటారు. మీరు టీడీపీపై చేసే ఆరోపణలను హిందీ, ఇంగ్లీషులో తర్జుమా చేసి పంపుతున్నారు. వాటిని అవతల పారేస్తా (అంటూ తన చేత్తో ఉన్న పేపర్లను విసిరివేశారు) మీరు కూడా వాళ్లు మనమీద ఏం మాట్లాడారో నాకు అదేవిధంగా పంపించండి. రేపు నా దగ్గరకు వచ్చినప్పుడు నేను వాళ్లకు వాటిని చూపిస్తా'ని సూచించారు.

రానున్న ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు కావాలని ఓ కేంద్రమంత్రి తమను అడుగుతున్నారని ఓ నేత అమిత్‌షా దృష్టికి తీసుకువచ్చినప్పుడు ఆయన పెద్దగా నవ్వారు. 'ఆయనకేమైనా చంద్రబాబు సీట్ల సర్దుబాటుపై ఎండార్స్ చేశారా? ఆయనే రోజూ నా దగ్గరకు వచ్చి బాబు గురించి చెబుతుంటార'న్న బాంబు పేల్చడంతో నేతలు విస్తుపోవలసి వచ్చింది. ఈ ఈ చర్చ జరుగుతున్న సమయంలో అమిత్‌షా టేబుల్ ముందు బాబు అవినీతిపై వైసీపీ ముద్రించిన పుస్తకం ఉన్నట్లు సమాచారం.

టీడీపీ ఆరోపణలపై ఎదురుదాడి చేసే అంశంపై చర్చ జరిగిన సందర్భంలో.. అసలు పార్టీ అధ్యక్షుడు హరిబాబు యాక్టివ్‌గా ఉంటే ఈ సమస్యలు ఎందుకొస్తాయలని కొందరు నేతలు చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో ఉన్న హరిబాబు తీవ్రంగా స్పందించారు. నేను పనిచేయకపోతే నన్ను తప్పించండి. నేను రాజీనామా చేస్తానని పక్కనే ఉన్న పార్టీ ఆర్గనైజేషన్ ఇన్చార్జి సతీష్‌జీని ఉద్దేశించి ఆవేశంగా అన్నట్లు తెలిసింది. మొత్తంగా అమిత్‌షా భేటీలో.. మళ్లీ టీడీపీతోనే కలసి వెళ్లబోతున్నామని, అందుకు గతంలో చక్రం తిప్పిన ప్రముఖుడికే చర్చలు, సర్దుబాటు బాధ్యత అప్పగించనున్నారన్న విషయం మాత్రం స్పష్టమయిందని రాష్ట్ర పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక కొత్త వారిని పార్టీలో చేర్చుకోవాలని, వారి స్థాయిని బట్టి తగిన హామీలివ్వాలని అమిత్‌షా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం వరకూ బాగానే ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకూ వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికే అతీ గతీ లేకపోతే ఇక కొత్తవాళ్లు ఏవిధంగా చేరతారని పార్టీ నేతలు చెబుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధులు సద్వినియోగం కావాలి

ఈడీల సమావేశంలో మంత్రి ఆనందబాబు



ఎస్సీ కార్పొరేషన్ ఈడీల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనందబాబు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, ఫిబ్రవరి 6: ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుపేద దళితులకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు ఆయా జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహకరించాలని గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. మంగళవారం గుంటూరు గ్రాండ్ నాగార్జున సమావేశ మందిరంలో 13 జిల్లాల ఈడీలు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి దళిత కుటుంబానికి నెలకు రూ 10వేలు ఆదాయం వచ్చేలా ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ విజయకుమార్‌తో కలిసి గత మూడేళ్లుగా ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ పథకాల పురోగతిపై చర్చించారు. ఈ నెలాఖరులోగా యూనిట్లు గ్రౌండింగ్ కావాలని ప్రతి జిల్లాలో రూ 100 కోట్లతో పథకాలు అమలు చేయాలని సూచించారు. ఈనెల 19 నుంచి జిల్లాల వారీ పర్యటన ఉంటుందని చెప్పారు. 2016-17 సంవత్సరానికి సంబంధించిన యూనిట్లను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 469 మంది లబ్ధిదారులకు 50కోట్ల 23లక్షల 64వేల విలువగల కార్లు, ట్రాక్టర్లు, భూమి కొనుగోలు పథకాలను పంపిణీ చేశారు. గత మూడేళ్లుగా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ 28వేల కోట్లు ఖర్చుచేసినట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ 1380 కోట్లతో అన్ని దళిత కాలనీల్లో 5300 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. ఈ ఏడాది ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2,034 కోట్ల రుణాల మంజూరుకు కార్యాచరణ రూపొందించామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ మాట్లాడుతూ లబ్ధిదారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మరొకరికి అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ, వైస్‌చైర్మన్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, ఉపాధి, పారిశ్రామిక ప్రోత్సాహకాలను దళితులు అందిపుచ్చుకుని ఆర్థిక పరిపుష్టి పొందాలన్నారు. సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన ఈడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆహారంలో మార్పులతో మధుమేహం మటుమాయం

బీపీ, ఊబకాయానికీ చెక్: వీరమాచనేని



సదస్సులో మాట్లాడుతున్న వీరమాచనేని రామకృష్ణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: ఆహారంలో మార్పుల ద్వారా మధుమేహం, బీపీ, ఊబకాయం వంటి వ్యాధులను మటుమాయం చేయవచ్చని వీరమాచనేని రామకృష్ణ చెప్పారు. వెలగపూడి సచివాలయంలో 3వ బ్లాక్ సచివాలయ ఉద్యోగుల సంఘ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆహారం తీసుకోవడంలో విచ్చలవిడితనం వల్ల ఇటువంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. ఆహారంలోనే మందులు ఉన్నాయని, మనం తినే ఆహారంలో మార్పు ద్వారా రోగాలను నయం చేసుకోవచ్చని సూచించారు. తాను డాక్టర్‌ని కాకపోయినా పరిశోధన చేసి మన ప్రాంతానికి అనుకూలమైన ఆహార కార్యక్రమాన్ని రూపొందించి, తన స్వానుభవంతో ఫలితాలు పొందానని తెలిపారు. ఈ విధానం ద్వారా లక్షల మంది ఫలితాలు చవిచూశారని చెప్పారు. మూడు నెలల కాలవ్యవధిలో ఈ ఆహార నియమాలు పాటిస్తే అనేక వ్యాధులు నయమవుతాయని నిరూపితమయిందని చెప్పారు. ఊబకాయం ఓ వ్యక్తి ఉన్న శరీర బరువును బట్టి పది నుంచి 40 రోజుల్లోపు తగ్గుతుందని చెప్పారు. శరీర బరువు తగ్గగానే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయచ్చని, ఆ తరువాత పిండి పదార్థాలు తగ్గించి సాధారణ ఆహారం తీసుకోవచ్చని తెలిపారు. మధుమేహం ఉన్న వారు మాత్రం మూడు నెలలు ఈ విధానాన్ని అనుసరించవలసి ఉంటుందని చెప్పారు. ప్రకృతే మనకు పెద్ద డాక్టర్ అని, ప్రకృతే చాలా వ్యాధులను నయం చేస్తుందన్నారు. ఉదయం మొదలు మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లు (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పిండి పదార్థాలు, రిఫైన్డ్ ఆయిల్ ఆరోగ్యానికి చాలా హాని చేస్తాయని చెప్పారు. యూట్యూబ్‌లో త్వరలో సొంత ఛానల్ ద్వారా ఈ విధానాన్ని తెలియజేస్తానని, అందరి అనుమానాలను నివృత్తి చేస్తానని, ప్రశ్నలకు సమాధానాలు చెబుతానని చెప్పారు. ఈ విధానంలో వంటలకు కొబ్బరినూనె, నెయ్యి, ఆలివ్ ఆయిల్, పెరుగు మీద మీగడ, వెన్న, చీజ్, సముద్రపు ఉప్పు వాడాలని చెప్పారు. సదస్సులో సచివాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇప్పటికే ఈ విధానాన్ని అనుసరిస్తున్నవారు తమ అనుభవాలను, మేలైన ఫలితాలను తెలిపారు. ఊబకాయం పది రోజుల్లో తగ్గినట్లు కొందరు తెలిపారు.

ఇక్కడ కాదు.. ఢిల్లీలో పోరాడాలి!

❑ బంద్‌పై అప్రమత్తంగా ఉండండి: సీఎం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి



చంద్రబాబునాయుడు

అమరావతి, ఫిబ్రవరి 6: బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా కాంగ్రెస్, వామపక్షాలు 8న నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం సాయంత్రం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలీసులు సంయమనం పాటించి, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'మనం శాంతియుతంగా రాష్ట్ర హక్కులు సాధించుకోవాలని చూస్తున్నాం. మన పోరాటం వల్ల కేంద్రం ఇప్పటికి కొంత కదిలింది. ఇంకా కదిలించాలన్నది మన ప్రయత్నం. అయినా బంద్‌లో పాల్గొనే పార్టీలన్నీ పార్లమెంటులోనూ ఉన్నాయి కాబట్టి వాళ్లు అక్కడ పోరాడితేనే ఉపయోగం ఉంటుంది'అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. బడ్జెట్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్న సంకేతాలు ఇప్పటికే వెళ్లినందున, ఆయా పార్టీలన్నీ పార్లమెంటులో ఆందోళన చేస్తే ఉపయోగం ఉంటుందని అన్నారు.

ప్రపంచంతో పోటీ పడుతున్నాం: లోకేష్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి లోకేష్ తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా సిఐఐ ఆధ్వర్యంలో న్యూ యార్కులో ఇన్వెస్టుమెంట్ ప్రమోషన్ అండ్ పార్టనర్‌షిప్ రోడ్ షో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత, లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని పని చేస్తున్నామన్నారు. 15 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వివిధ ఐటి దిగ్గజాలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, ఐటి కంపెనీల కోసం అనేక విధానాలను రూపకల్పన చేశామని తెలిపారు. అనేక రాయితీలు, సత్వర అనుమతులు ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ న్యూయార్కు సందీప్ చక్రవర్తి, యుఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అమీ హరియానీ తదితరులు పాల్గొన్నారు.



న్యూయార్కులో అధికారులతో సమావేశమైన మంత్రి లోకేష్

భూములిచ్చినా పనులు ప్రారంభించరా?

త్వరలో నోటీసులు: గంటా హెచ్చరిక



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో కేటాయించిన భూముల్లో పనులు ప్రారంభించని సంస్థలకు త్వరలో నోటీసులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. కొత్తగా 8 విద్యాసంస్థలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలకు భూములు కేటాయించినట్లు ఆయన తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు కాలవ శ్రీనివాసులు, కామినేని శ్రీనివాస్, నారాయణ, జవహర్, గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. పలు విద్యా సంస్థలకు, ప్రభుత్వరంగ సంస్థలకు భూముల కేటాయింపుపై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో దేశ, అంతర్జాతీయ స్థాయి గల 8 విద్యా సంస్థలకు డే స్కాలర్స్, రెసిడెన్సీ ఆధారంగా 3,4,5,8 ఎకరాల చొప్పున భూములు కేటాయించామన్నారు. భూములు కేటాయించిన విద్యా సంస్థల్లో చిన్మయ్ మిషన్ స్కూల్, స్కాటిస్ హై ఇంటర్నేషనల్ స్కూల్, రేయాన్ గ్లోబల్ స్కూల్, పొడార్ స్కూల్, గ్లండెల్ అకాడమీ, హెరిటేజ్ ఎక్స్‌పెరిమెంటల్ లెర్నింగ్ స్కూల్, సద్భావన, గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఉన్నాయని తెలిపారు. వాటితో సీబీఐ, ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ, ఇండియన్, ఆర్మీ, విదేశీ భవన్, స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ, ఇండియా మెట్రోలజీ డిపార్టుమెంట్, భారత్ పెట్రోల్ కార్పొరేషన్ సంస్థలకూ భూములు కేటాయించామన్నారు. బ్యాంకులకు రూపొందించిన నిబంధనలను అనుసరించి, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకుకు భూములు కేటాయించామన్నారు. ఇటీవల కాలంలో సీఆర్డీఏలో భూములకు విలువ అమాంతం పెరిగిందన్నారు. పనులు ప్రారంభించని సంస్థలకు నోటీసులు జారీచేయాలని మంత్రివర్గ ఉప సంఘంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి గంటా తెలిపారు.

వైద్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులకు 50 శాతం జీతాలు పెంపుదల

వైద్యశాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు 50శాతం మేర జీతాలు పెంచనున్నట్లు మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్న 19,325 కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు పెరగనున్నాయన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై అదనంగా రూ.219.24 కోట్ల భారం పడుతుందన్నారు. ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పీజీ, మెడికల్ పీజీ, పీడీ డిప్లమో, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చదివే విద్యార్థులకు రెండేళ్లుగా రావాల్సిన ఉపకార వేతనాలతో పాటు ప్రస్తుత ఉపకార వేతనాలను చెల్లిస్తామని చెప్పారు. పీజీలకు ఎంతమేర ఉపకార వేతనాలు ఇవ్వాలనే దానిపై కొత్తగా పే కమిటీ ఏర్పాటు చేయనున్నామన్నారు.

మత సామరస్యం మా విధానం!: సీఎం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: మత సామరస్యం తమ విధానమని, ఏ ఒక్కరి మత విశ్వాసాల్లో జోక్యం చేసుకునే ఆలోచన తనకు ఎంత మాత్రం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ముస్లింలు కూడా సూర్యారాధన చేయాలని ప్రభుత్వపరంగా నిర్ణయించినట్లుగా ప్రసారమైన వార్తలతో ఆందోళన చెందిన మజ్లిస్-ఉల్-ఉల్మావల్ ఐమా ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అన్ని మతాల వారి మనోభావాలను గౌరవిస్తూ, మత సామరస్యంతో వ్యవహరించడం తమ విధానమని చెప్పారు. సూర్యుని వలన కలిగే లాభాలను మనం ఆస్వాదించాలని, స్వీకరించి మన ఆరోగ్యం కాపాడుకోవాలన్న ఉద్దేశంతో మాత్రమే 'సూర్యారాధన' కార్యక్రమం చేపట్టామని, మరే విధమైన ఆలోచన తనకు లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.



పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో మాట్లాడుతున్న ఫైర్ డీజీ సత్యనారాయణ

టెక్నాలజీతో ప్రమాదాల అదుపు: ఫైర్ డీజీ

విజయవాడ (క్రైం), ఫిబ్రవరి 6: అగ్నిప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరముందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ కె. సత్యనారాయణ అన్నారు. గాజు ఆధారిత భవనాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలను ఆయన అగ్నిమాపక శాఖాధికారులకు వివరించారు. రాష్ట్రంలోని 13జిల్లాల అగ్నిమాపక శాఖాధికారులకు మంగళవారం నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన 'గాజు ఆధారిత భవనాల్లో అగ్ని ప్రమాద భద్రత' అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపు జరిగింది. సెయింట్ గోబియన్ గ్లాస్ అకాడమీ ప్రతినిధి మనోజ్ మాట్లాడుతూ గ్లాసులోని రకాలు, అగ్నిప్రమాదాలను తట్టుకునే విధంగా భవన నిర్మాణాల్లో వినియోగించాల్సిన గ్లాసు, అదేవిధంగా భవనంలోని ఏ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి అనే అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిటంచారు. అనంతరం కళాశాల ఆవరణలో ప్రాక్టికల్స్ నిర్వహించారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ , ఫిబ్రవరి 6: అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దాదాలూరు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తూ విద్యుత్ షాక్‌తో దినసరి కూలీ ధనుంజయ మృతి సంఘటనపై పెండింగ్ ఎంక్వైరీకి ఆదేశించడంతో పాటు సంబంధిత లైన్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లును తక్షణం సస్పెండ్ చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎంఎం నాయక్ వెల్లడించారు. విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన సంఘటనపై ఆయన స్పందించారు. ఈ సంఘటనలో కనగానపల్లి ఇన్‌ఛార్జిగా ఉన్న సబ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డిని కల్యాణ దుర్గానికి బదిలీ చేశామని, షిఫ్ట్ ఆపరేటర్ పాత్రపై విచారణ కొనసాగుతోందన్నారు. కర్నూలు సీఈ వీరయ్య విచారణ నివేదికను 24 గంటల్లో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి సంస్థ నుంచి రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను అందజేయనున్నట్లు తెలిపారు.

జర్మనీ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

❑ ప్రపంచ స్థాయి కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి



అమర్‌నాథ్‌రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: భారతదేశంలో పారిశ్రామికంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి జర్మనీ పారిశ్రామికవేత్తలను కోరారు. జర్మనీ పర్యటనలో భాగంగా బెర్లిన్‌లో పలు కంపెనీల ప్రతినిధులతో మంగళవారం చర్చించారు. మొదట హర్బర్ కంపెనీ సీఈఓ అలెక్స్ బెర్న్ సోర్స్, అప్లస్ ఆటో ఉపాధ్యక్షుడు హాన్స్ జుర్గన్ చింప్ జెన్‌లతో సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఇప్పటికే ప్రపంచ స్థాయి కంపెనీలు కియా, అపోలో, హీరో తదితర కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయని, పెట్టుబడులతో వస్తే పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి సమావేశమై చర్చించారు. అక్కడి తురింజన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బెంజిమన్‌తో భేటీ అయి ఏపీలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి వివరించారు.

సోము వ్యాఖ్యలతో సంబంధం లేదు: కామినేని

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీపై, సీఎంపై ఎమ్మెల్సీ, బీజేపీ నేత సోము వీర్రాజు ఇటీవల చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, పి.నారాయణతో కలిసి ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. మిత్రపక్షంపై ఏమైనా ఆరోపణలు చేయాలనుకుంటే పార్టీ అంతర్గత సమావేశంలో మాట్లాడాలని బీజేపీ రాష్ట్ర శాఖ స్పష్టం చేసిందని గుర్తు చేశారు. తమ పార్టీ ఆదేశాల మేరకు మిత్రధర్మం పాటిస్తున్నామన్నారు. మిత్రపక్షంపై కాకుండా ప్రతిపక్షంపై విమర్శలు చేయాలని తమ పార్టీ రాష్ట్ర శాఖ చెప్పిందన్నారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలపై ఆయన్నే అడగాలంటూ మీడియా ప్రశ్నలకు సమాధాన మివ్వకుండా దాటవేశారు. విశాఖ రైల్వే జోన్ సాధించి తీరుతామని మంత్రి గంటా తెలిపారు. బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయానికి ఎంపీలలు పార్లమెంట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విశాఖ, విజయవాడ మెట్రో రైల్వే ప్రాజెక్టులకు నిధులు రాబడతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని

రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి



సంగంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న జగన్

ప్రతి ఏటా మే నెలలో రైతులకు పెట్టుబడి సహాయం ◆ రూ.4వేల కోట్లతో విపత్తు నిధి
నవరత్నాల్లో మార్పులు సూచించండి ◆ ప్రజా సంకల్పయాత్రలో వై ఎస్ జగన్

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, ఫిబ్రవరి 6: రైతుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉంటామని, పంటకు మద్దతు ధర అందించేందుకు వీలుగా రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఆయన ప్రజాసంకల్ప యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సంగంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మే నెలలో రైతులకు వ్యవసాయ పెట్టుబడిగా రూ.12,500లను ప్రభుత్వం ద్వారా అందిస్తామన్నారు. రూ.లక్ష వరకూ వడ్డీలేని రుణాలు, లక్ష నుండి రూ.3లక్షల వరకు పావలా వడ్డీకే వ్యవసాయ రుణాలు అందిస్తామన్నారు. ఉచితంగా ప్రభుత్వమే వ్యవసాయ బోర్లు వేయిస్తుందని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు కల్పించడమే తమ ధ్యేయమన్నారు. కరవు, అకాల వర్షాలు వచ్చినపుడు ప్రతి రైతుకు భరోసా కల్పించేందుకు రూ.4వేల కోట్లతో విపత్తు నిధిని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే ఇప్పటికే సమగ్ర సోమశిల ప్రాజెక్ట్ పూర్తయి ఉండేదన్నారు. ఆయన చనిపోయాక సాగునీటి వ్యవస్థను పట్టించుకునే వారే లేరన్నారు. పెన్నా డెల్టా ఆధునీకరణలో భాగంగా 80శాతం పనులు పూర్తయి నాలుగేళ్లయిందని, మిగిలిన 20 శాతం పనులు టీడీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా పూర్తి కాకపోవడం విచారకరం అన్నారు. అన్ని రాష్ట్రాల కంటే పెట్రోలు, డీజల్ ధరలు ఆంధ్రప్రదేశ్‌లోనే అధికంగా ఉన్నాయని అన్నారు. గతంలో రూ.185లకే 13 రకాల నిత్యావసర వస్తువులు రేషన్ షాపుల్లో అందించేవారని, ప్రస్తుతం బియ్యం తప్ప వేరేవి ఏవీ ఇవ్వడం లేదని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు వచ్చాక విద్యుత్ బిల్లులు భారీగా పెంచారని, ఆర్టీసీ చార్జీలు మూడు సార్లు పెంచారని ఆరోపించారు. దోచుకోవడమే చంద్రబాబునాయుడు డిక్షనరీలో అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. ఏపీపీఎస్సీ ద్వారా ప్రతి ఏడాది లక్షా 20వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండగా, గత నాలుగేళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పరిశ్రమలు, ఇతర సంస్థలు వచ్చేవని తద్వార ఉద్యోగ అవకాశాలు యువతకు పెరిగేవని అన్నారు. ప్రత్యేక హోదాను చంద్రబాబునాయుడు అమ్మేశారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో 108ను ప్రజలు మరచిపోయారని, ఆపదలో 108కు ఫోన్ చేస్తే అంబులెన్స్ వస్తోందా? ..అంటూ ప్రజల్ని ప్రశ్నించగా రావడం లేదంటూ వారు బిగ్గరగా సమాధానమిచ్చారు. అంబులెన్స్ డ్రైవర్లకు మూడు నెలల జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. గుండె, న్యూరో సర్జరీలకు శస్త్రచికిత్సలు చేయించుకోవాలంటే ఆరోగ్యశ్రీ కార్డు దారులు హైదరాబాద్ వెళ్లాలని, అక్కడ ఆరోగ్యశ్రీ వర్తించడం లేదని అన్నారు. ఇలాంటి చూస్తుంటే ఎంతో ఆవేదనగా ఉందన్నారు. గత నాలుగేళ్ల పరిపాలనలో టీడీపీ ప్రభుత్వం ఒక్క పేదవాడికైనా ఇల్లు కటించిందా అన్ని జగన్ ప్రశ్నించారు. అభివృద్ధి అంటే నిన్నటి కంటే నేడు బాగుండడమని, నాలుగేళ్ల చంద్రబాబు పాలన ఎలా ఉందనేది ప్రజలు గుండెలపై చేతులు వేసుకొని ఆలోచించాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ అని చెబుతున్నారని, ప్రభుత్వం చేసిన రుణమాఫీ రైతు రుణాల వడ్డీలకు సరిపోవడం లేదని అన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని, జాబు లేని వారికి నిరుద్యోగ భృతి కింద రూ.2వేలు అని ఎన్నికల హామీలు ఇచ్చారని, ఎవరికైనా రాష్ట్రంలో నిరుద్యోగ భృతి కింద ఒక్క రూపాయైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఇంటికి కేజీ బంగారం ఇస్తామని చంద్రబాబునాయుడు చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వై ఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రకు ప్రజలు నీరాజనాలు అందిస్తున్నారు. యాత్ర సాగుతున్న దారుల వెంబడి వందల సంఖ్యలో బారులుగా నిలబడి జగన్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యాలు దర్శనమిచ్చాయి. సంగంలో నిర్వహించిన బహిరంగ సభకు వేల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. పాదయాత్రలో జగన్‌తో పాటు నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జిల్లా వైకాపా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీపై అప్పల భారం
రూ.2,16,027 కోట్లు

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్‌పై గత సంవత్సరం మార్చి నాటికి ఉన్న అప్పుల భారం అక్షరాల రూ.2,16,027 కోట్లుని ఆర్థికశాఖ సహాయమంత్రి పి రాధాకృష్ణన్ వెల్లడించారు. వైకాపా ఎంపీ వియసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో మంత్రి సమాధానం ఇస్తూ ఈ అప్పులపై 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.14,738 కోట్లు రూపాయలను వార్షిక వడ్డీ కింద చెల్లించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిపారు. 14వ ఆర్థిక సంఘం వివిధ రాష్ట్రాలకు సంబంధించి రూపొందించిన ద్రవ్య సూచిక ప్రకారం ఏపీ రాష్ట్ర రుణ-స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి నిష్పత్తి 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను 25.09 శాతం ఉంటుందని అంచనా వేసింది. అయితే 2017-18 రాష్ట్ర బడ్జెట్‌లో అది 28.11శాతానికి చేరే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్లు రాధాకృష్ణన్ తెలిపారు.

ఏపీ నూతన రాజధాని నగరం నిర్మాణ ప్రాజెక్టు కోసం రూ.3,324 కోట్లు రూపాయల రుణం మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞాప్తిని ఇంకా ప్రపంచ బ్యాంకు పరిశీలన దశలోనే ఉందని రాధాకృష్ణన్ వెల్లడించారు. రాజ్యసభలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై ప్రపంచ బ్యాంకు బృందం ప్రస్తుతం మదింపు చేస్తుందని, అందులో భాగంగానే ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రాథమిక అంచనాలు, అధ్యయనాలు కొనసాగుతున్నాయన్నారు. ఒకసారి ప్రాజెక్టు మదింపుపూర్తయిన తర్వాత రుణ మంజురుపై సంప్రదింపులు జరుగుతాయని తెలిపారు. ఈ సంప్రదింపులు విజయవంతంగా పూర్తియిన తదుపరి ప్రపంచ బ్యాంక్ రుణం మంజూరుపై ఆమోద ముద్ర వేస్తుందని కేంద్రమంత్రి చెప్పారు. రుణానికి సంబంధించిన షరతులు, నిబంధనలు సంప్రదింపుల సమయంలోనే చర్చకు వస్తాయని కూడా రాధాకృష్ణన్ స్పష్టం చేశారు.

కాగా శాసనసభ స్థానాలు పెంచాలంటే ఆర్టికల్ 170ను సవరించాల్సి ఉంటుందని కేంద్ర సహాయమంత్రి హన్స్ రాజ్ గంగారం అహిర్ తెలిపారు. లోక్‌సభలో తెలుగు రాష్ట్రాలలోని అసెంబ్లీ సీట్ల పెంపునకు సంబంధించిన ప్రశ్నను ఎంపీ మురళీమోహన్ అడిగారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ ఏపీ విభజన చట్టం సెక్షన్-26 ఏం చెబుతోందంటే ఏపీలోని 175 స్థానాల నుంచి 225కి, తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 స్థానాల నుంచి 153 స్థానాలకు పెంచాలని ఉందని కేంద్రమంత్రి తెలిపారు. అయితే రాజ్యాంగంలోని 170(3) ప్రకారం అన్ని రాష్ట్రాల్లోని అసెంబ్లీ సీట్ల సంఖ్య 2026లో జనాభాలెక్కల పూర్తయ్యే వరకూ సాధ్యం కాదన్నారు. అయితే ఆర్టికల్ 170ని సవరిస్తే అది సాధ్యమవుతుందని హన్స్‌రాజ్ గంగారం అహిర్ పేర్కొన్నారు.

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీశైలం, ఫిబ్రవరి 6: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చక వేదపండితులు సంప్రదాయబద్ధంగా యాగశాలలో ఆగమశాస్త్రానుసారం అఖండ స్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు నిర్వహించారు. పూజలు నిర్వహించే అర్చకులు, వేద పండితులకు దీక్షావస్త్రాలను ఈఓ అందజేశారు. సాయంత్రం అంకురార్పన, అగ్ని ప్రతిష్టాపనలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద సకల దేవతలు, చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ పరమశివుని వాహనం నందీశ్వరుడిని చిత్రీకరించిన ధ్వజపటాన్ని వేదమంత్రోచ్చారనల నడుమ ఎగురవేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ నారాయణ భరత్‌గుప్త, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు. ఆలయ పుష్కరిణి, శ్రీ భ్రామరి కళావేదికలో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చెత్తతో నింపేయకండి

కాలువలు, డ్రైన్లలో ప్లాస్టిక్ వస్తువులు నియంత్రించండి ◆ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: వివిధ నగరాలు, పట్టణాల్లో కాలువలు, డ్రైన్లలో ఇష్టానుసారం ప్లాస్టిక్ వస్తువులను వేయకుండా నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో అమృత్ పథకానికి సంబంధించి 8వ రాష్ట్రస్థాయి హైపవర్ స్టీరింగ్ కమిటీ సీఎస్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని కాలువలు, డ్రైన్లలో ఇష్టానుసారం ప్లాస్టిక్ వస్తువులను వేయడం వల్ల జల, వాయు కాలుష్యం ఏర్పడుతోందని, దీన్ని పూర్తిగా నివారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రోడ్ల పక్కన చెత్తను, ఇతర వ్యర్థ పదార్థాలను కుప్పలుగా వేయడం ద్వారా దుర్గంధం వ్యాపించడంతోపాటు ప్రజలు అనేక రకాల అనారోగ్యాలకు లోనుకావాల్సి వస్తోందని దీనిపై కూడా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్ల వెంబడి వైర్లు, ఇతర కేబుల్ వైర్లను వేసేందుకు రోడ్లను ఇష్టానుసారం తవ్వకుండా నివారించేందుకు, గొట్టాల ద్వారా అలాంటి వైర్లు, కేబుల్స్ వేసేందుకు వీలుగా పీపీపీ విధానంలో ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను సీఎస్ ఆదేశించారు. పట్టణాభివృద్ధి శాఖ సంచాలకులు కె.కన్నబాబు మాట్లాడుతూ సాప్ 2016-20 ఐదేళ్ల ప్రణాళిక కింద అమృత్ పథకం కింద 3వేల 762 కోట్ల రూపాయల అంచనాతో వివిధ పట్టణాల్లో తాగునీరు, సీవేజ్ వాటర్ మేనేజ్‌మెంట్, స్టారమ్ వాటర్ డ్రైనేజి, పార్కులు, స్థలాల సుందరీకరణ వంటి 179 ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, తాడేపల్లిగూడెం, నెల్లూరు, విజయనగరం, అనంతపురం, కడప, కర్నూలులలో ఏర్పాటు చేస్తున్న వ్యర్థాల నుండి ఇంధనం (వేస్టు టు ఎనర్జీ) తయారీ ప్రాజెక్టులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శ సమీక్షించారు.



ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు శ్రీకారం

విజయవాడ, ఫిబ్రవరి 6: రోజురోజుకీ భారీగా పేరుకు పోతూ, పర్యావరణానికి సవాల్‌గా మారుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల సమస్యకు విజయవాడకు చెందిన ఒక సంస్థ పరిష్కారాన్ని ఆవిష్కరించింది. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు శ్రీకారం చుట్టింది. వాటిని నూరు శాతం రీ-సైక్లింగ్ చేసేలా ఒక సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని, పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. ఆధునిక జీవితంలో ఎలక్ట్రానిక్ ఉపకరణాల వినియోగం ఎక్కువైంది. పాడైన ఈ ఉపకరణాలను పర్యావరణానికి విఘాతం కలిగించకుండా రీ-సైకిల్ చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. నగరాల్లో కొంతమంది వ్యర్థాల కొనుగోలుదారులు వీటిని కొనుగోలు చేస్తున్నప్పటికీ, వాటిల్లో తమకు కావాల్సిన విలువైన లోహాలకు సంబంధించినవి తీసుకుని, మిగలినవి డంపింగ్ యార్డుల్లో పడవేస్తున్నారు. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్సు, ఎలక్ట్రానిక్స్ విభాగం ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు శ్రీకారం చుట్టింది. కళాశాల సమీపంలో ఒక డస్టుబిన్‌ను ఏర్పాటు చేశారు. అందులో వేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సహకారంతో చెన్నై, పూనేలో ఉన్న కరో సంభవ్ సంస్థకు పంపిస్తారు. అక్కడ నూరు శాతం ఈ వ్యర్థాలను రీసైకిల్ చేస్తారు. ఈ సందర్భంగా 'ఆంధ్రభూమి'తో ఆ కళాశాలకు చెందిన డాక్టర్ ఆర్ కామేశ్వరి మాట్లాడుతూ ఈ తరహా డస్టుబిన్ రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. పర్యావరణానికి తమ వంతు కృషిగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

సమష్టిగా పోరాడితే హోదా సాధ్యమే



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయాలి ★ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన పార్టీ ఎంపీలు, విపక్ష ఎంపీలు కలిసి ప్రధాని మోదీ ఇంటి ముందు ధర్నా చేస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభిస్తుందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. 1960కి ముందు తమిళనాడు అత్యంత పేదరికంలో ఉండేదని, అక్కడి నేతలందరూ కలసికట్టుగా కేంద్రంపై పోరాడటం వల్లే నేడు ధనిక రాష్ట్రంగా మారిందన్నారు. తమిళనాడును ఆదర్శంగా తీసుకుని ఆంధ్రప్రదేశ్ నాయకులందరూ రాష్ట్రాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబులో పోరాట పటిమ తగ్గిపోయిందని, ఢిల్లీ స్థాయిలో తెలుగువాడి ఆత్మగౌరవాన్ని చాటిన దివంగత నేత ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఓసారి చూసి ధైర్యం తెచ్చుకోవాలని సూచించారు. ప్రధాని ఇంటిముందు ధర్నాచేస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్పకుండా వస్తుందని వ్యాఖ్యానించారు. తన ప్రభుత్వంలోనే అధికారుల తీరును నిరసిస్తూ శ్రీకాకుళంలో ధర్నా చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నాలుగేళ్లుగా మౌనంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఆడుతున్న డ్రామాలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ఎంపీలందరూ కలసి ప్రధాని మోదీ ఇంటి ముందు ధర్నా చేస్తే కనీస గౌరవమైనా దక్కుతుందన్నారు. తెలుగుదేశానికి చెందిన ఎంపీలందరూ వ్యాపారాల్లో తలమునకలయ్యారని, అనేక మంది కాంట్రాక్టర్లుగా అవతరించారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే తీరిక వారికి లేదని వ్యాఖ్యానించారు. గుజరాత్‌కు చెందిన కొందరు నేతలతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అనే అంశం ముగిసిన అధ్యాయమంటూ ప్రధాని వ్యాఖ్యానించినట్టు వార్తలొచ్చాయని, ఇది ముగిసిన అధ్యాయం కాదని, ప్రత్యేక హోదా సాధనతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని చలసాని పేర్కొన్నారు. కేంద్రం నుండి రావల్సిన లోటు బడ్జెట్ రూ.16,300 కోట్లకు సంబంధించి తాజా బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. పీసీపీఐఆర్ కోసం రూ.300 కోట్లు ప్రకటించి, దాన్నిపుడు బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. విశాఖ రైల్వేజోన్ ఊసే లేదని, రాజధాని ప్రస్తావన లేదని, పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించలేదని ఆందోళన వ్యక్తంచేశారు. విలేఖర్ల సమావేశంలో సాధన సమితి జిల్లా అధ్యక్షుడు తాటిపాక మధు, రైతు సంఘం నాయకుడు సత్తిరాజు పాల్గొన్నారు.

ఫలించిన సీఎం 'నవీన్' వ్యూహం

ఒడిశా ఎత్తుకు ఆంధ్రా చిత్తు

★ రైల్వే జోన్, పోలవరంపై కేంద్రం నిస్సహాయత
★ ఉత్తరాంధ్ర ప్రయోజనాలతో బీజేపీకి ఒరిగేది ఏమీలేదు
★ కేవలం విశాఖ బీజేపీ ఎంపీ అభ్యర్థికే నష్టం

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, ఫిబ్రవరి 6: నిన్నమొన్నటిది కాదు ఆంధ్రా-ఒడిశా వాగ్యుద్ధం... మూడున్నర దశాబ్దాలుగా వంశధార జలవనరుల వాటాల కోసం ప్రారంభమైన రాజకీయ రగడ... ఇప్పటికీ రాజుకుంటోంది. ఒక్క వంశధారపై విజయం సాధించిన ఏపీ ప్రభుత్వాన్ని చిత్తు చేయాలన్న ఒడిశా ఎత్తుగడ ఈసారి చక్కగా ఫలించింది. కేంద్ర బడ్జెట్‌లో విశాఖ రైల్వే జోన్ ఊసెత్తకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల అంశాల ప్రస్తావనే లేకపోవడం, ఎన్నో ఏళ్ళుగా రాజకీయ యుద్ధం చేస్తున్న ఒడిశా ఆంధ్రాపై విజయం సాధించినట్టు అయ్యింది. దీంతో ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయిక్ 2019 ఎన్నికల వ్యూహాన్ని బీజేపీ అంగీకరించినట్టు అయ్యింది. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తే బీజేపీ ప్రభుత్వానికి కేవలం అరకు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఎంపీల మద్దతు మాత్రమే లభిస్తుంది. అదే నవీన్‌పట్నాయిక్ వ్యూహాన్ని అమలు చేస్తే 21 మంది ఎంపీలు, పది మంది రాజ్యసభ సభ్యులు ఎన్‌డీఏ ప్రభుత్వానికి అండగా నిలుస్తారన్నదే బీజేపీ అధినాయకత్వం లెక్కలు. విశాఖ రైల్వే జోన్ ఇక రాదంటూ ఈ బడ్జెట్ సమావేశాల్లో సుస్పష్టమైంది. అలాగే, ఆదాయంలో చూస్తే విశాఖ జోన్‌కు ఏడాదికి రూ. 16,000 కోట్లు లభిస్తుంది. ఇంతపెద్ద మొత్తాన్ని వదులుకోవడానికి ఒడిశా సిద్ధంగా లేదని కేంద్రానికి నవీన్ పట్నాయిక్ ప్రభుత్వం చెప్పడంతో ఆ ప్రతిపాదనకే బీజేపీ మొగ్గుచూపింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారమే కేంద్రం నుంచి రావలసిన రైల్వేజోన్ 2018-19 బడ్జెట్ లోనూ మంజూరు కాలేదు.

2019లో ఎనిమిది రాష్ట్రాలకు, లోక్‌సభకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ ఎనిమిది రాష్ట్రాల్లో మనది ఒకటి. విశాఖ రైల్వేజోన్ కావాలని అధికార, ప్రతిపక్షాలన్నీ డిమాండ్ చేశాయి. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ముందస్తుగానే మోదీ సర్కార్‌పై సిక్కోల్ నుంచి 'రామ'బాణం సంధించారు. ప్రైవేటు బిల్లును కూడా ప్రవేశపెట్టారు. విశాఖ రైల్వే జోన్ పట్ల శీతకాలం సమావేశాల్లో కేంద్రం అనుకూలంగానే స్పందించి, చర్చకు అవకాశం కల్పించింది. కానీ, బడ్జెట్ సమావేశంలో మాత్రం ప్రత్యేక రైల్వే జోన్ ఊసేత్తలేదు. కేంద్ర మంత్రి సుజనాచౌదరి రైల్వే జోన్ ఒక కొలిక్కివచ్చినట్టు బడ్జెట్ ప్రవేశపెట్టడానికి 24 గంటల ముందు వెల్లడించారు. మాజీ మంత్రి కొణతాల బృందం రైలు దీక్ష పేరుతో ఢిల్లీ వెళ్ళి, విశాఖ జోన్ డిమాండ్‌కు మద్దతివ్వాలని దాదాపు అన్నీ పార్టీల నేతలను కలుసుకుని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ - బిజేపీ కూటమి ప్రయోజనాల కోసం విశాఖ రైల్వే జోన్ ప్రకటిస్తారని ఆశించారు. కానీ, దీనివల్ల టీడీపీకి ఎక్కువ ప్రయోజనం జరుగుతుందని, ఉత్తరాంధ్రలో విశాఖ ఎంపీ సీటుతో తప్ప బీజేపీకి ఉపయోగం లేదన్న భావనతో మోదీ సర్కార్ రైల్వే జోన్ ప్రతిపాదనలన్నీ పక్కన పెట్టేసిందన్న మాట వినిపిస్తోంది. పోలవరం ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి సాయం కూడా లేకపోవడం వల్ల రాష్ట్రానికి పూర్తిగా కేంద్రం పక్కన పెట్టినట్టయ్యింది. బీజేపీకి ఒడిశాలో నవీన్‌పట్నాయిక్ ప్రభుత్వం అవసరం ఉన్నందునే, ఆ రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుల జోలికి వెళ్ళలేదనే ఆరోపణలు చాలా కాలం నుంచి ఉన్నాయి. ఈ ఎత్తగడలోనే ఏపీని పట్టించుకోలేదన్న అనుమానాలు బలపడుతున్నాయి.

రాష్ట్రంలో 4600 టన్నుల ఎర్రచందనం నిల్వలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో ప్రస్తుతం 4600 టన్నుల ఎర్ర చందనం నిల్వలు ఉన్నాయని, వాటిని ఎప్పటికపుడు వేలం నిర్వహించి ఆదాయాన్ని రాబట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు తెలిపారు. అయితే వేలం నిర్వహణకు కేంద్రం నుంచి అనుమతి రావడం ఆలస్యమవుతోందన్నారు. ఎర్రచందనం అమ్మకాల కోసం ఎప్పటికపుడు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరుతున్నామన్నారు. వేలం ద్వారా ఎర్ర చందనం అమ్మకాలు జరిగితే అక్రమ రవాణాను అరికట్ట వచ్చన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం మంత్రి అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. అటవీ ప్రాంతంలో చెక్‌డ్యామ్‌లు, వాటర్ షెడ్ నిర్మాణాలకు, వన్యప్రాణుల సంరక్షణకు, భూగర్భ జలాలను పెంపొందించడానికి రూ.500 కోట్లు కేటాయించామన్నారు. వనం-మనంలో భాగంగా భారీ సంఖ్యలో మొక్కలు నాటామని మంత్రి శిద్ధా తెలిపారు. రాష్ట్రంలో 20 కోట్ల మొక్కలను నాటామన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు.

నల్లమలలో నక్సల్ డంప్


ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, ఫిబ్రవరి 6: కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం నాగలూటి గూడెం సమీపంలో మంగళవారం పోలీసులు నక్సలైట్ల డంప్ స్వాధీనం చేసుకున్నారు. గూడెం సమీపంలోని వీరభద్రస్వామి ఆలయం మెట్ల పక్కన గతంలో నక్సలైట్లు దాచిన డంప్ లభించింది. ఇందులో గ్రెనేడ్లు, గ్రెనేడ్ల తయారీకి ఉపయోగించే పనిముట్లు, జిలెటిన్ స్టిక్స్, పిన్ బాంబులు, ఒక వైర్‌లెస్ సెట్టు లభించినట్లు ఆత్మకూరు డిఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. నల్లమల అరణ్యంలో నక్సల్ ప్రభావం ఉన్న సమయంలో వీటిని దాచి ఉంచారని ఆయన తెలిపారు. డంప్ విషయంపై అందిన సమాచారం మేరకు తవ్వకాలు జరుపగా లభ్యమైందని పేర్కొన్నారు. కాగా శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యేందుకు భక్తులు పెద్ద ఎత్తున పాదయాత్ర చేస్తూ ఈ మార్గంలో వెళ్తున్నారు. ఈ మార్గంలో ప్రమాదకర వస్తువులు ఉన్న డంప్ లభ్యమైందని తెలియడంతో భక్తులు ఉలిక్కిపడ్డారు. నక్సల్ డంప్‌లు ఉంటాయన్న అనుమానాన్ని భక్తులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఆధునిక పరికరాలతో డంప్‌లపై నిర్ధారించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

బోగస్ ల్యాండ్ పూలింగ్‌లో అక్రమాలపై దర్యాప్తు జరపాలి

సీఆర్‌డీఏ ఆఫీసు ఎదుట సీపీఎం ధర్నా

విజయవాడ (కార్పొరేషన్), ఫిబ్రవరి 6: అక్రమ ల్యాండ్ పూలింగ్ వ్యవహారాన్ని నిరసిస్తూ తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలన్న డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యంలో నగరంలోని సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. సీపీఎం నేత సిహెచ్ బాబూరావు అందించిన వినతిపత్రాన్ని స్వీకరించిన శ్రీధర్ దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోపక్క అమరావతి రాజధాని నిర్మాణానికి సేకరించిన భూ సేకరణ ప్రక్రియలో నెలకొన్న అక్రమాలపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ మేటి రాజధానిగా నిర్మించాలన్న లక్ష్యంతో భారీ స్థాయిలో వివిధ ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ఇప్పుడిప్పుడే నిర్మాణ పనులు జరుగుతున్న తరుణంలో అవినీతి అక్రమాలు జరిగాయంటూ వినిపిస్తున్న ఆరోపణలు సీఆర్‌డీఏలో కలకలం రేపాయి. జరిగిన ఘటనపై సీఎం చంద్రబాబుకు ఇప్పటికే ప్రాథమిక సమాచారాన్ని అందించిన సీఆర్‌డీఏ సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. భూమి లేని వ్యక్తికి భూ సమీకరణ ఇచ్చిన రైతుల జాబితాలో చేర్చి ప్లాట్ల కేటాయించిన వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా శాఖాపరమైన విచారణకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సగిలి షణ్మోహన్ నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. ఊహించని విధంగా ఈఘటన బహిర్గతం కావడంతో అధికారులలో ఆందోళన ప్రారంభమైంది. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పూర్తయి సంవత్సరాలు గడిచిన తరువాత బహిర్గతం కావడం అవినీతి అధికారులకు మింగుడు పడటం లేదు. సీఆర్‌డీఏ తన తప్పిదాన్ని దిద్దుబాటు చర్యలకు దిగింది. కంప్యూటర్ ఆపరేటర్ ఆన్‌లైన్ రికార్డుల తారుమారు చేసినట్టు గుర్తించగా, సదరు ఆపరేటర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశామని కమిషనర్ తెలిపారు. ఆపరేటర్ పైనే కాకుండా అందుకు సహకరించిన అధికారులపైన కూడా క్రిమినల్ చర్యలుంటాయని తెలిపిన శ్రీధర్ 30రోజులలో చేయాల్సిన ప్రాసెస్ ఒకే రోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటలలోగా పూర్తి చేసి రికార్డుల్ని తారుమారు చేయడం, ఈ అక్రమానికి పాల్పడిన పఠాన్ గౌస్‌ఖాన్ రెవెన్యూ రికార్డుల్లో లేనదని, ఈ వ్యవహారంలో డెప్యూటీ తహశీల్దార్ లేదా కాంపిటెంట్ అథారిటీ ఎవరి పాత్ర ఉన్నదన్నది విచారణలో తేలుతుందన్నారు.



సీఆర్‌డీఏ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఆఫ్రికా ఖండపు పశ్చిమతీరంలో అపహరణకు గురైన ఇరవై ఇద్దరు భారతీయులకు ఐదురోజుల తరువాత విముక్తి లభించడం ఆనందకరం, ఆశ్చర్యకరం! ఎందుకంటే సముద్ర జలాలలో అపహరణకు గురవుతున్న భారతీయులు, ఇతర దేశాల వారు వారాల తరబడి, నెలల తరబడి బందీలుగా ఉండడం దశాబ్దాలుగా నడుస్తున్న చరిత్ర! ఆధునిక సాంకేతిక సమాచారం విస్తరిస్తున్న కొద్దీ, ఈ సమాచార విజ్ఞాన వ్యవస్థ నాగరిక వ్యవస్థలకు మాత్రమేకాక నేరస్థులకు కూడా వినియోగపడుతోంది. సముద్ర జలాలలోని ఓడలతోను గగనతనంలోని విమానాలతోను భూ ఉపరితలంలోని 'నిఘా' కార్యాలయాలకు నిరంతరం అనుసంధానం ఏర్పడి ఉంటోంది. కానీ నౌకలను, విమానాలను అపహరించుకొని పోగలుగుతున్న నేరస్థుల ముఠాలు ఈ సమాచార అనుసంధాన వ్యవస్థను భగ్నం చేయగలుగుతున్నాయి. గినియా సింధుశాఖ నుండి 'గాయబ్' అయిన నౌకలోని మనవారు సురక్షితంగా మంగళవారం బయటపడడం దైవఘటన. గగనతలంలోను, తీరజలాలలోను అంతర్జాతీయ సముద్ర భద్రత క్షీణించిపోతోందనడానికి ఇది మరో నిదర్శనం మాత్రమే! వాణిజ్య నౌకల అపహరణ, సిబ్బందిని నిర్బంధించడం, నౌకలు ఢీకొనడం, నౌకలలో నుండి మరో నౌక మీదికి, పడవల మీదికి కాల్పులు జరపడం వంటి ఘటనలు తీర ప్రాంత సముద్ర జలాలలోను, అంతర్జాతీయ జలాలలోను నిరంతరం జరుగుతున్నాయి. మన దేశానికి చెందిన ఇరవై రెండుమంది వాణిజ్య నౌకాసిబ్బంది ఫిబ్రవరి ఒకటవ తేదీన కనిపించకుండా పోవటం సరికొత్త వైపరీత్యం. 'ఎమ్‌టి మెరైన్ ఎక్స్‌ప్రెస్' అన్న పనామా దేశానికి చెందిన వాణిజ్య నౌక ఆఫ్రికా పశ్చిమ తీరం సమీపంలోని సముద్ర జలాలలో పయనిస్తుండిన సమయంలో గల్లంతయిపోయింది. ఈ ఓ డను నడుపుతుండిన ఇరవై రెండు మంది భారతీయుల ఆచూకీ మంగళవారం వరకూ తెలియకపోవడం ఆందోళన కలిగించిన విపరిణామం! పశ్చిమ ఆఫ్రికాలోని బెనిన్ దేశపు 'కోటోనోయూ' ఓడ రేవులో ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకూ ఈ వాణిజ్య నౌక ఆగి ఉంది. దాదాపు పదునాలుగువేల టన్నుల ఇంధనం చమురును రవాణా చేస్తుండగా ఈ నౌక ఒకటోవ తేదీ ఉదయం 'కోటోనోయూ' నుంచి ఎల్ల బారిందట.. మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో ఓడకు సంస్థ కార్యాలయంతో సమాచార సంబంధాలు తెగిపోయాయిట! ముంబయిలోని మన అధికారులకు మూడవ తేదీన ఈ సమాచారం అందింది. అట్లాంటిక్ సముద్రంలో 'గినియా' సింధుశాఖలో పయనిస్తుండిన సమయంలో ఈ పనామా నౌక అదృశ్యమైంది. ఈ నౌక జాడ కోసం బెనిన్, నైజీరియా దేశాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు మన విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ సోమవారం ప్రకటించారు!

ఓడదొంగలు ఈ అపహరణకు పాల్పడవచ్చునన్నది మొదట వ్యక్తమైన అనుమానం! నైజీరియా, బెనిన్ దేశాలు ఆఫ్రికా పశ్చిమ సముద్ర తీరంలో నెలకొని ఉన్న ఇరుగు పొరుగు దేశాలు! నైజీరియా తీరం మాదకద్రవ్యాలను దొంగరవాణా చేస్తున్న అంతర్జాతీయ ముఠాలకు ఆలవాలమై ఉంది! అందువల్ల భారతీయ నౌక అపహరణకు ఈ ముఠాలు పాల్పడి ఉండవచ్చు! నైజీరియాకు చెందిన వందలాది నేరస్థులు మన దేశంలోకి చొరబడి తిష్ఠవేసి ఉన్నారు! గోవాలో అక్రమంగా తిష్ఠవేసి ఉన్న నైజీరియా పౌరులు మాదకద్రవ్యాల 'పంపిణీ' వ్యవస్థను నిర్వహిస్తుండినట్టు 2013 నవంబర్‌లో పెద్ద ఎత్తున ప్రచారమైంది. గోవాలోని స్థానిక ప్రజలకు, నైజీరియా అక్రమ ప్రవేశకులకు మధ్య అంతకు పూర్వం తరచూ ఘర్షణలు సంభవించేవి. 2013లో జరిగిన ఘర్షణల తరువాత గోవా ప్రభుత్వం నైజీరియా జనాలను బయటికి తరలించే చర్యలను చేపట్టింది. ఈ చర్యలకు వ్యతిరేకంగా ఆఫ్రికా దేశాలలో గగ్గోలు చెలరేగడం, ఆఫ్రికాలోని ప్రవాస భారతీయలపై దాడులు జరగడం ఆ తరువాతి కథ! ప్రస్తుతం నైజీరియా 'మాదక' విక్రేతలు మన దేశమంతటా పట్టుబడుతున్నారు, హైదరాబాద్‌లో కూడా పట్టుబడ్డారు! గినియా సింధుశాఖ నుండి నౌక గల్లంతు కా వడం వెనుక నైజీరియా 'మాదకం' ముఠాలు ఉండవచ్చునన్న అనుమానం అతార్కికం కాజాలదు..

ఓడదొంగల ముఠాలు ప్రధానంగా సోమాలియా సముద్రతీరంలో స్థావరాలను ఏర్పరచుకొని ఉ న్నాయి. మన వాణిజ్య నౌకల అపహరణకు పాల్పడుతున్న ఓడదొంగలు ప్రధానంగా ఈ 'సోమాలియా' ముఠాల వారు. 'సోమాలియా' ఆఫ్రికా తూర్పుతీరంలో ఉంది. సోమాలియాకూ మన దేశానికీ మధ్య అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం విస్తరించి ఉన్నాయి. ఈ సోమాలియా ఓడదొంగల 'కాటు' సముద్రజలాలలో ఎక్కువగా ఉంది. మన వాణిజ్య నౌకలను 'సోమాలియా' దొంగలు అనేకసార్లు అపహరించుకొని పోవడం, నెలల తరబడి నిర్బంధించడం చరిత్ర.. గత ఏప్రిల్‌లో సోమాలియా సముద్రతీరం సమీపంలోని అంతర్జాతీయ జలాలలో పయనిస్తుండిన మన వాణిజ్య నౌకను ఓడదొంగలు అపహరించుకొనిపోయారు. ఈ నౌకలోని తొమ్మిది మంది భారతీయులను మూడు రోజులపాటు తిండిపెట్టకుండా నిర్బంధించి ఉంచారు. సముద్రజలాల నుంచి ఈ 'సిబ్బంది'ని సోమాలియా భూభాగంలోని మారుమూల ప్రాం తానికి తరలించుకొని వెళ్లి నిర్బంధించారు! అం దువల్ల మన నౌకాదళం సి బ్బంది కాని, గస్తీ నౌకలు కాని ఈ ఓడదొంగలపై దాడిచేసే అవకాశం లేకుండా పోయిం ది. సోమాలియా ప్రభు త్వ దళాల సహకారంతో మాత్రమే అప్పుడు మన ప్రభుత్వం మన సిబ్బందికి విముక్తి కలిగించింది!

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

బుధవారం, 7 ఫిబ్రవరి 2018

భద్రత లేని సముద్రం

ఇప్పుడు కూడా ఒకటవ తేదీన గినియా సింధుశాఖ నుండి అదృశ్యమైన పనామా ఓడకు, నౌకలోని మన వారికి విడుదల లభించడానికి నైజీరియా, బెనిన్ ప్రభుత్వ దళాల కృషి కారణం! బందీలకు అపహరణ కర్తలు ఎలాంటి హాని కలిగించని రీతిలో గత ఏప్రిల్‌లో సోమాలియా ప్రభుత్వ దళాలు, ఇప్పుడు నైజీరియా, బెనిన్ ప్రభుత్వాల ఉమ్మడి దళాలు భారతీయులను విడిపించగలిగాయి! అయితే మన నౌకా చోదకులను అపహరించింది ఎవరన్నది ఇప్పటికీ స్పష్టం కాలేదు. పనామా దక్షిణ అమెరికా ఖండం ఉత్తర అమెరికాలో కలిసే చోట నెలకొని ఉన్న చిన్న దేశం. అయితే అంతర్జాతీయ నౌకాయాన వ్యవస్థలో పనామాకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రశాంత మహాసాగరం-పసిఫిక్ ఓషన్- అట్లాంటిక్ మహా సముద్రంతో కలుపుతున్న 'పనామా జలమార్గం' ఇందుకు కారణం! ఎనబయి రెండు కిలోమీటర్ల పొడైన ఈ 'పనామా కాలువ' మానవ నిర్మితం! ఈ అంతర్జాతీయ జలమార్గాన్ని 1904 నుంచి పదేళ్లపాటు నిర్మించారు. 1914 ఆగస్టు 15వ తేదీన ఈ అంతర్జాతీయ జలమార్గం ప్రారంభం కాక పూర్వం ఐరోపా, ఆఫ్రికా నౌకలు అట్లాంటిక్ సముద్రం నుంచి పసిఫిక్ సముద్రంలోని వెళ్ళడానికి దక్షిణ అమెరికా ఖండాన్ని చుట్టి వెళ్లవలసి ఉండేది. దీని వల్ల అనేక వేల కిలోమీటర్లు వారాల తరబడి పయనించవలసి వచ్చేది. 2000 సంవత్సరం నుంచి ఈ 'జల మార్గం' పనామా నియంత్రణలో ఉంది! అందువల్ల పనామా దేశపునౌకను అపహరించడం ద్వారా 'అపహరణ కర్తలు' సంచలనం సృష్టించాలని భావించ ఉండవచ్చు! సోమాలియా, నైజీరియా వంటి దేశాల ప్రభుత్వాలు 'తోడేళ్లతో కలసి తరమడం, కుందేళ్ళతోపాటు పారిపోవడం' వంటి విధానాలను అవలంబిస్తున్నాయి. సౌదీ అరేబియా, ఇరాక్, సిరియా, లిబియా, ఇరాన్ దేశాల ప్రభుత్వాలది ఇదే పద్ధతి! మన వారి 'అపహరణ'కు, 'విడుదల'కు నిజమైన కారణాలు ఏమిటన్నది నిగ్గుతేలవలసి ఉంది! ఇరాక్‌లో 'ఐఎస్‌ఐఎస్' రెండేళ్ళ క్రితం అపహరించుకుపోయిన ముప్పయి తొమ్మిది మంది భారతీయల జాడ ఇంతవరకు తెలియలేదు.

అతివలకూ ఆస్తిలో వాటా ఇవ్వాల్సిందే

కుటుంబంలో మగపిల్లలతో పాటు ఆడపిల్లలకూ ఉమ్మడి ఆస్తిలో హక్కు ఉంటుందా? ఈ ప్రశ్న అనునిత్యం ఎంతో మందిని వేధిస్తూనే ఉంటుంది. దీనికి సంబంధించి ఎన్నో చట్టాలు, కోర్టు తీర్పులు విస్పష్టంగా ఉన్నా అపుడపుడూ అమలులో ఎదురయ్యే లోపాలతో ఈ అనుమానాలు సహజంగానే వస్తాయి. హిందూ, ముస్లిం, క్రైస్తవ మహిళలకు వారసత్వ సంపద హక్కులపై భిన్నమైన చట్టాలున్నందున ఈ గందరగోళం ఎపుడూ ఉండనే ఉంది. తాజాగా హిందూ వారసత్వ చట్టం అమలుకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పెను సంచలనంగానే చెప్పవచ్చు. ఇద్దరు అమ్మాయిలు తమ సోదరులు ఆస్తిలో భాగం ఇవ్వడం లేదంటూ 2002లో పిటిషన్ (గురులింగప్ప సావడి కేసు) దాఖలు చేశారు. దాన్ని బొంబాయి హైకోర్టు 2007లో తిరస్కరించింది. హిందూ వారసత్వ చట్టాన్ని 2005లో సవరించారు కనుక దాని కంటే ముందు పుట్టిన వారికి నూతన చట్టం అమలుకాదని హైకోర్టు పేర్కొంది. దీనిపై ఆ అమ్మాయిలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జస్టిస్ ఎ కె సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఆదేశాలను తప్పుపట్టింది. హిందూ వారసత్వ చట్ట సవరణలు 2005లో జరిగినా, అంతకంటే ముందు పుట్టిన వారికి సైతం ఈ చట్టం వర్తిస్తుందని తేల్చి చెప్పింది. దీంతో హిందూ మహిళలందరికీ అవిభాజ్య వారసత్వ ఆస్తిలో తమ సోదరులతో సమాన హోదా దక్కుతుందని సుప్రీం ఈ ఏడాది ఫిబ్రవరి 3న తీర్పు చెప్పింది.

ఆడపిల్లలకూ సమాన ఆస్తి హక్కు కల్పిస్తూ 1985 సెప్టెంబర్ 5న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 'ఆంధ్రప్రదేశ్ స్త్రీ ఆస్తుల వారసత్వ చట్టం సవరణ-1985' ను తీసుకువచ్చారు. దీంతో హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 29ఎ, 29 బి, 29 సి చేరుస్తూ సవరణ చేశారు. అప్పటికే వివాహం కాని కుమార్తెలకు మాత్రమే వర్తించేలా దీనిని రూపొందించారు. ఈ చట్టం పరిపూర్ణంగా అమలులోకి వచ్చేలోగానే కేంద్ర ప్రభుత్వం హిందూ వారసత్వ చట్టంలోనూ, హిందూ వివాహ చట్టంలోనూ, ఇతర చట్టాల్లో కొన్ని మార్పులు చేయడంతో భిన్నమైన సాంకేతిక అంశాలు ఎదురై, ఈ చట్టం అమలులో కూడా కొన్ని లోపాలు తలెత్తాయి. ఫలితంగా ఈ చట్టం నూరు శాతం ఫలితాలను సాధించలేకపోయింది. ఇటీవలి సుప్రీం కోర్టు ఆదేశాలతో మహిళలు తమ సంక్రమిత వారసత్వ ఆస్తి హక్కును చట్టపరంగా వినియోగించుకునే వీలుకలిగింది.

'2005-హిందూ వారసత్వ సవరణ చట్టం' గురించి ఉన్న తీర్పులకు భిన్నంగా గత ఏడాది అక్టోబర్ 16వతే దీన పూలవతి కేసులో కొత్త తీర్పు వెలువడింది. గత తీర్పులేవీ 'సవరణ చట్టం అమలుకు ముందా? ఆ తర్వాతా?' అన్న విషయాన్ని నిర్ణయించలేదని సుప్రీం అభిప్రాయపడింది. ఈ తీర్పుతో అనుమానాలను సర్వోన్నత న్యాయస్థానం నివృత్తి చేసింది. అమ్మాయిలకు పసుపు-కుంకుమ కింద ఇచ్చిన బహుమతికి రిజిస్టర్డు దస్తావేజులు అక్కర్లేదనే వాదనను చాలా కాలం న్యాయస్థానాలు అంగీకరించినా, రాజ్యాంగ ధర్మాసనం మాత్రం ఈ వాదనలను తోసిపుచ్చింది. అలాంటి సమయాల్లో రిజిస్టర్డు దస్తావేజు ఉండాలనే న్యాయస్థానం చెబుతోంది. కుమార్తె వివాహాది శుభకార్యాలు, భరణాలు ఉమ్మడి కుటుంబం భరించాలన్నది ఒక సంప్రదాయం. కొడుకుల విభజన హక్కులు ఇలాంటి బాధ్యతలకు లోబడే ఉంటాయి. అయితే కూతుళ్లకు ఉమ్మడి ఆస్తిలో సమాన వాటా కల్పించి , భాగస్వామ్యులను చేసిన శాసనాల సంస్కరణల ప్రభావం ఈ సనాతన హిందూ ధర్మం, ఆచారాలపై తీవ్రంగానే చూపుతుందనేది నిస్సందేహం. ఇక్కడ ఇంకో ప్రధాన విషయం తండ్రికి సంబంధించిన వారసత్వ లేదా ఉమ్మడి కుటుంబ ఆస్తిలో కూడా సమాన హక్కులు ఉంటాయి. 2005లో కేంద్ర చట్టం వచ్చే సరికి 1985 నాటి రాష్ట్ర చట్టం (ఎన్‌టిఆర్ రూపొందించిన చట్టం) ప్రకారం ఉమ్మడి ఆస్తిలో ఆడపడుచులకు కొడుకులతో సమాన వాటా సంక్రమించింది. ఇక తండ్రి స్వార్జితంలో వారసులుగా కూతుళ్లకు కూడా సమాన హక్కు 1956 చట్ట ప్రకారం ఉంది.

ఆస్తితో సంబంధం లేకుండా భార్యకు, మైనర్ లేదా పెళ్లికాని కుమార్తెకు కొన్ని సందర్భాల్లో వితంతువైన కుమార్తెకు కుటుంబ సామాజిక, ఆర్థిక స్థాయి ప్రకారం తండ్రి నుండి భరణం పొందే హక్కు ఉంటుంది. అతని సొంత ఆస్తిపై చార్జి (అంటే జామీను) కూడా కోర్టు ద్వారా పొందవచ్చు. అయితే హిందూ అవిభక్త కుటుంబ ఆస్తి (పూర్వార్జితం) విషయంలో కుమార్తెకు తండ్రితో సమాన హక్కులు ఉంటాయి. అలాంటి హక్కు అక్రమ సంతానానికి కాని, చెల్లుబాటుకాని పెళ్లి వల్ల గాని పుట్టిన సంతానానికి ఉండదు. అంటే తాతల నుండి సంక్రమించిన ఆస్తి గానీ దాని ద్వారా సంపాదించిన ఆస్తి కానీ ఉంటే దానిలో కేవలం తండ్రి, మొదటి భార్య సంతానానికి మాత్రమే సమాన హక్కులు ఉంటాయి. అలాంటి ఆస్తులు లేకపోతే అతని సొంత ఆదాయం, ఆస్తులను పరిగణనలోకి తీసుకుని భార్య,కుమార్తెలకు భరణాన్ని నిర్ణయించాలి. విల్లు రాయకుండా తండ్రి మరణిస్తే వారసులుగా వాటా లభిస్తుంది.

ఈ నిర్ణయం వెనుక చాలా నేపథ్యం ఉంది. ప్రపంచంలో ఏ దేశంలో లేని వైవిధ్యమైనది హిందూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. ఇది శాశ్వతమైన వ్యవస్థ. వేదకాలం, ఆ తర్వాత స్మృతుల కాలం, ధర్మసూత్రాల కాలంగా హిందూ ధర్మ శాస్త్రాన్ని విభజించారు. ఇందులోముఖ్యంగా మను ధర్మశాస్త్రం, మితాక్షర, దయాభాగా ముఖ్యమైనవి. అన్ని శాఖల్లోనూ ధర్మసూత్రాలను చెప్పడం జరిగింది. చాలావరకూ అవి కాలగర్భంలో కలిసిపోయాయి. అయితే



జస్టిస్ ఏకే సిక్రి



జస్టిస్ అశోక్ భూషణ్

అమ్మాయిలకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన బహుమతికి రిజిస్టర్డు దస్తావేజులు అక్కర్లేదనే వాదనను చాలా కాలం న్యాయస్థానాలు అంగీకరించినా, రాజ్యాంగ ధర్మాసనం మాత్రం ఈ వాదనలను తోసిపుచ్చింది. అలాంటి సమయాల్లో రిజిస్టర్డు దస్తావేజు ఉండాలనే న్యాయస్థానం చెబుతోంది. కుమార్తె వివాహాది శుభకార్యాలు, భరణాలు ఉమ్మడి కుటుంబం భరించాలన్నది ఒక సంప్రదాయం. కొడుకుల విభజన హక్కులు ఇలాంటి బాధ్యతలకు లోబడే ఉంటాయి.

హిందూ సమష్టి కుటుంబం , హిందువుల వివాహం, దత్తత, మైనర్ల సంరక్షణకు సంబంధించిన ధర్మసూత్రాలు మాత్రం కొన్ని మార్పులతో ఇప్పటికీ అమలులో ఉన్నాయి. హిందువుల్లో వ్యక్తి కంటే సమష్టి కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. నాలుగు తరాల వరకూ మగవారంతా కలిస్తే దానిని కో-పర్సనరీ అని వ్యవహరిస్తారు. స్త్రీలు కూడా కలిస్తే అది ఉమ్మడి కుటుంబం అవుతుంది. ఈ కుటుంబానికి కర్త ఉంటారు. మరణించిన వారు కుటుంబాన్ని వీడిపోతూంటే, జన్మించిన వారు సభ్యులు అవుతుంటారు. పున్నామ నరకం నుండి తల్లిదండ్రులను తప్పించేవాడు కనుక పుత్రుడు అవుతాడు. ఈ ప్రకారమే 'అపుత్రస్య గతిర్నాస్తి' అనే సూత్రం ఏర్పడింది. తల్లిదండ్రులు, పూర్వీకులకు పుత్రుడు శ్రాద్ధకర్మలు నిర్వహించి, వారికి పున్నామనరకం లేకుండా చేస్తాడు కనుక అతడికి పుట్టుకతోనే ఆస్తిలో హక్కు కల్పించడం జరిగింది. అయితే ఈ హక్కు కేవలం ఉమ్మడి కుటుంబ ఆస్తిలో మాత్రమే ఉంటుంది. ఈ ఆస్తులు ఎవరిపేర ఉన్నా మగపిల్లలందరికీ హక్కు ఏర్పడుతుంది. అలాగే కుటుంబంలోని ఒక సభ్యుడు తాను సొంతంగా సంపాదించిన ఆస్తిని గానీ లేదా తనకు వేరే విధంగా వచ్చిన ఆస్తిని కాని ఉమ్మడిలో కలిపేయడంతో అది ఉమ్మడి ఆస్తి అవుతుంది. కుటుంబంలో ఒక సభ్యుడు సొంతంగా ఆర్జించిన ఆస్తిని స్వార్జితపు ఆస్తి అంటారు. ఇతరుల నుండి వారసత్వరీత్యా గానీ, విల్లుద్వారా గానీ, దానపట్టాల ద్వారా లేదా సొంత తెలివితేటలతో పొందిన ఆస్తిని ప్రత్యేక ఆస్తి అంటారు. ఈ స్వార్జితపుఆస్తి ఉమ్మడి ఆస్తి కిందకు రాదు. ఏది పిత్రార్జిత ఆస్తి, ఏది కాదో, ఎవరు రుజువు చేసుకోవాలో అనే విషయంపై న్యాయస్థానాలు ఇప్పటికే చాలా స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. ఒక కుటుంబానికి కొంత స్థిరాస్తి ఉంటే దానిని అమ్మి వేరే చోట కొంటే అది కూడా పిత్రార్జితం కిందకే వస్తుంది. పిత్రార్జిత ఆస్తిపై వచ్చిన ఆదాయంతో కొన్న ఆస్తి కూడా పిత్రార్జితం కిందకే వస్తుంది, అయితే కొన్న వారు అది తమ సొంత సొమ్ముతో కొన్నామని రుజువు చేసుకుంటే మాత్రం అది పిత్రార్జితం కిందకు రాదు. పంచుకోవడానికి వీలులేని లేదా వీలుకాని ఆస్తులను ఉమ్మడిగానే ఉంచుకోవాలి. ఉమ్మడి కుటుంబంలో ఇల్లు పంచుకునేటపుడు దాని మార్గాలు, మంచినీటి బావులు, మరుగుదొడ్లు, పశువుల కొట్టం వంటివి పైకి వెళ్లేందుకు మెట్లు మొదలైనవి ఉమ్మడిగానే ఉంచుకోవల్సి ఉంటుంది.

ప్రభుత్వం ఇచ్చిన ఈనాం- ఒక ఆచారపు హక్కు పంచుకోవడానికి వీలు లేదు. ఆస్తి విషయంలో మైనర్లతో సహ ఏ సభ్యుడైనా పంపకం కోరవచ్చు. మైనర్ తరపున తండ్రిపై దావా వేయడానికి ఎవరైనా సంరక్షణ వహించవచ్చు. మైనర్లు నష్టపోయే ప్రమాదం ఉన్నపుడు కోర్టు అతనికి వాటా పంచుతుంది. ఉమ్మడి కుటుంబంలోని సభ్యుల భార్యల కడుపులో పడి ఇంకా పుట్టని పుత్రులకు సైతం ఆస్తిలో వాటా హక్కు ఉంటుంది. కడుపులో ఉన్నవారికి కూడా వాటా కేటాయించాలి. ఒక వేళ ఆ శిశువులకు వాటా ఇవ్వకుండా పంచుకుంటే పుట్టిన తర్వాత ఆ పంపకాన్ని తిరగదోడి వాటా తీసుకోవచ్చు. ఇంట్లో పవిత్ర బాధ్యత (పియస్ ఆబ్లిగేషన్) నిర్వహించడానికి ఖర్చులుచేస్తే దానికి అందరూ బాధ్యత వహించాల్సి ఉంటుంది. తండ్రి తదనంతరం కూడా పుత్రులు తీర్చవలసి ఉంటుంది. అయితే తండ్రి అవ్యవహారిక రుణాలకు మాత్రం ఈ బాధ్యత ఉండదు. బ్రిటిష్ పరిపాలనా కాలంలో హిందూ ధర్మశాస్త్రం, లేదా ముస్లిం న్యాయ శాస్త్రం జోలికి పోలేదు. సొంత శాస్త్రాలనే అమలుపరిచారు. స్వాతంత్ర్యోద్యమకాలంలో 1935లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం రావడంతో స్థానిక స్వపరిపాలనలో కొన్ని విషయాల్లో అధికారాలు భారతీయులకు ఇచ్చారు. అందులో భాగంగానే హిందూ ధర్మశాస్త్రానికి మార్పులు తెస్తూ మొదటిసారి ఒక చట్టాన్ని రూపొందించారు. అది హిందూ స్త్రీల ఆస్తి హక్కుల చట్టం -1937. పూర్వపు హిందూ స్త్రీకి తన భర్త కుటుంబంలో వారసత్వ రీత్యా ఆస్తి హక్కు ఉండేది కాదు. కేవలం ఆమెకు మనోవర్తి హక్కు మాత్రమే ఉండేది. భర్త చనిపోతే ఆమె కుమారులు, ఒక వేళ కుమారులు లేకపోతే భర్త సోదరుల వద్ద వారి ఉమ్మడి కుటుంబ బాధ్యతగా మనోవర్తి పొందే హక్కు మాత్రమే ఉండేది. ఇందుకు కొంత ఉమ్మడి కుటుంబ ఆస్తిపై వారసత్వం లేదు. 1937 చట్టంలో కేవలం నివాస గృహాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పడంతో నామమాత్రం అయిపోయింది. 1946లో మరో చట్టంలో మొత్తం అన్ని రకాల ఆస్తులకు పంటభూములకు వర్తింపచేశారు. హిందూ వారసత్వ చట్టం -1956 అమలులోకి రావడంతో అది రద్దయింది. స్త్రీలకు పూర్తి హక్కులు ఇవ్వడం కోసం దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హిందూ కోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అంతకుముందు అలిఖితంగా, ఏ చట్టాలు లేకుండా ఉన్న హిందూ ధర్మ శాస్త్రాన్ని విప్లవాత్మక మార్పులతో క్రోడీకరించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. దానిని వ్యతిరేకించడంతో చివరకు హిందూ వారసత్వం, హిందూ వివాహం, హిందూ దత్తత స్వీకారం, మనోవర్తి, హిందూ పిల్లల సంరక్షణ సూత్రాలకు సంబంధించి 1955, 1956లో నాలుగు చట్టాలు రూపొందాయి. హిందూ వారసత్వ చట్టం బౌద్ధులు, జైనులు, సిక్కులకు కూడా వర్తిస్తుంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దేశంలో మిగిలిన రాష్ట్రాల్లోని హిందూ వారసులైన ఆడపడుచుల హక్కులకు కొత్త దిశానిర్దేశం చేస్తుందనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు.

◆బి.వి. ప్రసాద్

మార్క్సిజం ఓ ముతక వ్యవహారం!


నూట యాభై ఏళ్ల క్రితం నాటి మార్క్సిజాన్ని ఇప్పటికీ కొందరు ఆరాధించడం, ప్రచారం చేయడం, నేటి సమాజానికది ప్రాసంగికమని వాదించడం చూస్తుంటే జాలేస్తుంది. ఆ సిద్ధాంతం గూర్చి గొంతు చించుకుంటుంటే వింతగా తోస్తుంది. గత శతాబ్దంన్నర కాలంలో మానవ శాస్త్రం, సామాజిక, సాంకేతిక రంగాలు ఎంతో ఎదిగాయి. ఎన్నో కొత్త కోణాలను దర్శించి వాటిని ప్రజాపరం చేసారు. వాటి ఆధారంగా ఆధునిక మానవ జీవితం ఓ కొత్త కక్ష్యలో తిరుగుతోంది. మార్క్సిజాన్ని ఓ శాస్త్రంగా, సైన్స్‌గా పరిగణిస్తూ ఊహాలోకాల్లో విహరించే ఆ 'ఇజం' అభిమానులు, వీరాభిమానులు మాత్రం- 'మార్క్స్ గీసిన గీతకు తిరుగులేదు.. మార్క్స్ 'వాక్యం' దేవుని వాక్యం కన్నా మిన్న' అని తలచి 'దాస్ కాపిటల్'ను తలకెత్తుకుని ఊరేగడం చూస్తే.. మార్క్సిజానికి ఓ మతానికున్న లక్షణాలన్నీ వున్నాయని అనిపిస్తుంది. దాని ప్రవక్త కారల్ మార్క్స్, వారి పవిత్రగ్రంథం 'దాస్ కాపిటల్', మత ప్రచారకులు లెనిన్, స్టాలిన్, మావో తదితరులు. ఆ మతాన్ని అనుసరించేవారు అంతటా కనిపిస్తారు. అందులో మూఢత్వం దండిగా ఉందన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలు వాస్తవమే అనిపిస్తుంది. తమది శాస్త్రీయమైన సిద్ధాంతం, 'డాగ్మా' (మూఢనమ్మకం, విశ్వాసం) కాదని తరతరాలుగా చెబుతున్నా, ఆచరణలో మాత్రం వారిది 'సంపూర్ణ మూఢ విశ్వాసం' తప్ప సత్యం కాదు, సైన్స్ అసలే కాదు. అయినా దబాయించి శతాబ్దానికి పైగా వారు కాలం నెట్టుకొచ్చారు. 'ఇంకానా.. ఇకపై మీ దబాయింపు పప్పులుడకవ'ని సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణల ఆధారంగా వెల్లువెత్తిన సైన్స్, హేతుబద్ధ ఆలోచన, తార్కిక సంవాదం, ప్రజాస్వామిక భావజాలం, సాధికారత ఆయుధం చెప్పకనే చెబుతున్నాయి. హేతువును, తర్కాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సాధికారతను గేలిచేసి, వెటకారంతో తమ పబ్బం గడుపుకోవాలని చూసేవారి ఆటలు ఎక్కువ కాలం కొనసాగవు.

మార్క్స్ మౌలిక విశ్లేషణ ఎంత అజ్ఞానంతో కూడుకుందో నేటి సమాజం తేటతెల్లం చేస్తున్నది. మార్క్స్ ఆలోచనల ప్రకారం పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాల వల్ల సోషలిస్టు వ్యవస్థ పురుడు పోసుకుంటుంది. ఇది తొలిదశ అయితే మలిదశ సొంత ఆస్తి లేని, వర్గాలు లేని, దోపిడీ ఊసు ఎరుగని, మనుషుల్లో వైషమ్యాలు, ఘర్షణలు లేని కమ్యూనిస్టు వ్యవస్థ అవతరిస్తుంది. నేరాలు, హింస ఆనవాలు లేని సమాజంలో సుఖశాంతులు వెల్లివిరిసి, సమాజం శోభిల్లుతుంది. మానవాళి ఓ నూతన ప్రపంచంలోకి అడుగిడిన అనంతరం 'రాజ్యం (ప్రభుత్వం) దానంతట అదే చెట్టుపై మగ్గిన పండులా రాలిపోతుంది. ఇదీ టూకీగా మార్క్స్ 'విజన్'.

భారత్‌కు స్వాతంత్ర్యం రాకపూర్వం ఈ అభిప్రాయాలు, విశ్లేషణతో కొంతమంది ఆకర్షితులయ్యారంటే ఎంతోకొంత అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే ఆనాటి ప్రపంచ పరిస్థితులపై అధ్యయనం, అవగాహన తక్కువ. పాశ్చాత్య దేశాల్లోని పరిణామాలు పరిపూర్ణంగా అర్థం చేసుకునే అవకాశాలు అప్పట్లో లేవు. శతాబ్దాల భారతీయుల జీవనానికి, ఈ బోధకు ఎక్కడా పొంతన లేదు. రష్యాలో అప్పటికే ఆ వెలుగులో విప్లవం విజయవంతం కావడం కారణంగా ఆకర్షితులు కావడం సహజం. ఉడుకు రక్తం వారు అటువైపు కదలడం స్వాభావికం. కానీ, 2018 సంవత్సరంలోనూ- 'మార్క్స్ భావజాలానికి తిరుగులేదు, కష్టజీవులకది సంజీవని, ఎల్లకాలాలకూ అన్వయమయ్యే శాస్త్రమది' అని దబాయించడం అసమంజసం. ఏ రష్యాలో అయితే విప్లవ విజయాన్ని చూసి ఆవేశం తెచ్చుకున్నవారు, వారి వారసులు- ఆ విప్లవం విఫలమై, మార్క్స్ కలలు సమాధి అయ్యాక సైతం మార్క్సిజం 'మత' ప్రధాన ప్రచారకుడు లెనిన్ విగ్రహాలను ఆ దేశంలో ధ్వంసం చేశాక సైతం అదే ఆవేశంతో ఊగిపోతే లోపం మనలో ఉందన్న ఇంగితం తెలిసుండాలి.

రష్యాలో సోషలిస్టు వ్యవస్థ పునాదులు ఏర్పడినా కోట్లాదిమంది సంహారం జరిగింది. ఇందులో మేధావులన్నవారు మొదలుకుని, విప్లవ సారధులు, సామాన్యులు ఎందరో వున్నారు. వాస్తవానికి రష్యాలో సోషలిస్టు వ్యవస్థ పేర అరాచక వ్యవస్థను నెలకొల్పారన్న విమర్శ అక్కడి రచయితలు, కవులు, మేధావులు, కళాకారుల నుంచి బలంగా వినిపించింది. సోల్జెనిత్సిన్ రచనలు చదివితే 'గులగ్'ల తీరుతెన్నులు పరిశీలిస్తే- 'ఇదా సోషలిస్టు వ్యవస్థకు ద్వారం?' అని ప్రజలు ఆనాడే విస్తుపోయారు.

విచిత్రమేమిటంటే మనిషిలోని అరిషడ్వర్గాలను పూర్తిగా విస్మరించి మార్క్స్ ఊహాగానంతో మార్క్సిజాన్ని రచించారు. ప్రాథమికమైన ఈ



మనిషి నుంచి అరిషడ్వర్గాలను వేరు చేయడం సాధ్యమా? మనిషంటేనే అరిషడ్వర్గాలు- వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఓ ఊహా ప్రపంచంలో మనిషిని నిలిపి 'గొప్ప సిద్ధాంతాన్ని సృష్టించాను.. వినండి' అని మార్క్స్ 'మాయ' చేశాడు. ఆ మాయలో ఆయన అభిమానులు, వీరాభిమానులు పడిపోవడం జరిగింది. ఆ దృశ్యం ఇంకా అలాగే కొనసాగడం వింతల్లోకెల్ల వింత.

లోపం పసిగట్టకుండానే నూట యాభై ఏళ్లుగా సమసమాజం నిర్మిస్తామని ఆయన వీరాభిమానులు ప్రపంచవ్యాప్తంగా పదికోట్లకుపైగా ప్రజలను పొట్టన పెట్టుకున్నారు. మనిషి నుంచి అరిషడ్వర్గాలను వేరు చేయడం సాధ్యమా? మనిషంటేనే అరిషడ్వర్గాలు- వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఓ ఊహ ప్రపంచంలో మనిషిని నిలిపి 'గొప్ప సిద్ధాంతాన్ని సృష్టించాను.. వినండి' అని మార్క్స్ 'మాయ' చేశాడు. ఆ మాయలో ఆయన అభిమానులు, వీరాభిమానులు పడిపోవడం జరిగింది. ఆ దృశ్యం ఇంకా అలాగే కొనసాగడం వింతల్లోకెల్ల వింత.

రష్యా విప్లవ విఫలం మార్క్సిజంలో లేదు, దాన్ని అమలు చేసిన నాయకుల్లో ఉందని ఓ గొప్ప పరిశోధనాంశం ప్రకటించినట్టు గత పాతిక సంవత్సరాలుగా చర్విత చరణంగా చాలామంది పాతపాట పాడుతూ వున్నారు. అంతేగాని మనిషి చుట్టూ పరచుకున్న తెలివిడి, జ్ఞానం, శాస్త్రాల పరిమళం, వాటిని అందిపుచ్చుకోవాలన్న ఉత్సుకత, అరిషడ్వార్గాల ప్రేరణకు వశపడిపోయి వాటితో కలిసి నడిచేందుకు తమకు తెలియకుండానే ప్రజలు ఉద్యుక్తులవడం వారు గమనించడం లేదు. రష్యా విప్లవ ఫలితం చేదెక్కడం వెనుక- రివిజనిస్టులు, పెట్టుబడిదారుల తొత్తులు, శ్రామికవర్గ ద్రోహులున్నారని గగ్గోలు పెట్టడం ఎంతటి అమాయకత్వం? మనిషి తత్వం తెలియకుండానే, అరిషడ్వర్గాల అవగాహన లేకుండానే, అవి మానవ జీవితంపై వేసే బలమైన ప్రభావాన్ని గణనలోకి తీసుకోకుండానే ఉద్రేకం, ఆవేశంతో ఊగిపోవడంతో ఒరిగింది ఏమిటి? అన్న ప్రశ్న వేసుకునేంత ఓపిక మార్క్స్ అభిమానులకు లేకపోవడం విషాదం. హేతువు, తర్కం, బుద్ధి, వివేచన, విచక్షణ అన్నీ సమాధి చేసి వారు ఊరేగడం వల్ల ఎవరికి ప్రయోజనం చేకూరింది? మార్క్స్ వీరాభిమానులు ఎలాగూ ఈ ప్రశ్న వేసుకోరు. కనీసం నిష్పాక్షిక దృష్టితో, సత్యం ఆధారంగా వాస్తవికతను ప్రేమించేవారైనా ఈ ప్రశ్న తప్పకు వేసుకుని తమ బుద్ధిబలంతో సమాధానం చెప్పుకోవలసిన అవసరం ఇప్పుడు ఎక్కువగా ఉంది.

ఇంత డొల్లతనం ఉన్న మార్క్సిజాన్ని ఆధారం చేసుకుని మన దేశంలో మావోయిస్టులు రక్తకాసారాలు సృష్టించే పనిలో పడ్డారు. మార్క్సిజంలోని డొల్లతనం- రష్యా, చైనా, తూర్పు యూరప్ దేశాల అనుభవాలు, లాటిన్ అమెరికా దేశాల చేదు జ్ఞాపకాలు, నేపాల్, కొలంబియా దేశాల్లో మావోయిస్టు గెరిల్లాల తాజా స్థితిగతులు అవగాహన కొచ్చాక కూడా మార్క్సిస్టులు మారడం లేదు. ఈ 21వ శతాబ్దంలో, ప్రపంచమంతా భారతదేశ యువత నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలవైపు చూస్తున్న తరుణంలో తుపాకి గొట్టంద్వారా దీర్ఘకాల సాయుధ పోరాటంద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేస్తామనడం, అందుకోసం అమాయకులైన ఆదివాసీలను పావులుగా ఉపయోగించడం దారుణం. అడవిబిడ్డల అజ్ఞానాన్ని ఆసరా చేసుకుని మాయ చేయడం మానవాళికి మాయని మచ్చగా మిగిలిపోతుంది తప్ప ప్రజాసంక్షేమ భావన అందులో ఇసుమంత కూడా కనిపించదు.

మార్క్స్ విశ్లేషణ, వింగడింపు, సిద్ధాంతీకరణ ఓ ముతక వ్యవహారం. అది శాస్త్రీయం కాదు. పక్కా మూఢ విశ్వసం, రక్తం రుచి మరిగిన వ్యాఘ్రం అన్న విషయం స్పష్టాతిస్పష్టంగా 150 ఏళ్ల చరిత్ర తెలియజేస్తోంది, భారతదేశంలో 50 ఏళ్ల నక్సల్‌బరి సాయుధ పోరాటం మరింత నగ్నంగా చెబుతోంది. ప్రపంచం ఓ కొత్త కక్ష్యలో తిరుగుతూ, సాంకేతిక పరిజ్ఞానం, మరమనుషుల (రోబోల) సహాయంతో కొత్త వాతావరణంలో జీవనం కొనసాగిస్తుండగా, ఈ విధానం లుప్తమై మరే కొత్త కోణం, విధానం ఎప్పుడు అనుసంధాన మవుతుందో.. చెప్పలేని సంధి కాలంలో జీవితం వెల్లదీస్తున్న పౌరుల ముందుకు ఏమాత్రం ప్రాసంగికత లేని ఏవిధంగా చూసినా ప్రయోజనకారి కాని కాలం చెల్లిన, ముతక వ్యవహారమైన మార్క్సిజాన్ని ముందుకు తీసుకురావడం మూర్ఖత్వమే తప్ప మానవత్వం మాత్రం కాదు. మానవత్వం పేర మార్క్సిజాన్ని ముందుకు తెచ్చి అజ్ఞానాన్ని పంచడం మానవాళిని వంచించడమే.

◆వుప్పల నరసింహం సెల్: 99857 81799

ప్రాణాలను తోడేస్తున్న
వాయుకాలుష్యం

మన దేశంలో ప్రజలు పీల్చేగాలి నానాటికీ విషపూరితమవుతోందని, ఫలితంగా సగటున నిమిషానికి ఇద్దరు మరణిస్తున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఏటా పది లక్షల మందికి పైగా భారతీయులు వాయు కాలుష్యంతో మృత్యువాత పడుతున్నారనీ, ప్రపంచంలోనే అత్యధికంగా కలుషితమైన నగరాలలో కొన్ని భారత్‌లో ఉన్నాయనీ 'ది లాన్సెట్' మెడికల్ జర్నల్ పేర్కొంది. 'ది లాన్సెట్ కౌంట్‌డౌన్' పేరుతో ఆ జర్నల్ ఏటా నివేదికను వెలువరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 16 ప్రముఖ విద్యా సంస్థలు ఈ అధ్యయనంలో భాగస్వామ్యులుగా ఉన్నాయి. యూనివర్సిటీ కాలేజ్ లండన్, త్సింగ్వా యూనివర్సిటీ, సెంటర్ ఫర్ క్లైమేట్ అండ్ సెక్యూరిటీ వంటివి ఇందులో ఉన్నాయి. ఇవి ఎప్పటికప్పుడు తమ పరిశోధనలకు అవసరమైన సమాచారాన్ని ప్రపంచ వ్యాప్తంగా సేకరిస్తుంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థలతో కూడా 'ది లాన్సెట్'కి సహకార భాగస్వామ్యం ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల సంఖ్యలో పిల్లలు నెలలు నిండక ముందే పుట్టారని, ఇందుకు వాయు కాలుష్యం ఓ కారణమని 2010లో సేకరించిన సమాచారం ఆధారంగా ది లాన్సెట్ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. వాతావరణంలో జరిగే మార్పులపై, దాని ప్రభావంపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి పెట్టాలని ది లాన్సెట్ జర్నల్ పేర్కొంది. కాలుష్యం వల్ల వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు భవిష్యత్తులో మానవ ఆరోగ్యంపై భయంకరమైన ప్రభావాన్ని చూపక తప్పదని ఆ జర్నల్ హెచ్చరించింది.

వాయు కాలుష్యంతో భారత్‌లో లక్షలాది మంది ప్రజలు అనారోగ్యానికి గురవడంతో జాతీయాదాయంలో 38 బిలియన్ డాలర్ల మేరకు నష్టం వాటిల్లుతోందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడంతో ఎంతోమంది అకాల మరణానికి గురవుతున్నారనీ ప్రపంచ బ్యాంక్ నివేదికలో పేర్కొన్నారు. ఇటీవల 48 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు సంయుక్తంగా విడుదల చేసిన ఒక అధ్యయన నివేదిక ప్రకారం ఢిల్లీ, పాట్నా నగరాలు ప్రపంచంలోనే అత్యధికంగా కలుషితమైన నగరాలుగా గుర్తించబడ్డాయనీ, గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీసే పి.ఎం. 2.5 ఈ నగరాలలోని గాలిలో అధిక మొత్తంలో నిండిపోయిందనీ పేర్కొంది. వాయు కాలుష్యంతో ప్రపంచ వ్యాప్తంగా రోజుకి 18 వేల మందివరకు మరణిస్తున్నారు. దీనినిబట్టి పర్యావరణ కాలుష్యమే ప్రపంచ మానవాళికి అతి పెద్ద ప్రమాదకారి అని నిర్ధారితమవుతోంది. పర్యావరణ కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా 225 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని ప్రపంచ బ్యాంక్ తెలుపుతోంది.

కేంద్ర పర్యావరణ, అటవీ సంరక్షణ శాఖ మంత్రి గతంలో పార్లమెంటులో మాట్లాడుతూ వాయుకాలుష్యాన్ని పర్యవేక్షించడానికి ఏటా 7 కోట్ల రూపాయలను వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. 'పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం పసిపిల్లల ఊపిరితిత్తులను దెబ్బతీస్తోంది. ఇది చాలా ప్రమాదకరమైన విషయం. దీని గురించి ఇప్పుడు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాం. కానీ ఇది సరిపోదు. ఇంకా చేయవలసింది ఎంతో ఉంది'' అని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి డాక్టర్ హర్షకుమార్ అంటున్నారు. ఆయన మంచి అనుభవజ్ఞుడైన వైద్యుడు కూడా. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ఇప్పుడున్న వాతావరణ మార్పులు ఇలాగే కొనసాగినట్లయితే క్రీ.శ.2030లో అధిక ఉష్ణోగ్రతల వల్ల 38వేల మంది, విరేచనాల వల్ల 48వేలమంది, మలేరియా వల్ల 60వేలమంది, పౌష్టికాహార లోపం వల్ల 95వేల మంది పిల్లలు అదనంగా మరణించడం సంభవిస్తుంది. 2050 వచ్చేనాటికి అధిక ఉష్ణోగ్రతల వల్ల లక్షకుపైగానే మరణాలు సంభవిస్తాయనీ, 2030 తరువాత నుండి దక్షిణ ఆసియాలోనే పిల్లల ఆరోగ్యంపై వాతావరణంలోని మార్పులు అధిక ప్రభావాన్ని చూపుతాయనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. వాయుకాలుష్యం వల్ల 2013లో ప్రపంచ వ్యాప్తంగా 5.5 మిలియన్ల ప్రజలు వివిధ రోగాలతో మరణించారనీ, ఇందువల్ల కొన్ని దేశాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయనీ ప్రపంచ బ్యాంక్ తెలిపింది.

◆డాక్టర్ దుగ్గిరాల రాజకిశోర్
సెల్: 80082 64690

కుల్‌భూషణ్‌పై ఉగ్రవాద కేసులు

పాక్ మీడియాలో కథనాలు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6: భారత మాజీ నేవీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్ మరిన్ని కేసులు ఎదుర్కొనబోతున్నారు. గూఢచర్యం అభియోగం మోపి పాకిస్తాన్ సైనిక కోర్టు జాదవ్‌కు ఉరిశిక్ష విధించిన సంగతి తెలిసిందే. తాజాగా ఉగ్రవాదం, విద్రోహం సహా పలు కేసులు ఆయనపై మోపినట్టు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 47 ఏళ్ల కుల్‌భూషణ్‌కు పాక్ మిలిటరీ కోర్టు మరణశిక్ష విధించగా భారత్ అంతర్జాతీయ న్యాయస్థానంలో సవాల్ చేసి నిలిపివేయించింది. ఇరాన్ నుంచి తమ భూభాగంలోని ప్రవేశిస్తుండగా బలోచిస్తాన్ రాష్ట్రంలో 2016 మార్చి 3న అదుపులోకి తీసుకున్నట్టు పాక్ చెబుతోంది. అయితే జాదవ్‌పై పాక్ మోపిన అభియోగాలను భారత్ నిర్ద్వందంగా తోసిపుచ్చింది. సైనిక కోర్టు తీర్పును మే నెలలో ఐసీజేలో భాతర్ సవాల్ చేసింది. శిక్ష అమలుపై సీఐజే స్టే విధించి తుది తీర్పు ఇచ్చేవరకూ పెండింగ్‌లో ఉంచాలని పాక్‌ను ఆదేశించింది. జాదవ్‌పై పాక్ ప్రభుత్వం బహుళ కేసులను బనాయించినట్టు 'డాన్' పత్రిక వెల్లడించింది. ఉగ్రవాదం, దేశద్రోహం సహా పలు కేసులు ఆయనపై మోపినట్టు మీడియా కథనం. ప్రస్తుతం కుల్‌భూషణ్ గూఢచర్యం అభియోగాన్ని మాత్రమే ఎదుర్కొంటున్నారు. ఆ ఆరోపణలపైనే ఉరిశిక్ష పడింది. అలాగే జాదవ్‌కు 13 మంది భారత అధికారులతో సంబంధాలు నెరపినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే ఆ 13 మంది అధికారులు ఎవరు? ఏమిటి అన్న సమాచారం తెలియరాలేదు. జాదవ్ నేవీ సర్వీసు ఫైలు, బ్యాంకు ఖాతా వివరాలు, పెన్షన్ చెల్లింపులు, బీమా, పాస్‌పోర్టు తదితర వివరాలు అధికారులు రాబడుతున్నట్టు తెలిసింది.

శరణు.. శరణు..

- భారత సైనిక జోక్యం అవసరం
- మాల్దీవుల సంక్షోభంపై

మాజీ అధ్యక్షుడు నషీద్ అభ్యర్థన

కొలంబో/మాలే, ఫిబ్రవరి 6: మాల్దీవుల్లో సంక్షోభ నివారణకు భారత్ జోక్యం చేసుకోవాలని బహిష్కృత మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ కోరారు. భారత సైన్యం జోక్యం చేసుకుని పరిస్థితి మరింత విషమించకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధ్యక్షుడు అబ్దుల్లా యెమీన్ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించి ఉన్నత న్యాయమూర్తులను అరెస్టు చేయించారు. సోమవారం ఎమర్జెన్సీ ప్రకటించిన వెంటనే చీఫ్ జస్టిస్ అబ్దుల్లా సయీద్, మరో జడ్జి అలీ హమీద్‌ను అరెస్టు చేయించారు. అయితే వారిపై ఎలాంటి ఆరోపణలున్నదీ, విచారణ ఏమిటన్న వివరాలు తెలియరాలేదు. ప్రతిపక్షాలకు మద్దతునిస్తున్న మాజీ అధ్యక్షుడు మౌమున్ అబ్దుల్ గయూమ్‌ను సైతం గృహ నిర్బంధంలోకి తీసుకున్నారు. తన ప్రభుత్వాన్ని కుల్చేయడానికి న్యాయమూర్తులు కుట్ర పన్నారని అధ్యక్షుడు యెమీన్ ఆరోపిస్తున్నాడు. అత్యయక పరిస్థితి విధించి కుట్రపై విచారణ జరిపిస్తానని ఆయన ప్రకటించారు. కుట్రదారులు ఎవరన్నదానిపై నిగ్గుతేలుస్తాం' అంటూ మంగళవారం జాతిని ఉద్దేశించి చేసిన టీవీ ప్రసంగంలో అధ్యక్షుడు హెచ్చరించారు. కాగా మాల్దీవుల్లో నెలకొన్న తాజా రాజకీయ సంక్షోభాన్ని భారత్ చాలా దగ్గరగా గమనిస్తోంది. మరీ అత్యవసరమైతే తప్ప ఎవరూ మాల్దీవులు వెళ్లొద్దని పౌరులకు సోమవారమే విజ్ఞప్తి చేసింది. నషీద్ నాయకత్వంలోని మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ(ఎండీపీ) ఈ సంక్షోభం నుంచి గట్టెక్కడానికి భారత్ చొరవ తీసుకోవాలని కొలంబో నుంచి అభ్యర్థించింది.

'సిద్దూ' సర్కార్ కూల్చివేతకు కుట్ర

మోదీపై కాంగ్రెస్ ఆరోపణ

బెంగళూరు, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి సిద్దరామయ్య నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని కర్నాటక కాంగ్రెస్ ఆరోపించింది. ప్రధాని పదవి గౌరవం మంటగలిపేలా మోదీ వ్యవహరిస్తున్నారని పార్టీ అధికార ప్రతినిధి వీఎస్ ఉగ్రప్ప విమర్శించారు. ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి బహిరంగ సభ పెట్టి మరీ ఓ ముఖ్యమంత్రిపై అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం 'టెన్ పర్సంట్ కమిషన్ గవర్నమెంట్' అంటూ మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, కౌంట్ డౌన్ ప్రారంభమైందని మోదీ అనగా, కేంద్ర మంత్రి డీవీ సదానంద గౌడ అందుకుని '30 పర్సంట్ కమిషన్ స్టేట్' అంటూ విరుచుకుపడ్డారు.

రాజీవ్‌గాంధీ బతికుంటే...

- కాశ్మీర్ సమస్య పరిష్కారమై ఉండేది
- ఒప్పందానికి నాడు దాదాపు చేరువ
- పాక్ మాజీ అధ్యక్షుడు జర్దారీ వెల్లడి

లాహోర్, ఫిబ్రవరి 6: భారత్-పాకిస్తాన్ మధ్య జఠిలంగా ఉన్న కాశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవాలని రాజీవ్‌గాంధీ, బేనజీర్ భుట్టో భావించారని పాక్ మాజీ అధ్యక్షుడు అసీఫ్ అలీ జర్దారీ వెల్లడించారు. ఓ ఎన్నికల ప్రచారంలో రాజీవ్‌గాంధీ దారుణ హత్యకు గురికావడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదని స్పష్టం చేశారు.'బీబీ(బేనజీర్ భుట్టో)సాహిబా 1990లో రాజీవ్‌గాంధీతో ఫోన్లో మాట్లాడారు. కాశ్మీర్ సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించుకుందామని ఆమె ప్రతిపాదించారు'అని జర్దారీ స్పష్టం చేశారు. పదేళ్లలో ఏ పాక్ పాలకులూ(జనరల్ జియాతోపాటు) కాశ్మీర్ సమస్య గురించి మాట్లాడిన పాపాన పోలేదని రాజీవ్ స్వయంగా బేనజీర్‌తో అన్నారని ఆయన తెలిపారు. లాహోర్‌లో జరిగిన ఓ కాశ్మీరీ సభలో జర్దారీ మాట్లాడుతూ అనేక విషయాలు ప్రస్తావించారు. కాశ్మీర్ అంశం కూడా అత్యంత ప్రాధాన్యత గలదేనని దాన్ని పరిష్కరించుకోవాలన్న ఆసక్తి, ఆకాంక్ష రాజీవ్‌గాంధీ వ్యక్తం చేసినట్టు జర్దారీ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పాకిస్తాన్‌తో మాట్లాడి పరిష్కరించుకుంటామన్న రాజీవ్ 1991లో ఎల్‌టీటీఈ చేతులో హతులయ్యారని మాజీ అధ్యక్షుడు వెల్లడించారు. 1991 మే 21న శ్రీపెరంబదూర్‌లో ఎన్నికల ర్యాలీలో ఉండగా ఆయనను హత్యచేశారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) తప్పమరే పార్టీకి కాశ్మీర్ సమస్య పట్టలేదని, భారత్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలని భావించామని పీపీపీ కో-చైర్మన్ జర్దారీ స్పష్టం చేశారు. బేనజీర్ హత్య తరువాత పీపీపీ 2008-2013 వరకూ పాక్‌లో అధికారంలో ఉంది. అప్పట్లో భారత ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి పాక్ ఈ అంశాన్ని తీసుకొచ్చింది. సైనిక జనల్ ముషారఫ్ కాశ్మీర్ సమస్య పరిష్కరించుకోవాలన్న ఆసక్తి ఉండేదని జర్దారీ తెలిపారు. అయితే మరే జనరల్ కూడా అంత సానుకూలత చూపేవారు కాదని ఆయన అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీకి స్నేహితుడిగా చెప్పుకునే నవాజ్ షరీఫ్ కూడా ఏనాడు కాశ్మీర్ అంశం కనీసం ఆక్రమిత కాశ్మీర్ విషయాన్ని ప్రస్తావించలేకపోయాడని జర్దారీ విమర్శించారు.

పైరెట్ల చెర నుంచి 22 మందికి విముక్తి

ముంబయి, ఫిబ్రవరి 6: అమెరికా వాయువ్యంగా బెనిన్ తీరంలో పైరెట్లు కిడ్నాప్ చేసిన 22 మంది భారతీయ నౌకా సిబ్బందికి విముక్తి లభించింది. ఐదు రోజుల నిర్బంధంలో ఉంచుకుని వారిని విడుదల చేసినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. కార్గో నౌకను, సిబ్బందిని పైరెట్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మర్చంట్ షిప్ మెరైన్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 22 మంది సిబ్బందిని క్షేమంగా విడుదలయ్యారని సుష్మా ట్వీట్ చేశారు. తమ అధికారులు విడుదలకు సహకరించిన నైజీరియా, బెనిన్ ప్రభుత్వాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.





అమర జవానుకు నివాళి





ఆస్పత్రిపై దాడిచేసి తప్పించుకున్న మిలిటెంట్ కోసం శ్రీనగర్‌లో ముమ్మరంగా గాలిస్తున్న సైనికులు... ఈ దాడిలో మరణించిన జవాన్ ముస్తాక్ అహ్మద్‌కు అధికారులు ఘన నివాళులర్పించారు.

అంతరాయాలతో విశ్వసనీయతకు భంగం

రాజ్యసభ వాయిదాలపై చైర్మన్ వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: సభా నిర్వహణకు తరచూ అంతరాయం కలిగించడం వల్ల సభాగౌరవానికి భంగం వాటిల్లుతుందని, ప్రజల్లో వ్యతిరేక భావన ఏర్పడుతుందని, సభ విశ్వసనీయత దెబ్బతింటుందని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తాము ప్రతిపాదించిన వాయిదా తీర్మానాలను అనుమతించకపోవడంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభానిర్వహణకు ఆటంకం కలిగిస్తుండడంతో మంగళవారం నాడు ఆయన స్పందించారు. సభా కార్యక్రమాలకు ఆటంకాలు లేకుండా వీలైనంత సజావుగా నిర్వహించేందుకు కలసికట్టుగా బాధ్యత వహించాలన్న స్పృహ కలిగించేందుకే తాను సభను సుదీర్ఘ వాయిదాలు వేస్తున్నానని వెంకయ్య చెప్పారు. సభ ప్రారంభమైన వెంటనే తమ గొంతును అణచివేస్తున్నారంటూ విపక్ష తృణమూల్, కాంగ్రెస్ సభ్యులు మంగళవారం నాడు నిరసన వ్యక్తం చేయడంతో సభ మధ్యాహ్నం రెండుసార్లు వాయిదా పడింది. అనంతరం సభాకార్యక్రమాలను బహిష్కరించిన విపక్ష సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ చైర్మన్‌కు లేఖ వ్రాశారు. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే విపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నాయి. జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయంలో నిబంధనల ప్రకారం ఎవరికైనా మాట్లాడేందుకు అవకాశం ఇస్తానని వెంకయ్య అన్నారు. అయితే సభా నిర్వహణ విషయంలో సభ్యుల వైఖరిపట్ల తన ఆవేదనను విపక్షాలకు చెందిన కొందరు సభ్యులు సరిగా అర్థం చేసుకోవడం లేదని అన్నారు. సభను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సభ్యులంతా ఉమ్మడి బాధ్యతగా వ్యవహరించేందుకే వాయిదా వేశానని, పదేపదే సభను అడ్డుకోవడం వల్ల సభ్యులు ప్రజాసమస్యలు ప్రస్తావించే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన అన్నారు. కొన్నేళ్లుగా సభానిర్వహణలో పదేపదే అంతరాయాలు, వాయిదా పడుతుండడంపట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గడచిన మూడు రోజుల్లో జీరోఅవర్‌లో 42 అంశాల ప్రస్తావనకు తాను అవకాశం ఇచ్చానని గుర్తు చేశారు. సభను సజావుగా నిర్వహించకుండా పదే పదే అడ్డుకోవడం ఒక విధానంగా మారిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

వెంకయ్యకు తృణమూల్ లేఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఎగువ సభలో మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విపక్షాలు ఆరోపించాయి. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడుకు ఒక లేఖ పంపినట్లు తృణమూల్ కాంగ్రెస్ మంగళవారంనాడు తెలిపింది. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ప్రతిపక్షాలు భేటీ అయిన నేపథ్యంలో ఈ లేఖను పంపారు. బడ్జెట్ సమావేశాల్లో తొలిసారి విపక్షాలు ఒక్కటయ్యాయి. రాజ్యసభలో తమను మాట్లాడనివ్వకుండా చేస్తున్న ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, ఈ విషయాన్ని ఒక లేఖలో రాజ్యసభ చైర్‌పర్సన్ వెంకయ్యనాయుడికి తెలిపామని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓబ్రియిన్ తెలిపారు. ఈ లేఖపై తమతోపాటు కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాల సభ్యులు సంతకాలు చేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు తమ పరిధిని అతిక్రమిస్తున్నారంటూ ఒక నోటీసును రాజ్యసభ చైర్‌పర్సన్‌కు ఇచ్చింది. ఆయనకు విచక్షణాధికారం ఉందని తమకు తెలుసునని, అయితే ప్రజాస్వామ్యంలో విపక్షాల వాదనను వినడం ఒక పద్ధతని, ఎప్పుడో తప్ప దానిని అడ్డుకోరాదని చాలాసార్లు సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాలన్నింటినీ విపక్షాలు అంగీకరించాయని, వాటినే చైర్మన్‌కు లేఖలో తెలిపామని తృణమూల్ సభ్యుడు సుఖేందుశేఖర్ రాయ్ చెప్పారు. తమ డిమాండ్ పరిష్కారం కానిపక్షంలో తదుపరి ఏం చేయాలన్నదానిపై విపక్షాలు ఈ భేటీలో వ్యూహరచన చేశాయి.



సరిహద్దు భద్రతా దళం ఐటిబిపి ఏర్పాటుచేసిన విహారయాత్రలో భాగంగా ఢిల్లీలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన లడఖ్, సిక్కిం విద్యార్థులు

వర్శిటీ ర్యాంకుల్లో మెరుగుపడిన భారత్

ఆసియాలో 42వ ర్యాంకు • తొలి స్థానంలో సింగపూర్

లండన్, ఫిబ్రవరి 6: ఆసియాలో విశ్వవిద్యాలయాల వార్షిక ర్యాంకుల విషయంలో భారతదేశం ప్రాతినిధ్యం మెరుగుపడింది. గత ఏడాది 33 స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు ఏకంగా 12 స్థానాలు ఎగబాకి 45వ ర్యాంకు సాధించింది. అయితే దేశంలోని పేరెన్నిగన్న పలు విద్యాసంస్థల స్థానాలు దిగజారాయి. 2018కిగాను ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా ప్రాంత ర్యాంకులను మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితాలో సింగపూర్ మొదటి ర్యాంకును సాధించింది. భారత్‌లోని అత్యుత్తమ విద్యాసంస్థలు బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) 29వ స్థానానికి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బాంబే) 44వ స్థానానికి రెండేసి స్థానాల చొప్పున దిగజారిపోయాయి. మరోవైపు టాప్ 200 జాబితాలో మద్రాస్ ఐఐటీ ఏకంగా 41 ర్యాంకులను కోల్పోయి 103వ స్థానానికి పడిపోయింది.

ఆసియా ర్యాంకులలో ఇండియా ఏకంగా 12 స్థానాలను మెరుగుపరుచుకోవడం, ఆ ర్యాంకుల జాబితాలో 42 విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకోవడం అద్భుతమని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ గ్లోబల్ ర్యాంకింగ్స్ ఎడిటోరియల్ డైరక్టర్ ఫిల్ బటీ అన్నారు. చైనావంటి తూర్పు ఆసియా దేశాల మాదిరిగా త్వరితగతిన అభివృద్ధి సాధించకపోయినప్పటికీ ఎప్పటికప్పుడు తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటోందని ఆయన పేర్కొన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే భారత్ పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, ఆసియాలో భారత్ ఇప్పటికే ఉన్నతవిద్యారంగంలో అగ్రగామిగా ఉందని ఆయన చెప్పారు. అయితే దేశంలోని పలు విద్యాసంస్థలు తమ స్థానాలను దిగజార్చుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆసియా విశ్వవిద్యాలయాల ర్యాంకుల కోసం గత ఏడాది 300 విశ్వవిద్యాలయాలు పోటీ పడితే ఈ ఏడాది అదనంగా మరో 50 వర్శిటీలు చేరాయి. కాగా కొత్తగా చేరినవాటిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ 141వ ర్యాంకును, బనారస్ హిందూ యూనివర్శిటీ 194వ ర్యాంకును సాధించాయి. పరిశోధన, ఉత్పాదన విభాగాల్లోను, ఉన్నత విద్యావిభాగంలోను భారత్ మెరుగైన పాయింట్లను సాధించింది.

ఒకే సిరంజి.. 50మందికి హెచ్ఐవి!

యూపీలో నకిలీ వైద్యుడి నిర్వాకం • కంగుతిన్న ఆరోగ్య విభాగం

ఉన్నావ్ (యూపీ), ఫిబ్రవరి 6: ఖర్చు తక్కువ వైద్యం వారందరి కొంపముంచింది. రేటు తక్కువ సూదిమందుకు ఆశపడినందుకు హెచ్ఐవి సోకింది. యూపీలో ఒకే సిరంజ్‌తో 46 మందికి ఎయిడ్స్ తెచ్చేశాడో నకిలీ వైద్యుడు. అర్హతతో నిమిత్తం లేకుండా అతను చేసిన వైద్యానికి గత పది నెలల్లో 46మంది ప్రాణాంతక వ్యాధి బారినపడ్డారు. ఒకసారి వాడిన సిరంజ్‌ని మరొకరికి వాడకూడదన్నది వైద్య నియమం. ఈ నకిలీ వైద్యుడికి ఆ ప్రాథమిక ఇంగితం కూడా లేదు. రోగులు ఎందరైనా సూది ఒక్కటేనన్న రీతిలో అతను చేసిన వైద్యం వికటించింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనతో కళ్లు తెరిచిన యూపీ సర్కారు, ఆ బూటకపు వైద్యుడి కోసం గాలింపు మొదలెట్టిందని అధికారులు తెలిపారు. బంగార్మావ్ పోలీస్ స్టేషన్‌లో నకిలీ వైద్యుడిపై కేసు నమోదైంది. ఏప్రిల్ నుంచి జూలై మధ్యకాలంలో ఈ తహశీల్‌లో హెచ్ఐవి కేసుల పరిశీలన జరుగుతున్న సమయంలో ఒకే ప్రాంతానికి చెందిన 13మందికి వైరస్ సోకినట్టు గుర్తించామని ప్రధాన వైద్యాధికారి ఎస్పీ చౌదరి తెలిపారు. ఒకదాని తరువాత ఒకటిగా హెచ్ఐవి కేసులు పెరగడంతో అనుమానం వచ్చి, అధ్యయనానికి ఆరోగ్య విభాగంలోని ఇద్దరు సభ్యులతో కమిటీ వేశామన్నారు. బృందం సభ్యులు ప్రేమ్‌గంజ్, చక్మీర్‌పూర్ వంటి ప్రాంతాల్లో పర్యటించి నివేదిక సమర్పించారని, ఆ ప్రాంతాల్లో 566మందిని పరీక్షిస్తే 21మందికి హెచ్ఐవి ఉందని తేలిందన్నారు. మొత్తం 46మంది ఈ ప్రాణాంతక వ్యాధి బారిన పడినట్టు స్పష్టమైందన్నారు. ఇంతమందికి హెచ్ఐవి తెచ్చిన బూటకపు వైద్యుడు రాజేంద్రకుమార్ తక్కువ ఖర్చుతో చికిత్స చేస్తానంటూ ఒకే సిరంజిని అందరికీ వాడటం వల్లే ఈ భయానక వ్యాధి దాపురించిందన్నారు. హెచ్ఐవి సోకిన రోగులను కాన్పూర్ చికిత్సా కేంద్రానికి తరలించామన్నారు.

వివాదంలో 'మణికర్ణిక'

- ఝాన్సీ చరిత్రను వక్రీకరించారు
- సర్వ బ్రాహ్మిణ్ మహాసభ ఆగ్రహం
- ఆరోపణలు కొట్టిపారేసిన నిర్మాత జైన్
- బెదిరింపులకు లొంగేది లేదని స్పష్టీకరణ

జైపూర్, ఫిబ్రవరి 6: చారిత్రక పాత్రలతో నిర్మిస్తోన్న సినిమాలకు వివాదాలు వెంటాడుతున్నాయి. చరిత్రను వక్రీకరిస్తూ సినిమాలు తీస్తున్నారంటూ సంబంధిత వర్గాలు ఆందోళనలు చేపడుతుండటం తెలిసిందే. దీపికా పదుకొనె ప్రధాన పాత్రలో ఎప్పుడో మొదలైన 'పద్మావతి' చిత్రం అనేకానేక వివాదాలను దాటుకుని కొద్ది రోజుల క్రితమే విడుదలవ్వడం తెలిసిందే. ఈ వివాదాన్ని మర్చిపోకముందే కంగనా రనౌత్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'ని క్రమంగా వివాదాలు చుట్టుముడుతున్నాయి. సినిమా కమర్షియల్ పాపులార్టీ కోసం వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయ్ చరిత్రను వక్రీకరించి చిత్రాన్ని నిర్మిస్తున్నారంటూ సర్వ బ్రాహ్మిన్ మహాసభ ఆందోళనకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని సినిమా నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఈస్ట్ ఇండియా కంపెనీకి ప్రతినిధిగా వచ్చిన బ్రిటీష్ ఏజెంట్‌తో ఝాన్సీ లక్ష్మీభాయ్ రొమాన్స్ చేసినట్టు ఓ ప్రేమ పాటను చిత్రీకరిస్తున్నారన్నది సర్వ బ్రాహ్మిన్ మహాసభ ఆరోపణ.



ఝాన్సీ పాత్రలో కంగనా రనౌత్

అయితే ఈ ఆరోపణలను మణికర్ణిక నిర్మాత కమల్ జైన్ కొట్టిపారేశారు. 'రాణీ లక్ష్మీభాయ్, ఈస్ట్ ఇండియా కంపెనీ బ్రిటీష్ ఏజెంట్‌మీద ఓ ప్రేమ పాట చిత్రీకరిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. చరిత్రను వక్రీకరిస్తూ జయశ్రీ మిశ్రా రాసిన వివాదాస్పద పుస్తకం 'రాణి' ఆధారంగా మణికర్ణికను చిత్రీకరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి' అని సర్వ బ్రాహ్మిణ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మిశ్రా వెల్లడించారు. ఎలాంటి వక్రీకరణలు లేవని నిర్మాతలు హామీ ఇచ్చేవరకూ ఆందోళనను విరమించేది లేదని హెచ్చరించారు. 'ఈ విషయంలో మేం గవర్నర్, హోంమంత్రిని కలుస్తాం. ప్రభుత్వం స్పందించకుంటే, మూడు రోజుల్లో ఆందోళనలు మిన్నంటుతాయి' అని మిశ్రా హెచ్చరించారు. మణికర్ణిక కథను సిద్ధం చేసిన రచయితల వివరాలు తమకు వెల్లడించాలంటూ గత జనవరి 9న నిర్మాత జైన్‌కు లేఖ రాశామన్నారు. 'పద్మావతి' తరహాలో ఆందోళన తీవ్రం కాకముందే ప్రభుత్వం జోక్యం చేసుకుని నిర్మాతల నుంచి హామీపత్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే, వివాదంపై నిర్మాత జైన్ మాట్లాడుతూ సర్వ బ్రాహ్మిణ్ మహాసభ నుంచి ఎలాంటి అభ్యంతరాలు తమ దృష్టికి రాలేదని, అలాగే సురేష్ మిశ్రానుంచి తనకు లేఖ కూడా అందలేదన్నారు. 'మణికర్ణికలో ఎలాంటి అభ్యంతరకర, రొమాంటిక్ సన్నివేశాలు లేవు. రాజరిక చరిత్రలో గొప్ప నాయకురాలు రాణీ లక్ష్మీభాయ్ కథను మాత్రమే మేం చెప్పదలచుకున్నాం' అన్నారు. 'దేశం కోసం పోరాడిన మహిళ ధీరగాథ స్క్రీన్‌కు ఎక్కకుండా అడ్డుకోవడం బాధ కలిగిస్తుంది. తెరకెక్కిస్తున్న ఝాన్సీ కథలో ఏమీ దాచాలని అనుకోవడం లేదు. ఈ విషయంలో ఎవ్వరికైనా అనుమానాలుంటే మమ్మల్ని కలిసి నివృత్తి చేసుకోవచ్చు. చారిత్రక పాత్రను ఎంతవరకూ చూపించాలో మాకు తెలుసు. అలాగని బెదిరింపులకు భయపడి నిర్మాణాన్ని ఆపేది లేదు' అని జైన్ స్పష్టం చేశారు.

ఢిల్లీని ఆదర్శంగా తీసుకునేంత సీన్ లేదు

చెత్త నివారణ అంశంపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశానికి రాజధానే అయినా, ఇతర ప్రాంతాలు ఢిల్లీని ఏమాత్రం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకరమైన సమస్యగా పరిణమిస్తోందని ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీనియర్ కౌన్సిల్ కోలిన్ గాన్సల్వేస్ ఢిల్లీలో చెత్త యాజమాన్య నిర్వహణపై ఓ అధ్యయనం చేసి నివేదిక పొందుపర్చారు. ఆ నివేదికలో చెత్త నివారణకు ఢిల్లీ ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్లు సరైన పద్ధతులను అవలంబిస్తున్నాయని, ఇక్కడ తీసుకుంటున్న చర్యలు దేశంలోని మిగిలిన ప్రాంతాలకు ఆదర్శప్రాయం కానున్నాయని పొందుపర్చారు. ఈ నివేదికను పరిశీలించిన జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం పైవిధంగా వ్యాఖ్యానించింది. కాలుష్య నియంత్రణకు ఏర్పాటైన ప్రత్యేక కమిటీ ఢిల్లీ ప్రభుత్వంతో గత జనవరి 12న సమావేశమైందని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ప్రకారం చర్యలు తీసుకోవడానికి అంగీకరించిందని అమికస్ క్యూరీ కొలిన్ బెంచ్‌కు వివరించారు. ఆమేరకు డోర్ టు డోర్ చెత్త సేకరణ, రెండు రోజులకు ఒకసారి రోడ్లు ఊడ్చటం లాంటి పూర్తిస్థాయి పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపడుతుందని కోర్టు దృష్టికి తీసుకొస్తూ, దేశంలోని మిగిలిన ప్రాంతాలు ఢిల్లీని మోడల్ ఆఫ్ చేంజ్‌గా తీసకోవచ్చన్నారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ 'మాకు అంత నమ్మకం లేదు. ఢిల్లీలో వాతావరణ కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరింది' అని వ్యాఖ్యానించింది. ఢిల్లీ ప్రభుత్వం తరపున న్యాయవాది వాసిం ఏ ఖాద్రి తన వాదన వినిపిస్తూ 'జనవరి 12న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ప్రభుత్వం పూర్తిస్థాయి చర్యలు తీసుకుంది' అన్నారు. ప్రత్యేక కమిటీ తదుపరి సమావేశం ఎప్పుడు జరుగుతుందని, మొదటి సమావేశం మినిట్స్ సమర్పించాలని కోర్టు కోరింది. ఒకరోజు సమయం ఇస్తే వాటిని సమర్పిస్తామన్న న్యాయవాది చెబుతూనే, తదుపరి సమావేశం ఎప్పుడన్నది ఇంతవరకూ నిర్ణయించలేదని, నిర్ణయమైన తరువాత కోర్టుకు నివేదిస్తామని సమాధానమిచ్చారు. ఢిల్లీ ప్రభుత్వం తరపున కోర్టుకు హాజరైన అధికారి వద్ద కూడా తదుపరి సమావేశం వివరాలు లేవంటూ ఖాద్రి వివరించారు. దీనిపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'తదుపరి సమావేశానికైనా ఢిల్లీ ప్రభుత్వం బాధ్యత కలిగిన అధికారిని హాజరుపర్చి, పనులు సక్రమంగా నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నాం' అని పేర్కొంది.

వాణిజ్యభూమి

వడ్డీరేట్లు తగ్గిస్తారా?

ద్రవ్య విధాన మండలి భేటీ ప్రారంభం ★ స్టాక్‌మార్కెట్, వాణిజ్యవర్గాల ఉత్కంఠ

ముంబయి, ఫిబ్రవరి 6: స్టాక్ మార్కెట్, వాణిజ్య వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ద్రవ్య విధాన మండలి (మానిటరీ పోలసీ కమిటీ -ఎమ్‌పీఎల్) సమావేశం మంగళవారం ప్రారంభమైంది. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఉర్జిత్ పటేల్ సారథ్యంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం కీలక వడ్డీరేట్ల విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది. ప్రధానంగా ద్రవ్యోల్బణం స్థిరంగా ఉన్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఉంది. ప్రపంచవ్యాప్తంగా మదుపరులు తమతమ షేర్లను విక్రయించేస్తున్న సమయంలో జరుగుతున్న ఈ భేటీపై ఆయా వర్గాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. గత డిసెంబర్‌లో జరిగిన సమావేశంలో కీలక వడ్డీరేట్లను ద్రవ్యవిధాన మండలి మార్చలేదు. ధరలు పెరుగుతున్నాయని భావిస్తూ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతున్నప్పటికీ భవిష్యత్‌లో తగ్గిస్తామన్న సంకేతాలను ఇచ్చింది. వినియోగదారుల ధరల సూచీ ప్రకారం నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.88 శాతంగా ఉంటే 2015 డిసెంబర్‌లో 3.41 శాతంగా ఉంది. గడచిన ఆగస్టులో 0.25 శాతం మేరకు వడ్డీరేట్లు తగ్గిస్తూ రిజర్వ్‌బ్యాంకు నిర్ణయించింది. ఇది గడచిన ఆరేళ్లలో కనిష్ఠం. వరుసగా మూడోసారి కూడా వడ్డీరేట్లు తగ్గించే అవకాశం ఉందని బ్యాంకర్లు, మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉన్నందున కీలక రెపోరేటులో మార్పు ఉండకపోవచ్చని మరికొందరి అంచనా. అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు పెరగడం, పంటల మద్దతు ధరలు పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో రెపోరేటులో మార్పులు ఉండవన్నది వారి భావన. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడునెలల్లో ఆర్థిక వ్యవస్థ చురుకుగా ఉండటం వల్ల ఆర్‌బీఐపై ఒత్తిడి తగ్గింది. అందువల్ల వడ్డీ రేటు తగ్గించి అభివృద్ధి ఊపందుకునే దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాకపోతే పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఒక్కటే ఆర్‌బీఐని ఆందోళనకు గురిచేస్తోంది. ద్రవ్యోల్బణం 4 శాతానికి పరిమితమయ్యేలా చూడాలని ఇటీవల బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్‌బీఐని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ కోరారు. రెపోరేటును తగ్గించకుండా ఉండేలా ఈ పరిణామం ఆర్‌బీఐపై ఒత్తిడి కలిగిస్తోంది.

2.72 లక్షల కోట్ల సంపద హరీ

★ ఆరోరోజూ భారీగా మార్కెట్ పతనం
★ 561 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
★ గ్లోబల్ మార్కెట్ల పతన ప్రభావం

బడ్జెట్ అనంతర పరిణామాల నేపథ్యంలో భారత్ స్టాక్ మార్కెట్ల పతనం వరుసగా ఆరోరోజైన మంగళవారం కూడా కొనసాగింది. ప్రపంచ మార్కెట్‌లు అన్నీ కుదేలుకావడంతో మార్కెట్ సంపద భారీగా కరిగిపోయింది. గత నెల రోజుల్లో ఎన్నడూలేని విధంగా మార్కెట్ 561 పాయింట్లు కోల్పోయిన 34,195.94 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీకూడా 168.30 పాయింట్లు కోల్పోయి 10,498.25 వద్ద ముగిసింది. వాల్‌స్ట్రీట్ నష్టాల పరంపరతో ప్రపంచ మార్కెట్లు అన్నీ తల్లకిందులయ్యాయి. దాని ప్రభావం వల్ల భారత ఈక్విటీలు భారీగా నష్టపోయాయి. బుధవారం ఆర్‌బీఐ తీసుకోబోయే నిర్ణయం ఎలా ఉంటుందన్న ఉత్కంఠ నేడు మదుపర్లు జరిపిన లావాదేవీల్లో స్పష్టంగా కనిపించింది. ద్రవ్యోల్బన స్థిరీకణ నేపథ్యంలో కీలక రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించవచ్చన సంకేతాలు ప్రస్ఫుటమవుతున్నాయి. నేటి లావాదేవీల్లో టాటా మోటర్ షేర్ల విలువ 5.45 శాతం తగ్గింది. అలాగే టీసీఎస్ షేర్లు కూడా 3.58 శాతం మేర విలువలు కోల్పోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా,ఐసీఐసీఐ, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు కూడా దాదాపు2.70 మేర నష్టపోయ్యాయి.

భారీగా పెరిగిన పన్నుచెల్లింపుదారులు

ఏకీకృత ప్రత్యక్ష పన్నుల సంస్కరణల ఫలితం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 : ప్రభుత్వం చేపట్టిన ఏకీకృత పన్నుల సంస్కరణల నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారని, వారి సంఖ్య 8 కోట్లకు చేరిందని సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర చెప్పారు. అసోచామ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రత్యక్ష పన్నుల విధానంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని, వీటిని ఏకీకృతం చేశామని ఆయన చెప్పారు. దీని వల్ల పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారని ఆయన చెప్పారు. పన్నుచెల్లింపుదారుడు, పన్ను వసూలు చేసే వారు పరస్పరం కలవాల్సిన అవసరాన్ని చాలావరకు తగ్గించేలా విధానపరమైన మార్పులు తీసుకువచ్చామని ఆయన చెప్పారు. ఆదాయపన్నుశాఖలో తనతో సహా ఎవరూ తమ విచక్షణ మేరకు కనీసం ఒక్క కేసునూ నేరుగా పరిశీలించలేరని ఆయన చెప్పారు. గత సెప్టెంబర్‌లో ఆదాయపన్నుశాఖ ఈ-అసెస్‌మెంట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఇప్పటి వరకు 60,000 ఈ-అసెస్‌మెంట్‌లను పరిష్కరించామని సుశీల్ చంద్ర చెప్పారు. 2018 బడ్జెట్‌లో ప్రభుత్వం 45 వస్తువులపై కస్టమ్స్ పన్ను పెంచిందని, 5 వస్తువులపై తగ్గించిందని సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారి వనజ ఎన్ శర్మ చెప్పారు.

కొత్తతరం నాయకుల తయారీ

అతి పెద్ద సవాల్

ప్రపంచవ్యాప్తంగా 2488 కీలక పారిశ్రామిక సంస్థలకు చెందినవారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ పరిశోధనలో భాగంగా దీర్ఘకాల అనుభవం ఉన్న వెయ్యిమంది అధికారులు, పదివేల మంది అత్యున్నత ప్రమాణాలున్న ఉద్యోగుల నుంచి విస్తృత స్థాయిలో అభిప్రాయాలు సేకరించారు. ఏటా ప్రపంచంలో 50 బిలియన్ డాలర్ల మొత్తాన్ని వెచ్చిస్తున్నప్పటికీ భవిష్యత్ తరంలో లక్ష్యాలను ఛేదించగల సమర్థులైన నాయకత్వాన్ని చాలా సంస్థలు తయారు చేసుకోలేకపోతున్నట్లు ఈ పరిశోధనలో తేలింది.

ముంబయి, ఫిబ్రవరి 6:ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లలో కొత్త తరం నాయకులను తయారు చేయడమే అతిపెద్దదని ఓ సర్వే తేల్చిచెప్పింది. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో ప్రతిభావంతులు వెళ్లిపోకుండా చూడటం, నిపుణులను ఆకర్షించగలగడంలో వైఫల్యం వంటివి ఆ తరువాతి స్థానాల్లో నిలిచిన సవాళ్లు. మొత్తం 28 సవాళ్లలో భవిష్యత్ తరానికి కావలసిన నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో వైఫల్యమే పెద్ద సమస్యగా తేలింది. ప్రపంచ నాయకత్వ అంచనా (జీఎల్ఎఫ్)-సర్వేలో ఈ విషయాలు వెలుగుచూశాయి. డెవలప్‌మెంట్ డైమెన్షన్స్ ఇంటర్నేషనల్ (డీడీఐ), ది కాన్ఫరెన్స్ బోర్డ్, ఈవై సంయుక్తంగా ఈ సర్వేను నిర్వహించాయి. ప్రపంచంలో భారత్ సహా 54 దేశాలలోని 25,812 మంది నాయకులు, 2547 మంది మానవ వనరుల నిపుణులుల అభిప్రాయాలు సేకరించగా విశ్లేషించారు. వారిలో 64 శాతం మంది తొలి సమస్యకు, 60 శాతం మంది తరువాతి రెండు సమస్యలకు ప్రాధాన్యతను ఇచ్చారు. మూడు అంశాలకు తొలి ఐదు స్థానాల్లో పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా 2488 కీలక పారిశ్రామిక సంస్థలకు చెందినవారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ పరిశోధనలో భాగంగా దీర్ఘకాల అనుభవం ఉన్న వెయ్యిమంది అధికారులు, పదివేల మంది అత్యున్నత ప్రమాణాలున్న ఉద్యోగుల నుంచి విస్తృత స్థాయిలో అభిప్రాయాలు సేకరించారు. ఏటా ప్రపంచంలో 50 బిలియన్ డాలర్ల మొత్తాన్ని వెచ్చిస్తున్నప్పటికీ భవిష్యత్ తరంలో లక్ష్యాలను ఛేదించగల సమర్థులైన నాయకత్వాన్ని చాలా సంస్థలు తయారు చేసుకోలేకపోతున్నట్లు ఈ పరిశోధనలో తేలింది. అయితే సమర్థులైన కొత్త తరం నాయకత్వం అవసరాన్ని వివిధ సంస్థల సీనియర్ అధికారులు గుర్తించారని, ఆ అంశంపై దృష్టిపెట్టారని సర్వే పేర్కొంది. పటిష్టమైన మానవ వనరుల వృద్ధి, నాయకత్వ సృష్టి కీలకమని వారు భావిస్తున్నట్లు తేలింది. అలాగే వివిధ సంస్థలలో స్ఫూర్తిగా నిలిచేవారు చాలా తక్కువని, తాము కూడా ఎవరికీ స్ఫూర్తి కలిగించలేకపోతున్నామని 58 శాతం మంది పేర్కొన్నారు. వివిధ సంస్థల్లో నాయకత్వ లేమి గురించి చెప్పాల్సివస్తే పెద్దసమస్యగానే చెప్పాలని ఈ సర్వేకు నాయకత్వం వహించిన ప్రధాన శాస్త్రవేత్త ఈవాన్ సినార్ (డీడీఐ) పేర్కొన్నారు. నాయకులు, నాయకత్వ నైపుణ్యం, ప్రతిభాపాటవాలను ప్రదర్శించగలగడంలో చాలా తేడాలున్నాయని తేలింది. భారత్‌లో అత్యున్నత ప్రమాణాలున్న సీనియర్ అధికారులు తొలి స్థాయిలో కేవలం 19 శాతం మాత్రమే ఉన్నారని 54 శాతం మంది 54 శాతం మంది హెచ్‌ఆర్ నిపుణులు అభిప్రాయపడ్డారు. వాణిజ్య వ్యూహాలు, ఆధునికీకరణ వంటి అంశాలపై వివిధ సంస్థలు దృష్టి సారించాయని కూడా సర్వే పేర్కొంది.

దుబాయ్‌లో పెట్టుబడుల వేట

★ ఫీనిక్స్, షరాఫ్, దాన్యూబ్ గ్రూపుల ముఖ్య నేతలతో భేటీ
★ దుబాయ్‌లో రోడ్ షో ★ ఒకరోజు పర్యటనకు ముఖ్యమంత్రి బృందం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దఎత్తున పెట్టుబడులు ఆకట్టుకునేందుకు మరోసారి విదేశీ పర్యటనకు సమాయత్తమయ్యారు. ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం సాయంత్రం దుబాయ్ బయలుదేరి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి వెంట ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, మౌలిక వసతుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీ ఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్ పయనమవుతున్నారు. ముఖ్యమంత్రి దుబాయ్‌లో అక్కడి పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులతో గురువారం వరుసగా ముఖాముఖి సమావేశాలు జరుపుతారు. ముఖ్యంగా ఫీనిక్స్ గ్రూపు, షరాఫ్ గ్రూపు, దాన్యూబ్ గ్రూపు ముఖ్యులతో జరిపే సమావేశాలు ఈ పర్యటన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అదేరోజు సాయంత్రం దుబాయ్ ఎయిర్‌పోర్టు డైరక్టర్ జనరల్ డాక్టర్ మహమ్మద్ అల్ జరూనీతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు 'భాగస్వామ్య సదస్సు- 2018'కి సంబంధించి రోడ్ షోలో పాల్గొంటారు.

నకిలీ టీ పొడి గుట్టురట్టు

★ రాయచోటిలో గొడౌన్‌పై విజిలెన్స్ దాడులు
★ రూ.27 లక్షల నకిలీ టీ బ్యాగులు స్వాధీనం

రాయచోటి, ఫిబ్రవరి 6: కడప జిల్లా రాయచోటిలో నకిలీ టీ పొడి విక్రయిస్తున్న వ్యాపారుల గుట్టు రట్టయింది. అస్సాం బ్రాండ్ టీ పేర నకిలీ టీ పొడి తయారుచేసి విక్రయిస్తున్న గోడౌన్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. రూ. 27 లక్షల విలువచేసే నకిలీ టీ పొడి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. రాయచోటిలోని అజ్మత్ ట్రేడర్స్‌పై విజిలెన్స్ అధికారులు జరిపిన దాడుల్లో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. విజిలెన్స్ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. మాసాపేటలోని వేంపల్లె మార్గంలో గల అజ్మత్ ట్రేడర్స్ నిర్వాహకులు గత ఆరేళ్లుగా అస్సాం బ్రాండ్ టీ ప్యాకెట్లు అమ్ముతున్నారు. కాలక్రమంలో హైదరాబాద్ నుంచి స్థానిక టీ పొడి తెప్పించి దాన్ని అస్సాం స్టార్ టీ బ్రాండ్ సరుకులో కల్తీ చేసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

ఏపీ నుంచి విమాన సర్వీసులు

★ ముందుకు వచ్చిన థాయ్‌లాండ్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 6: ఏపీ నుంచి విమాన సర్వీసులు నడిపేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ కాంగ్ కనీత్ రక్ఫోరియన్, ప్రతినిధుల బృందం మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ లేదా విజయవాడ నుంచి విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ, విజయవాడ నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతిలో బౌద్ధ ఆలయ నిర్మాణాన్ని కూడా థాయ్ ప్రతినిధులు ప్రతిపాదించారు.



బంగారు భారత్!

పసిడికి పెరిగిన డిమాండ్ ★ వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక

ముంబయి, ఫిబ్రవరి 6:భారతీయులకు బంగారంపై ఉన్న మోజు అందరికీ తెలిసిందే. అందుకు తగ్గట్టుగానే 2017లో భారత్ బంగారం డిమాండ్ ఏకంగా 9.1 శాతం పెరిగిందట. ధరలు తగ్గడం, సానుకూల ఆర్థిక పరిణామాలు, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విశ్వాసాలు, ధన్‌తేరస్ వంటి కారణాల వల్ల గడచిన ఏడాది బంగారానికి డిమాండ్ బాగా పెరిగింది. 2017లో భారత దేశం బంగారం డిమాండ్ 727 టన్నులుగా నిలిచిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఓ నివేదికలో పేర్కొంది. 2016లో ఈ డిమాండ్ 666.1 టన్నులుండగా గత ఏడాది 61 టన్నుల మేర పెరిగిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ బంగారం గిరాకీ సరళిపై విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయాలను పేర్కొంది. ఆభరణాల కొనుగోళ్లు పెరగడంవల్ల డిమాండ్ పెరిగిందని తెలిపింది.జీఎస్‌టీ సంస్కరణలు గాడిలోపడటం, స్టాక్‌మార్కెట్లు దూసుకుపోవడం, గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారుల జోరు వల్ల ఇది సాధ్యమైందని డబ్ల్యుజీసీ ఎమ్‌డీ (ఇండియా) పీఆర్ సోమసుందరం పేర్కొన్నారు. వడ్డీవ్యాపారాలకు సంబంధించిన చట్టాల్లో సవరణలు కూడా గిరాకీ పెరగడానికి కారణమని చెప్పారు. ఆభరణాల మార్కెట్ డిమాండ్ 2016లో 504.5 టన్నులు ఉంటే 2017లో 12 శాతం మేరకు అంటే 562.7 టన్నులకు డిమాండ్ పెరిగింది. అయితే బంగారాన్ని పెట్టుబడిగా పెట్టే విషయంలో మాత్రం ప్రజలు వెనుకడుగు వేశారు. 2016తో పోలిస్తే పెట్టుబడులు 2 శాతం మేరకు 2017లో తగ్గిపోయాయి. వచ్చే రెండేళ్లలో బంగారు నాణాల డిమాండ్ అత్యంత వేగంగా పెరుగుతుందని ఆయన అంచనావేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బంగారం డిమాండ్ 700-800 టన్నుల మధ్య స్థిరంగా ఉండొచ్చని ఆయన అన్నారు. బంగారం దిగుమతి బాగా పెరిగిందని, 2016లో 558 టన్నులు దిగుమతి చేసుకుంటే, 2017లో 59 శాతం మేరకు, అంటే 888 టన్నులు దిగుమతి చేసుకున్నామని ఆయన చెప్పారు.

1వ పేజీ తరువాయి

అమీతుమీకి హామీ బ్రేక్

అన్యాయాన్ని సరిసిద్దండి. విభజన హామీలు నెరవేర్చండి' అంటూ తెదేపా సభ్యులు మంగళవారం లోక్‌సభలో పెద్దఎత్తున గొడవకు దిగారు. దీంతో లోక్‌సభ మూడుసార్లు వాయిదాపడింది. ఒక దశలో తెదేపా సభ్యులు కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీ, ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గేతో గొడవపడ్డారు. తెదేపా నిరసనలు తారాస్థాయికి చేరడంతో సాయంత్రమే జైట్లీ ఉభయ సభల్లో ప్రకటన చేశారు. 'విభజన చట్టం ప్రతి హామీనీ కేంద్రం అమలు చేస్తుంది. రాష్ట్రానికి హోదా లేనిపక్షంలో కేంద్ర పథకాలకు కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధులు భరించాలి. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర పథకాల్లో రాష్ట్రం పదిశాతం భరిస్తే చాలు. అయితే, హోదా ఇవ్వనందున కోల్పోతున్న 30శాతం నిధులను విదేశీ సహాయ పథకాల ద్వారా పూర్తి చేయాల్సి ఉంది. అయితే విదేశీ రుణాలు ఆలస్యమవుతాయి కనుక, ఆ నిధులను నాబార్డ్ ద్వారా ఇప్పించాలని సీఎం చంద్రబాబు లేఖ రాశారు. దీనికి కేంద్రం అంగీకరిస్తోంది' అని లోక్‌సభలో అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఈ ప్రకటనపై పలువురు తెదేపా ఎంపీలు అభ్యంతరం తెలిపారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై ప్రశ్నించారు. రైల్వే జోన్ ఏమైంది? అంటూ జైట్లీని నిలదీశారు. అయితే, నిలదీసిన సభ్యులను సుజన చౌదరి వెనక్కి పిలిపించారు. అంతవరకూ లోక్‌సభలోవున్న ప్రధాని నరేంద్ర మోదీ, ప్రకటన చేసేందుకు జైట్లీ లేవగానే సభనుంచి వెళ్లిపోయారు. జైట్లీ అంతకుముందు రాజ్యసభలో ఈ అంశంపై ప్రకటన చేస్తూ 'విభజన చట్టంలో ఇచ్చిన హామీలకు కట్టుబడివున్నాం. సంస్థలను ఏర్పాటు చేస్తున్నాం. నిధులను సమీకరిస్తున్నాం. ప్రత్యేక హోదాతో ఒనగూరే ప్రయోజనాలన్నీ ఎలా కల్పించాలనే అంశంపై కొంత వివాదం ఉంది. విదేశీ రుణ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం కల్పించాలని రాష్ట్రం మొదట కోరింది. అయితే విదేశీ రుణాలు ఆలస్యమవుతాయన్న ఆలోచనతో నాబార్డ్ ద్వారా నిధులు ఇప్పించాలని చంద్రబాబు కోరారు. నాబార్డ్ ద్వారా కల్పిస్తే లోటు వివాదం వచ్చే అవకాశం ఉంది. కాబట్టి సమస్య పరిష్కారానికి ఆలోచించి తగు నిర్ణయం తీసుకుంటాం. ఐదేళ్లకు ఇవ్వాల్సిన మొత్తం మాత్రమే ఇందులో ఉంటుంది. పది నెలల లోటు సమస్యనూ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. ఏపీకి ఇప్పటికే 3.99 వేల కోట్లు చెల్లించాం. మరికొంత మొత్తం చెల్లించాల్సి ఉంది' అన్నారు. తెదేపా ఎంపీ రమేష్ లేచి ప్రత్యేక రైల్వే జోన్ ఏమైందని ప్రశ్నించగా పీయూష్ గోయల్ లేచి జోన్ మార్చాలంటే పక్క రాష్ట్రాలతోనూ చర్చించాలి. ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా సమస్యను పరిష్కరించాల్సి ఉంది. అందరితో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. ప్రత్యేక జోన్ ఏర్పాటు వ్యవహారం పరిశీలనలో ఉంది అన్నారు. తెదేపా, వైకాపా సభ్యులు మంగళవారం ఉదయం 11 గంటల నుంచే లోక్‌సభలో ఏపీకి బడ్జెట్‌లో అన్యాయం జరిగిందంటూ గొడవ ప్రారంభించారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టగానే తెదేపా సభ్యులు తోట నరసింహం, నిమ్మల కిష్టప్ప, కేశినేని నాని, శ్రీరాం మల్యాద్రి, కె నారాయణ, గల్లా జయదేవ్, పి రవీంద్రబాబు, మాగంటి బాబు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, అవంతి శ్రీనివాస్, శివప్రసాద్, జేసీ దివాకర్ రెడ్డి, మురళీమోహన్, వైకాపా సభ్యులు సుబ్బారెడ్డి, అవినాష్‌రెడ్డి, మిథున్ రెడ్డి, డాక్టర్ వరప్రసాద్ రావు పోడియం వద్దకు దూసుకువచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలిచ్చారు. కొత్తపల్లి గీత, బుట్టా రేణుక, రాయపాటి సాంబశివరావు సభలోవున్నా పోడియం వద్దకు రాలేదు. శివప్రసాద్ చిడతలు వాయిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. వీరి నినాదాల మూలంగా సభ స్తంభించటంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తరువాతా సభ్యులు పెద్దఎత్తున నినాదాలిచ్చారు. గందరగోళం మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాల కార్యక్రమం ముగించి రాష్టప్రతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించారు. తెదేపా, వైకాపా సభ్యులు మాత్రం మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు నినాదాలిస్తూనే ఉన్నారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సభలోకి రావడంతో సభ్యులు మరింత రెచ్చిపోయారు. ఆ సమయంలో ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా అడ్డుతగలటాన్ని కాంగ్రెస్ సభ్యులు గట్టిగా వ్యతిరేకించారు. దీంతో ఇరుపక్షాల మధ్య కొంత వాగ్వాదం తలెత్తింది. సుమిత్రా మహాజన్ సభను 35 నిమిషాలపాటు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన అనంతరం మల్లికార్జున ఖర్గే ప్రసంగం ముగించిన అనంతరం జైట్లీ తెలుగుదేశం ఎంపీల డిమాండ్‌పై ప్రకటన చేశారు.

ఆస్పత్రిపై ఉగ్రమూక దాడి

వెంటనే వారిపై ఇద్దరు తీవ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. పోలీసులు తీసుకువచ్చిన ఆరుగురిలో ఐదుగురు తీవ్రవాదులు నేలపై పడుకోగా పోలీసులపై దుండగులు బుల్లెట్ల వర్షం కురిపిస్తూ నవీద్‌తో సహా పరారయ్యారు. ఈ దాడి జరిగిన ఆస్పత్రి కశ్మీర్ సంస్థానం చివరి రాజు శ్రీ మహరాజా హరిసింగ్ పేరుతో నిర్వహిస్తున్నారు. పరారైన తీవ్రవాది మహమ్మద్ నవీద్ ఝుట్‌పాకిస్తాన్‌లోని ముల్తాన్‌లో బోరెవిల్లా జిల్లాకు చెందినవాడు. మధ్యలోనే చదువు ఆపేసి లష్కరేలో చేరాడు. హైదర్‌పొరాలో సైన్యంపైన, సీఆర్‌పీఎఫ్ శిబిరాలపై మూడు సార్లు, సిల్వర్‌స్టార్ హోటల్‌పైన జరిపిన కాల్పులవెనుక ఇతడి హస్తం ఉంది. స్కైప్, జీపీఎస్, కంపాస్, వైర్‌లెస్ సెట్లవంటి అధునాత పరికరాలను వాడటంలో శిక్షణ పొందిన ఝుట్‌ను 2014 ఆగస్టు 16న భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిజానికి మహమ్మద్ నవీద్ ఝుట్‌తో సహా ఆరుగురు తీవ్రవాదులను కశ్మీర్ లోయకు దూరంగా అధునాతన భద్రతా ఏర్పాట్లు ఉన్న మరో జైలుకు తరలించేందుకు గత ఏడాది డిసెంబర్ 26న ప్రయత్నించగా సెషన్స్ కోర్టు అనుమతించలేదు. ఇప్పుడు అతడు తప్పించుకున్నాడు.

కేంద్రం కదిలింది..!

ఆందోళన పట్ల సానుకూలంగా ఉన్నారన్న సమాచారం వచ్చినందున, మరో మూడురోజులు సభలో మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించింది. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఆందోళన ఏవిధంగా కొనసాగించాలన్న అంశంపై టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు మంగళవారం సహచర మంత్రులు, పార్టీ నేతలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అంతకంటే ముందు ఎంపీలు, జిల్లా నేతలతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఆ సందర్భంగా మంగళవారం ఉదయం పార్లమెంటులో పార్టీ ఎంపీల ఆందోళన, ప్రధానితో కేంద్రమంత్రి సుజనా చౌదరి, ఎంపీలతో అరుణ్‌జైట్లీ, పీయూష్ గోయల్ చర్చల ప్రస్తావన వచ్చింది. వాటిపై బాబు, పార్టీ నేతలు విశ్లేషించారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. మోదీతో సుజనా చౌదరి భేటీలో చెప్పుకోదగ్గ పురోగతిగానీ, నిర్దిష్టమైన హామీగానీ కనిపించలేదని సమావేశం అభిప్రాయపడింది. 'ప్రధాని క్యాజువల్‌గా సుజనాతో మాట్లాడారు. ఆందోళన వద్దు. నేను న్యాయం చేస్తానన్న మాటలే తప్ప, నిర్దిష్టంగా ఫలానాది చేస్తున్నామని చెప్పలేదు. అయినా అదీ ఒకందుకు మంచిదే. మన ఆందోళనను ప్రధానిని గమనించి స్పందించారు' అని ఓ మంత్రి వ్యాఖ్యానించారు. అరుణ్‌జైట్లీ, గోయల్ కూడా తమ పార్టీ ఎంపీలతో చర్చించడం బట్టి కేంద్రం తమ ఆందోళన వల్ల కదిలిందని స్పష్టమైనందున, ఇంకా ఒత్తిడి పెంచుదామన్న నేతల అభిప్రాయంతో బాబు ఏకీభవించారు. చూస్తాం. చేస్తామని చెబితే ప్రజలు నమ్మేరోజులు పోయాయని, మాటలను చేతలతో నిరూపించుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు.

కాగా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి విభజన చట్టంలో ఏముందో దాని ప్రకారమే నిధులివ్వాలని డిమాండ్ చేయాలని, ఇటీవల తాను ప్రధానిని కలసి 21 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చానని, దానిని అమలుచేయాలని పట్టుపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తనకు ప్రధాని ఫోన్ చేశారంటూ కొన్ని చానెళ్లలో వచ్చిన వార్తలపై బాబు మండిపడ్డారు. మోదీ తనకు ఫోన్ చేయలేదన్నారు. రాజ్యసభలో మన పార్టీలంతా వెల్‌లోకి వెళితే విజయసాయిరెడ్డి ఒక్కరే సీట్లో కూర్చున్నారని, ఇప్పటికీ బడ్జెట్‌పై జగన్ తన వైఖరి చెప్పని విషయాన్ని ప్రజల్లోకి వెళ్లి చెప్పాలని సూచించారు. పదవులు అనుభవించే నేతలు కీలక అంశాలపై స్పందించకపోతే సహించేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది.

'భూమి' కథనం చదివిన బాబు

కాగా రాష్ట్రంలో మిత్రపక్షాల మధ్య తలెత్తిన విబేధాలు, టీడీపీ- బీజేపీ నేతల మాటల యుద్ధంపై మంగళవారం 'ఆంధ్రభూమి'లో వెలువడిన 'లొంగదీసుకోవడమే బీజేపీ లక్ష్యం' వార్తా కథనాన్ని సీఎం చంద్రబాబు సమావేశంలో ఆసాంతం చదివి వినిపించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి, ప్రజాభిప్రాయం, పొత్తులపై జాతీయ పార్టీల వ్యూహాల గురించి విశ్లేషణ బాగుందని, జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీల మనోగతంపై వివరణ బాగుందని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

తెలుగు రాష్ట్రాలకు 5,483 కోట్లు కేటాయింపు

కృష్ణపట్నం లైనుకు రూ.200 కోట్లు, ముద్కేడ్-పరబానీకి రూ.80 కోట్లు, గుంటూరురు-తెనాలి డబ్లింగ్ పనులకు రూ.40 కోట్లు, ఎంఎంటిఎస్ ఫేజ్-2ను ఈ ఏడాది పూర్తి చేస్తారు. గత మూడేళ్లలో రూ.470కోట్లు ఖర్చుపెట్టారు. మనోరాబాద్- కొత్తపల్లికి రూ.125కోట్లు, మునిరాబాద్-మహబూబ్‌నగర్‌కు రూ.275 కోట్లు, భద్రాచలం-సత్తుపల్లికి రూ.120కోట్లు, కాజీపేట-బలార్షా 3వ లైన్‌కు రూ.301 కోట్లు, నడికుడి-శ్రీకాళహస్తికి రూ.420 కోట్లు, కడప-బెంగళూరుకు రూ.175 కోట్లు, విజయవాడ-గుంటూరు వయా అమరావతికి రూ.10 కోట్లు, గుంతకల్-కల్లూరు డబ్లింగ్ పనులకు రూ. 76.52 కోట్లు, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ పనులకు రూ.200 కోట్లు, కోటిపల్లి-నర్సాపూర్‌కు రూ. 200 కోట్లు, సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులకు రూ. 250 కోట్లు, గుత్తి-ధర్మవరం డబ్లింగ్ పనులకు రూ.76 కోట్లు, కాజీపేట-విజయవాడ 3వ లైన్ ప్రాజెక్టుకు రూ. 60 కోట్లు, విజయవాడ-గూడూరు 3వ లైన్ ప్రాజెక్టుకు రూ. 250 కోట్లు, ఘటకేసర్-యాదాద్రి విస్తరణ ఎంఎంటిఎస్ ఫేజ్-2కు రూ.21.25 కోట్లను కేటాయించారు. చర్లపల్లి వద్ద శాటిలైట్ టర్మినల్‌కు రూ. 5 కోట్లు, కాజీపేట వర్క్‌షాపుకు రూ. 200 కోట్లు, కర్నూలులో మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్ ఫ్యాక్టరీకి రూ. 58.12 కోట్లు కేటాయించారు. మౌలాలిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైల్వే ఫైనాన్స్ మేనేజిమెంట్‌కు రూ.5 కోట్లు, తిరుచానూర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 10 కోట్లు, నల్లపాడు-గుంతకల్ ప్రాజెక్టుకు రూ.26.50కోట్లు, గుంతకల్-కల్లూరు విద్యుద్దీకరణకు రూ.291.75 కోట్లు, పెద్దపల్లి-లింగంపేట జగిత్యాల విద్యుద్దీకరణకు రూ.33.31 కోట్లు, మన్మాడ్-ముద్కేడ్-డోన్ విద్యుద్దీకరణకు రూ.115 కోట్లు, గుంతకల్-బళ్లారివిద్యుద్దీకరణ పనులకు రూ.50కోట్లను కేటాయించారు.

ఏపీలో సీఎస్ఐఆర్ సెంటర్

సమావేశంలో సీఎస్ఐఆర్ డైరక్టర్ల బృందం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా సీఎస్ఐఆర్ నేతృత్వంలో 38 ప్రయోగశాలలు, 39 ఫీల్డ్ స్టేషన్లు ఉన్నాయని, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్, ఓషన్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మెటలర్జీ, కెమికల్స్, మైనింగ్, ఫుడ్, పెట్రోలియం, లెదర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ వంటి అన్ని రంగాల్లో తాము నిరంతర పరిశోధన చేస్తున్నామని గిరీశ్ సాహ్నీ సీఎంకు వివరించారు. శాస్త్ర సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటున్న ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంలో కొత్త ప్రాజెక్టు కోసం పనిచేయడం తమకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తోందన్నారు. రెండు మాసాల్లో పూర్తి డీపీఆర్‌తో వస్తామన్నారు. శాశ్వత నిర్మాణం పూర్తయ్యేవరకు వేచి ఉండాల్సిన అవసరం లేదని, తాత్కాలిక ఏర్పాటు చేసుకుని వెంటనే కార్యరంగంలోకి దిగాలని సీఎం వారికి సూచించారు. భారతదేశం గర్వించే స్థాయికి సీఎస్ఆర్ఐ ఎదిగినా, పరిశోధనా ఫలాలు క్షేత్రస్థాయికి చేరడం లేదని అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి తోడు ఇప్పుడు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ జత కలిసిందని గుర్తుచేశారు. సాంకేతికంగా ఉన్న ప్రతి ఒక్క అవకాశాన్నీ తమ ప్రభుత్వం సంపూర్ణంగా వినియోగించుకుంటోందని తెలిపారు. సిలికాన్ వ్యాలీ తరహాలో ఏపీని ఇన్నోవేషన్స్ వ్యాలీగా మార్చాలని తమ ప్రభుత్వం స్థిరంగా సంకల్పించిందని తెలిపారు. ముఖ్యంగా సౌర విద్యుత్ రంగంలో బలపడుతున్నామని, విద్యుత్ ధర తగ్గించాలన్న ఒకే ఒక లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. శాస్త్ర సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించుకునేలా సీఎస్ఐఆర్ తమకు మార్గదర్శనం చేయాలని కోరారు.

మారడోనాతో కలిసి మళ్లీ జైలుకొస్తా!

పరుగెత్తినట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే అతి పెద్ద కుటుంబం తనదని పేర్కొంటూ, 130 కోట్ల భారతీయుల్లో తానూ ఓ సాధారణ వ్యక్తినేనన్నాడు. మీ వయసెంత? అన్న ప్రశ్నకు 18 ఏళ్ల ప్రతిభకు, 20 ఏళ్లు సంపూర్ణ ఆరోగ్యం, 49 ఏళ్ల వయస్సులో ఉన్నానంటూ చమత్కరించాడు. రోజూ పది కిలోమీటర్లు పరుగెత్తి ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటానని తెలిపారు. ఫుట్‌బాల్, కరాటేలో ప్రావీణ్యం ఉందన్నారు. 1863లో కేరళ రాష్ట్రంలోని వరంతిరపిల్లిలో బాబీ పూర్వీకులు చిన్న వ్యాపారాన్ని ప్రారంభించగా, ఇప్పుడు ప్రపంచస్థాయికి ఎదగడం విశేషం. 2004లోనే ఎక్సలెంట్ యంగ్ బిజినెస్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, విజయ శ్రీ అవార్డు, యూనిక్ వరల్డ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, డాక్టరేట్, మదర్ థెరిస్సా అవార్డులు బాబీ చెమ్మనూర్ సొంతం చేసుకున్నారు. లైఫ్ విజన్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించిన సంతృప్తి ఉందన్నారు. జైలులో దోమలు కుట్టినా నేలపైనే పడుకుని గొప్ప అనుభూతి పొందానన్నారు. సాంబారు, అన్నం రుచిగా ఉందని, ఎప్పుడు సాధారణ తెల్లని బట్టలు ధరించే తాను ఖైదీల దుస్తులు ధరించడం చిత్రమైన అనుభూతి ఇచ్చిందన్నారు. జైలు అభివృద్ధికి తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తానని, త్వరలోనే ఎన్ని లక్షలు కేటాయిస్తాననే విషయాన్ని వెల్లడిస్తానంటూ ఉదారతను చాటుకున్నారు. తన వ్యాపార సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న మారడోనా త్వరలోనే కేరళ సందర్శించనున్నాడని, అప్పుడు ఆయన్ని తీసుకుని జైలుకు వచ్చి ఒక రోజు జైలు జీవితం గడుపుతామని అన్నారు. జైలు నుండి బయటకు వచ్చాక బస చేసిన హోటల్‌కు వెళ్లేందుకు జైలు అధికారులు వాహనాన్ని ఏర్పాటు చేస్తామన్నా, సున్నితంగా తిరస్కరించి ఆటోలో వెళ్లిన బాబీ చెమ్మనూర్ సాధారణ వ్యక్తిత్వానికి నిదర్శనమే. కాగా ఇప్పటి వరకు 52 మంది ఈ జైలుకు వచ్చి అనుభూతిని పొందారని కంది, సంగారెడ్డి జైళ్ల సూపరింటెండెంట్లు సంతోష్‌కుమార్ రాయ్, వెంకటేశ్వర్లు వెల్లడించారు. మరో ఐదుగురు వ్యక్తులు రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

క్రీడాభూమి

నిద్రాణ ప్రతిభకు దివిటీ
‘ఖేలో ఇండియా’

❍ స్కూలు నుంచి ఆసియా క్రీడల వరకూ రాచబాట
❍ 2024, 2028 ఒలింపిక్స్ పతకాలే లక్ష్యం
❍ కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశ యువతీ యువకులకు అన్ని క్రీడల్లోనూ క్రమశిక్షణాయుతమైన తర్ఫీదునిచ్చి వారిని తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన ఖేలో ఇండియాను మరి కొన్నేళ్ల పాటు విస్తరించాలని కేంద్రం సంకల్పించింది. ఇందులో భాగంగా భవిష్యత్‌లో మహిళల చాంపియన్‌షిప్‌లనూ చేరుస్తామని క్రీడా మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ మంగళవారంనాడిక్కడ ప్రకటించారు. ప్రస్తుతం ఖేలో ఇండియాలో 16 క్రీడలున్నాయని, వాటి సంఖ్యను క్రమంగా పెంచుతామని ఆయన తెలిపారు. ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన రాథోడ్ దీని తర్వాత కళాశాల స్థాయి క్రీడల్ని నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా మహిళా క్రీడలకు అన్ని రకాలుగా ప్రోత్సాహాన్నిస్తామని, ఇందుకోసం విడిగా చాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది నాటికే ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ సంఖ్యను పెంచే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఈ క్రీడల్లో రాణించే అవకాశాల్ని కల్పించకపోతే క్రీడారంగంలో భారత్ రాణించే అవకాశం ఉండదని పేర్కొన్న ఆయన ‘ప్రతిస్కూలు విద్యార్థికీ ఖేలో ఇండియాలో ఆడాలన్న ఆసక్తిని కలిగించాలి. ప్రతి బాలుడూ తాను ఎంచుకున్న క్రీడలో హీరోగా మారే అవకాశం అందించాలి’అని ఉద్ఘాటించారు. ప్రస్తుతం జరుగుతున్న క్రీడా పోటీలో కనిపిస్తున్న ప్రామాణికత ఆనందాన్ని కలిగిస్తోందని, భవిష్యత్‌లో ఇది మరింత పదునెక్కే అవకాశం ఉంటుందని అన్నారు. అమెరికా కాలేజీ క్రీడల తరహాలో ఈ రకమైన పోటీలను దేశ వ్యాప్తంగా నిర్వహించాలని భావిస్తున్నామని, ఇప్పటికే పాదుగొల్పిన ప్రామాణికతతోనే భవిష్యత్‌లో ఖేలో ఇండియా క్రీడలు ముందుకు వెళతాయని రాథోడ్ అన్నారు. ప్రస్తుత ప్రామాణికత అంతర్జాతీయ స్థాయిలో లేకపోయినా, మూడు నాలుగేళ్లలో ఈ స్థాయిని కచ్చితంగా చేరుకోగలుగుతామన్న నమ్మకం తనకు ఉందని తెలిపారు. నిజానికి వచ్చే ఏడాది నుంచే ఈ క్రీడల్ని ప్రారంభించాలని అనుకున్నామని, కానీ చివరికి ఈ ఏడాదే అంకుర్పారణ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ సంతృప్తికరమైన పోటీ ప్రామాణికతతోనే వీటిని మొదలు పెట్టగలిగామన్నారు. స్కూలు, కాలేజీ స్థాయి క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఖేలో ఇండియా రాజబాటే అవుతుందని స్పష్టం చేసిన ఆయన ‘ఒలింపిక్స్ వచ్చే వరకూ ఆగాల్సిన అవసరం లేదు. ఆ స్థాయిలో క్రీడల్ని నిర్వహించే సత్తా సామర్థ్యం ఖేలో ఇండియాకు ఉన్నాయి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి’అని పిలుపునిచ్చారు. స్కూలు, కాలేజీ, కామన్వెల్త్, ఆసియా క్రీడలు ఇలా దేశ యువత వివిధ దశల్లో అన్ని రకాల క్రీడల్లో రాణించేందుకు, నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగు పరచుకునేందుకు అవకాశం ఉంటుందని, అందుకు ఖేలో ఇండియా వేదిక అవుతుందని తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో ప్రతి క్రీడ ముగింపు సమయంలోనూ వెయ్యి మంది ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ఎంపిక చేసి ఎనిమిదేళ్ల పాటు వారికి ఐదు లక్షల చొప్పున స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. 2024, 2029ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాల పంట పండాలన్నదే తమ అంతిమ ధ్యేయమని రాథోడ్ తెలిపారు.

ఆమె కలలు నెరవేరాయ్!

❍ అకాడమీ ద్వారా బాక్సర్ల వెలికితీతకు మేరీ కోమ్ యత్నం

ఇంఫాల్, ఫిబ్రవరి 6: అకాడమీ నెలకొల్పడం ద్వారా ఎంతో మంది యువ బాక్సర్లను వెలికితీయవచ్చుననే అవకాశం కోసం ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన ఎం.సి.మేరీ కోమ్ ఎదురుచూస్తోంది. తన చిరకాల స్వప్నం నెరవేరేందుకు వీలుగా ఆమె తన స్వంత రాష్ట్రం మణిపూర్ పశ్చిమ జిల్లాలోని లాంగోల్ హిల్స్‌లో 33.3 ఎకరాల్లో నెలకొల్పిన బాక్సింగ్ రీజనల్ అకాడమీ పరిధిని విస్తృత చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ అకాడమీని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించాలనుకున్న తన ఆశయం నెరవేరేందుకు ఆమె ఎదురుచూస్తోంది. ప్రస్తుతం అకాడమీలో 45 యువ బాక్సర్లు ఉన్నారు. వీరిలో 20 మంది బాలికలు ఉన్నారు. దేశానికి అత్యుత్తమ బాక్సర్లను అందించాలనే తన చిరకాల కలను నెరవేర్చుకునే రోజు రానే వచ్చిందని మేరీ కోమ్ భర్త, అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఓన్‌లర్ కరోంగ్ అన్నాడు. 35 ఏళ్ల మేరీ కోమ్ ఇప్పటికే ఐదుసార్లు ప్రపంచ, ఆసియన్ చాంపియన్‌గా అవతరించింది. 2012లో లండన్ ఒలింపిక్ గేమ్స్‌లో రజత పతకం సాధించిన భారత మహిళా బాక్సర్‌గా ఖ్యాతి గడించింది. బాక్సింగ్ కోసం మణిపూర్‌తో సహా దేశంలో అన్ని వసతులతో కూడిన మరిన్ని అకాడమీలు రావాల్సిన అవసరం ఉందని మేరీ కోమ్ అభిప్రాయపడింది.

తమ అకాడమీలో అత్యాధునిక సౌకర్యాల కల్పనలో ఎలాంటి రాజీ పడలేదని ఆమె స్పష్టం చేసింది. రెండేళ్ల క్రితమే అకాడమీ పరిధిని విస్తృతం చేశామని, ప్రధాని చేతుల మీదుగా దీనిని ప్రారంభించేందుకు ఎదురు చూస్తున్నామని ఆమె పేర్కొంది. అకాడమీ నెలకొల్పడడంతోనే సరిపెట్టుకోకుండా బాక్సర్లను అత్యుత్తములుగా తీర్చిదిద్దడంతోపాటు వారి వ్యక్తిగత సమస్యలను కూడా తీర్చేందుకు ఆమె ముందుంది. తమ అకాడమీలో శిక్షణ పొందుతున్న బాక్సర్లలో ఎక్కువమంది పేద కుటుంబం నుంచి వచ్చినందున స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) 600 రూపాయల వంతున స్టయిఫండ్ ఇస్తున్నా, వారికి అవసరమైన ఆహారాన్ని కూడా అందించాలని అభ్యర్థించినట్టు డైరెక్టర్ తెలిపాడు.

రికార్డుపై భారత్ కన్ను!

నేడు దక్షిణాఫ్రికాతో మూడో వన్డే

కేప్ టౌన్, ఫిబ్రవరి 6: కరేబియన్ గడ్డపై రెండు వన్డేలలో గెలుపుతో మంచి ఊపుమీద ఉన్న భారత్ క్రికెట్ సేన బుధవారం జరిగే మూడో మ్యాచ్‌పై దృష్టి కేంద్రీకరించింది. ఆరు వన్డేల సిరీస్‌లో పోటీపడుతున్న ఇరు జట్లలో దర్బన్, సెంచూరియన్‌లలో జరిగిన రెండు మ్యాచ్‌లలో అఖండ విజయం సాధించడం ద్వారా ఇప్పటికే భారత్ ఆధిపత్యం దిశగా పయనిస్తోంది. ప్రత్యర్థి టీమ్‌లో గాయాలబారిన పడిన అగ్రశ్రేణి క్రీడాకారులు ప్రస్తుతం జరుగబోయే మిగిలిన వన్డేలలో ఆడే అవకాశం లేనందున, మూడో వన్డేలో సైతం గెలుపుపై భారత్ విజయావకాశాలపై ప్రణాళిక సిద్ధం చేసుకుంది. గడిచిన రెండు వన్డేలలో భారత్ వరుసగా ఆరు వికెట్లు, తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. 1992-03, 2010-11 సంవత్సరాలలో నిర్వహించిన వన్డే సిరీస్‌లలో దక్షిణాఫ్రికాతో ఆడిన భారత్ కేవలం 3-2, 5-2 మ్యాచ్‌లలో గెలుపుతో సరిపెట్టుకుంది. అయితే, ఇపుడు అందుకు భిన్నంగా ఉంది. ఆతిథ్య జట్టును గాయాల సమస్య తీవ్రంగా వేధిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఆరు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకునే దిశగా భారత్ యోచిస్తోంది.

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డే కంటే ముందుగానే ఏబీ డివిలియర్స్, రెండో మ్యాచ్‌కు కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ చేతివేలి గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉన్నారు. ఇపుడు బుధవారం జరిగే మూడో వన్డేలో మరో సభ్యుడు క్వింటన్ డి కాక్ ఎడమ చేతికి మణికట్టు గాయం కారణంగా ఆడే అవకాశం లేదు. ఇతని స్థానంలో ఇంతవరకూ ఎవరినీ ఎంపిక చేయలేదు. అయితే, స్పిన్నర్ హెన్రిచ్ క్లాసెన్‌ను మూడో వన్డేలో వికెట్ కీపర్‌గా జట్టులోకి తీసుకున్నారు.

గడిచిన రెండు వన్డేలలో భారత్ స్పిన్నర్లు యజ్వేందర్ చాహల్, కుల్దీప్ యాదవ్ కలసి 13 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా రెండు వన్డేలలో పోయిన పరువును నిలబెట్టుకునేందుకు ఉన్న వారిలో పేసర్లు, బ్యాట్స్‌మెన్‌లను నమ్ముకుంది. దర్బన్, సెంచూరియన్‌లలో జరిగిన రెండు మ్యాచ్‌లలో ఓపెనర్లుగా దిగిన హషీమ్ ఆమ్లా, డి కాక్ వరుసగా 30, 39 పరుగులు చేశారు. జట్టులో భారత్ స్పిన్నర్లను సైతం ధీటుగా ఎదుర్కొని డుప్లెసిస్ 100 పరుగులు చేశాడు. మర్క్రం రెండు వన్డేలలో వరుసగా 21 బంతులు ఎదుర్కొని 2 పరుగులు, 11 బంతులు ఎదుర్కొని 8 పరుగులు మాత్రమే చేయగలిగాడు. జట్టులోని మిడిలార్డర్ కూడా ఏమంతా రాణించలేదు.

ఇక భారత జట్టు ఎలాంటి మార్పులు లేకుండా మూడో వన్డేలోకి దిగుతోంది. రెండు వన్డేలలో చూపిన తెగువతో కెప్టెన్ విరాట్ కోహ్లీ సేన ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్, ఫీల్డింగ్‌లలో ప్రత్యర్థి కంటే భిన్నంగా ఉంది. దక్షిణాఫ్రిగా గడ్డపై ఇంతవరకు ఆడిన వన్డేలలో భారత్ వరుసగా మూడు వన్డేలలో గెలుపొందిన దాఖలాలు లేవు. దీనిని ఇపుడు తిరగ రాసేందుకు కోహ్లీ సేన శతథా ప్రయత్నాలు చేస్తోంది. మూడో వన్డేలోనూ విజయం సాధిస్తే గతంలో న్యూజిలాండ్‌పై విజయం ఘనతను మరోసారి లిఖిస్తుంది. 1992లో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలలో రెండు మ్యాచ్‌లను కోల్పోయి, ఒక మ్యాచ్‌తోనే భారత్ సరిపెట్టుకుంది.

ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడంతో భారత్‌కు అన్ని విషయాల్లో కలిసి వస్తుందని అభిమానులు ఆశ పడుతున్నారు. సెంచూరియన్, కేప్ టౌన్‌లలో జరిగిన రెండు వన్డేలలో గెలుపు ద్వారా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానాన్ని చేజిక్కించుకుంది.

మహిళల క్రికెట్ — రెండో వన్డేపై చిగురిస్తున్న ఆశలు

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ

కింబర్లే, ఫిబ్రవరి 6: దక్షిణాఫ్రికా జరుగుతున్న మూడు వన్డే సిరీస్‌లలో భాగంగా ఇప్పటికే జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో గెలుపు ద్వారా మంచి ఉత్సాహంతో భారత మహిళా జట్టు బుధవారం జరిగే రెండో వన్డేపై దృష్టి సారించింది. ఏడు నెలల విరామం తర్వాత భారత మహిళా జట్టు ఆడుతున్న వన్డేలలో విజయంతో త్వరలో జరుగబోయే ప్రపంచ కప్‌లో చోటు దక్కించుకునేందుకు కెప్టెన్ మిథాలీరాజ్ నేతృత్వంలోని జట్టు ఎంతో కృషిచేస్తోంది. తొలి వన్డేలో 88 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్ రెండో వన్డేలో మరింత రాణించేందుకు గట్టి పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లలో సత్తా చాటడం ద్వారా 2021లో నిర్వహించే ఐసీసీ మహిళ ప్రపంచ కప్‌లో స్థానం కోసం ఉవ్విళ్లూరుతోంది. తొలి వన్డేను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా గట్టి పట్టుదలతో ఆడడం ద్వారా జట్టులోని స్మృతి మంధానా 98 పరుగులు ఎదుర్కొని 84 పరుగులు చేయగా, కెప్టెన్ 45 పరుగులు చేసింది. జట్టులోని పేసర్ల ద్వయం జులాన్ గోస్వామి 24 పరుగులిచ్చి 4 వికెట్లు, శిఖా పాండే 23 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి అద్భుతాన్ని సృష్టించారు. ఈ ఇద్దరు పేసర్లతో పాటు లెగ్ బ్రేక్ బౌలర్ పూనమ్ యాదవ్ 22 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని 125 పరుగులకే చాపచుట్టేలా చేశారు. ఇప్పటికే దక్షిణాఫ్రికాపై 2-0 తేడాతో ఆధిక్యంలో ఉన్న మిథాలీ సేన రెండో మ్యాచ్‌పై గట్టి పట్టు సాధించేందుకు తహతహలాడుతోంది. ఇక దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ డేన్ వాన్ నైకెర్క్ ఒక్కరే 41 పరుగులు చేసింది.

మిగతా జట్టు సభ్యులెవరూ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో పరాజయాన్ని మూటకట్టుకున్నారు. రెండో వన్డే ఇరు జట్లకు ప్రతిష్టాత్మకం కావడంతో పోరు హోరాహోరీగా సాగనుంది.



న్యూఢిల్లీలో ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే రాజస్థాన్ క్రీడాకారులతో కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్

క్రీడా ప్రతిభకు పదును

జాతీయ, అంతర్జాతీయ క్రీడల విజేతలకు సత్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ, అంతర్జాతీయ క్రీడాంశాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) సత్కరించనుంది. రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రోత్సాహంతో పాటు వారికి సరైన శిక్షణ, నిష్ణాతులైన కోచ్‌లతో తర్ఫీదునివ్వడం కోసం ఎంతో కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అలీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం రానున్న బడ్జెట్‌లో ఆశించిన నిధులను రాబట్టేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నామన్నారు. గ్రామీణ స్థాయి నుండి అధిక సంఖ్యలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి విశేషంగా కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన అన్ని క్రీడా సంఘాలు, క్రీడాకారులు వివిధ టోర్నమెంట్‌లలో ఆయా క్రీడా సంఘాల తరఫున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగంలో పతకాలు సాధించిన వారికి ఈ అవకాశం దక్కుతుంది. 2017-18 విద్యా సంవత్సరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఈనెల 17వ



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అలీపురం వెంకటేశ్వర్‌రెడ్డి

తేదీన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా లాల్‌బహదూర్ స్టేడియంలో జరుగనున్న కార్యక్రమంలో ఘనంగా సత్కరించనున్నారు.

ఈ విషయంపై చైర్మన్ అలీపురం వెంకటేశ్వర్ రెడ్డి శాట్స్ అధికారులతో పాటు ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఓఎటీ) ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు తమ పూర్తి వివరాలను ఈనెల 8వ తేదీలోపు లాల్‌బహదూర్ స్టేడియంలోని శాట్స్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 17న నిర్వహించే కార్యక్రమంలో కోచ్‌లకు కిట్స్ పంపిణీ కార్యక్రమం కూడా ఉంటుందని, కార్యక్రమానికి రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి టి.పద్మారావు, రాష్ట్ర క్రీడల శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రభుత్వ సలహాదారు పాపారావు, శాట్స్ చైర్మన్ అలీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఓఎటీ) అధ్యక్ష, కార్యదర్శులు కె.రంగారావు, ఎస్ ఆర్.ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొంటారు. ఓఎటీ అనుబంధం కలిగిన క్రీడలకు సంబంధించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు మాత్రమే తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని శాట్స్ పేర్కొంది. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రూ.250 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేయాలని శాట్స్ చైర్మన్ కోరారు.

రాటుదేలితేనే అపార అవకాశాలు

❍ యువ క్రికెటర్లకు బౌలింగ్ కోచ్ పరస్ హేంబ్రే హితవు

ముంబయి, ఫిబ్రవరి 6: అనుభవం లేని యువ పేసర్లు ఫస్ట్‌క్లాస్ స్థాయి మ్యాచ్‌లలో రాటుదేలితే భవిషత్‌లో ఎదురయ్యే అనేక సవాళ్లను ఢీకొనగలరని భారత అండర్-19 టీమ్ జట్టు బౌలింగ్ కోచ్ పరస్ హేంబ్రే అన్నాడు. ఐసీసీ అండర్-19లో భారత్ యువసేన ప్రపంచ కప్‌ను కైవసం చేసుకునేందుకు పరోక్షంగా దోహదపడినవారిలో ఒకడైన హేంబ్రే యువ క్రికెటర్ల ఎదుగుదలకు ఎంతో కిందిస్థాయి నుంచే రాణించాలని అభిలషించాడు. అండర్-19లో ప్రపంచ కప్ సాధించిన యువసేనలో పేసర్లు చూపిన తెగువ ప్రశంసనీయమన్నాడు. సవాళ్లను ఎదుర్కొనేందుకు అటువంటి ఆటతీరు ఎంతో అవసరమన్నాడు. ఫస్ట్‌క్లాస్ లెవెల్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లలో బాగా రాణిస్తే భవిష్యత్ ఎంతో బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డాడు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, వాటిని ఒక సవాల్‌గా తీసుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చాడు.

ఎవరికీ తీసిపోని కెప్టెన్

❍ ఆయన నాయకత్వ పటిమ స్ఫూర్తిదాయకం
❍ విరాట్ కోహ్లీపై అశ్విన్ ప్రశంసలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ప్రపంచ క్రికెట్ కెప్టెన్లలో విరాట్ కోహ్లీ ఎవరికీ తీసిపోరని ఆయన నాయకత్వ పటిమ స్ఫూర్తిదాయకమని క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ అన్నాడు. కోహ్లీ బాడీ లాంగ్వేజ్ కూడా ఆయన దూకుడుకు, ఆట తీరుకు అద్దం పట్టేదిగానే ఉంటుందని ప్రశంసించాడు. అంతర్జాతీయ క్రికెట్ కెప్టెన్లయిన స్మిత్, రేజెన్నింగ్స్‌లు కోహ్లీపై విమర్శలు గుప్పించిన నేపథ్యంలో ఆయన తీరేవేరంటూ అశ్విన్ పొగడ్తలు కురిపించాడు. భారత జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా దక్షిణాఫ్రికా టూర్లో కోహ్లీ వ్యవహరించాడని పేర్కొన్న అశ్విన్ అత్యంత సమర్థనీయ రీతిలోనే ఆయన తన జట్టుకు సారధ్యం వహించాడని చెప్పాడు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని పూర్తిస్థాయి ప్రతిభాపాటవాలను కనబరిచి ఏ మ్యాచ్‌నైనా నెగ్గాలన్న స్ఫూర్తిదాయక పట్టుదలి విరాట్‌దని ఆయన తీరు నిరంతరం ప్రత్యర్థులకు దడ పుట్టించేదేనని అన్నాడు.

ప్రతి అంశంలోనూ సానుకూల ధోరణి కనబరచటం, ప్రతికూలంగా ఆలోచించకపోవడమే కోహ్లీ నాయకత్వానికి వన్నె తెచ్చేదని అశ్విన్ పేర్కొన్నాడు. ఆయన వ్యవహార శైలీ, ఆటతీరు, ప్రోత్సాహక ధోరణి..అన్నీ కూడా జట్టులోకి ప్రతి ఆటగాడికి పూర్తిస్థాయి సామర్థ్యంలో రాణించాలన్న ప్రేరణ కలిగించేదేనని అతడు తెలిపాడు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కూడా విరాట్ తాను అనుకున్నది సాధించాడని మరిన్ని వికెట్లు తీసుకోవాలన్న పట్టుదల చివరివరకూ అతడిలో కనిపించిందని అన్నాడు. ఆ టెస్ట్‌మ్యాచుల్లో తన ఆటతీరు గురించి మాట్లాడిన అశ్విన్‘ మొదటి రెండు టెస్టు మ్యాచ్‌లలో నేను బాగానే బ్యాటింగ్ చేశాను. అయితే అనంతర పరిస్థితుల్లో ఆడలేకపోయాను. మొత్తమ్మీద నేను కౌంటర్ అటాక్ చేయాల్సి వచ్చింది. అందులోనూ సంతృప్తికరంగానే రాణించాను’అని అశ్విన్ అన్నాడు. అయితే తన ఆటతీరుకు సంబంధించినంత వరకూ ఎవరికీ ఎలాంటి నిరుత్సాహం కలగకుండా తాను అనుకున్నది సాధించగలిగినట్టు యువ క్రికెటర్ పేర్కొన్నాడు. అయితే అనుకున్న స్థాయిలో వికెట్లు తీసుకోలేకపోవడం, క్యాచ్‌లను మిస్ చేయడం జరిగినా తన ఆటతీరు తనకు సంతృప్తిని ఇచ్చిందని అన్నాడు. అంతిమ ఫలితం దక్షిణాఫ్రికాకు అనుకూలంగానే వచ్చినా భారత్ జట్టు చివరివరకూ గట్టిపోటీని ఇవ్వగలిగిందన్నాడు. అటు కేప్‌టౌన్‌లోనూ ఇటు సెంచూరియన్‌లో కూడా చివరి బంతి వరకూ భారత జట్టు గట్టిపోటీనే కనబరిచిందని తెలిపాడు. అయితే ఆ రెండు టెస్టు మ్యాచ్‌లలో భారత్ టాస్ గెలిచిఉంటే



ఫలితం మరోలా ఉండేదని పేర్కొన్న అశ్విన్‘ఓ జట్టుగా భారత ఆటగాళ్లు స్ఫూర్తిదాయకమైన రీతిలోనే రాణించారు. ఈ రకమైన ఆట తీరు ఇంగ్లాడ్ సిరీస్‌లో మరింతగా రాణించడానికి సరికొత్త స్ఫూర్తినే ఇస్తుంది’అని తెలిపాడు. జొహెన్నెస్‌బర్గ్‌లో జరిగిన చివరి టెస్ట్‌లో టీమిండియా ఆటతీరు అద్భుతమని ఆ మ్యాచ్‌లో గెలుపుతథ్యమన్న రీతిలోనే భారత్ ముందుకు సాగిందని ఆఫ్ స్పిన్నర్ తెలిపాడు.

కోహ్లీ వైఖరి మారడానికి ఓ మంచి మెంటర్ కావాలి

❍ దక్షిణాఫ్రికా మాజీ కోచ్ రే జెన్నింగ్స్

సెంచూరియన్, ఫిబ్రవరి 6: డ్రెస్సింగ్ రూమ్‌లో సహచరులను భయపెడుతూ ఆటపట్టించే భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీని మరింత పరిపూర్ణంగా తీర్చిదిద్దే వ్యక్తి అవసరం ఉందని దక్షిణాఫ్రికా మాజీ కోచ్ రే జెన్నింగ్స్ అన్నాడు. కోహ్లీ అండర్-19లో ఆడినప్పటి నుంచి ప్రత్యక్షంగా స్వయంగా చూస్తూ వచ్చిన జెన్నింగ్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కోచ్‌గా వ్యవహరించడంతో కోహ్లీలో ఎన్నో అంశాలను గమనించాడు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని నుంచి ఇప్పటి కెప్టెన్ కోహ్లీ వరకు చూస్తే భారత క్రికెట్‌లో చాలా మార్పులు గమనించవచ్చునని అన్నాడు. మహేంద్ర సింగ్ ధోని నెమ్మదస్తుడు కాగా, కోహ్లీ అందుకు విరుద్ధమన్నాడు. ఎంతో కాలం నుంచి కోహ్లీని ప్రత్యక్షంగా చూస్తున్నందున డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లే యువ ఆటగాళ్లకు అతనంటే చాలా భయమని, ఆ సమయంలో వారిని అనునయించేందుకు మెంటర్ అవసరం ఉంటుందని అన్నాడు. యువకుడైన కోహ్లీ మిగతా క్రికెటర్లకు భిన్నంగా వ్యవహరిస్తున్నా అది కొంత సమయం వరకేనని, ఆ తర్వాత అతనే నెమ్మదిస్తాడని అన్నాడు.

సెక్యూరిటీ గార్డులకు అంటువ్యాధుల ముప్పు

❍ వింటర్ ఒలింపిక్స్ విధుల నుండి తప్పుకున్న 1200 మంది

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 6: దక్షిణ కొరియాలోని పయాంగ్‌చాంగ్ లో శుక్రవారం నుండి ఆరంభమయ్యే వింటర్ ఒలింపిక్స్‌కు అంతా సిద్ధమైందని చెపుకుంటున్న అంటువ్యాధులు ఒకపక్క, మరోపక్క ఎముకలు కొరికే చలే నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తాజాగా ఇక్కడ నోరో వైరాస్ పట్టిపీడిస్తోంది. దీంతో దాదాపు 1200 మంది సెక్యూరిటీ సిబ్బంది విధుల నుండి తప్పుకున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించిన వారిలో 41 మంది గత ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. చలి అధికంగా ఉండటంతో నోరో వైరస్ మరింత వ్యాప్తి చెంది ఆహారం, నీటిలో కలవడంతో సెక్యూరిటీ సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. వింటర్ ఒలింపిక్స్ కమిటీ వెంటనే 900 మంది మిలటరీ సైనికులను రంగంలోకి దింపింది. ఈ నోరోవైరస్‌కు సంబంధించి పూర్తి విచారణ చేపట్టాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. సెక్యూరిటీ కంపెనీకి చెందిన గార్డ్సను, ఉద్యోగులను పయాంగ్‌చాంగ్‌లోని అథ్లెట్స్ విలేజ్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. చలి అధిగకంగా ఉండటంతో వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఒలింపిక్ నిర్వాహకులు ఆరోగ్య శాఖాధికారులను కోరింది.

9 నుంచి ఫెడరేషన్ కబడ్డీ

ముంబయి, ఫిబ్రవరి 6: ఈ నెల తొమ్మిది నుంచి ఫెడరేషన్ కప్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. పురుషులు, మహిళల విభాగాల్లో, వేర్వేరు కబడ్డీ కోర్టులపై ఈ పోటీలు జరుగుతాయని ముంబయి ఉపానగర్ కబడ్డీ సంఘటన్ తెలిపింది. మహిళల విభాగంలో హిమాచల్ ప్రదేశ్, కేరళ, పంజాబ్, హర్యానా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర జట్లు తలపడతాయి. పురుషుల విభాగంలో ఈ రాష్ట్రాలతోటు సర్వీసెస్, ఉత్తరప్రదేశ్, ఇండియన్ రైల్వేస్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ జట్లు కూడా ఢీకొంటాయి. ప్రో కబడ్డీ ద్వారా స్టార్ ఇమేజ్‌ను దక్కించుకున్న అనూప్ కుమార్, మన్జిత్ చిల్లార్, సురేంద్ర నాడా, దీపక్ హుడా, వజీర్ సింగ్, వికాస్ దహియా, మోహిత్ చిల్లార్, రాజేష్ మోండల్, ప్రదీప్ నర్వాల్ తదితరులు ఈ టోర్నమెంట్‌లో బరిలోకి దిగుతారు.

సింగిల్స్, డబుల్స్‌లో
రాణించిన సింధు

❍ ఆసియా టీమ్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్

ఆలోర్ సెటార్(మలేసియా), ఫిబ్రవరి 6: ఒలింపిక్ రజత పతకం విజేత, స్టార్ పీవీ సింధు ఆసియా టీమ్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ సింగిల్స్, డబుల్స్‌లో అద్భుతంగా రాణించింది. టీమ్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో 3-2 తేడాతో హాంకాంగ్‌పై విజయం సాధించింది. ముందుగా జరిగిన సింగిల్స్‌లో సింధు 21-12, 21-18 స్కోరు తేడాతో హాంకాంగ్‌కు చెందిన యిప్ పూ ఇన్‌పై విజయం సాధించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. మహిళల డబుల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప, ప్రజక్తల జోడీ 22-20, 20-22, 10-21తో వింగ్ యుంగ్, టింగ్ చేతిలో ఓటమి పాలైంది. ఆ తర్వాత జరిగిన మరో మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో శ్రీ కృష్ణప్రియ కూడా 19-21, 21-18, 20-22 చియింగ్‌హేయిన్‌మేయి చేతిలో ఓటమి పాలైంది. దీంతో భారత్ 1-2 తేడాతో వెనుకబడింది. మరో మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డితో జట్టుకట్టిన సింధు 21-15, 15-21, 21-14 విజయం సాధించింది. ఇక చివరిదైన మరో మహిళల సింగిల్స్ మ్యాచ్‌పైనే అందరి దృష్టి మళ్లింది. హోరా హోరీగా సాగిన మూడు సెట్ల పోరులో భారత క్రీడాకారిణి రుత్విక గద్దె 16-21, 21-16, 21-13తో విజయం సాధించింది. దీంతో భారత్‌కు 3-2 ఆధిక్యత లభించింది. ఇక టోర్నమెంట్‌లో భాగంగా గురువారం భారత జట్టు జపాన్‌తో తలపడనుంది. యమగూచి, ఒకుహారాతో సింధు సేన తలపడనుంది. ఈ టోర్నీని మే 20 జరుగనున్న ప్రతిష్టాత్మక థామస్ అండ్ ఉబెర్ కప్‌కు క్వాలిఫయర్‌గా పరిగణిస్తారు.



మంగళవారం పార్లమెంటు భవనం ఎదుట తమ తమ డిమాండ్లపై నినాదాలిస్తూ నిరసన తెలుపుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు

ఇటు నిరసనలు.. అటు చర్చలు

ఏదో ఒక ప్రకటన చేయాలని పట్టుబట్టిన తెలుగుదేశం ఎంపీలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఎన్డీయే ప్రభుత్వంతో ప్రకటన చేయించుకునేందుకు టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి సుజనా చౌదరి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తెర వెనక చర్చలు జరిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, రైల్వే మంత్రి పియూష్ గోయల్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. సుజనా చౌదరి, రమేష్ చివరకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కూడా మంత్రులతో చర్చలు జరపడం గమనార్హం. సుజనా చౌదరి మంగళవారం ఉదయం ప్రధాని మోదీని పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో కలుసుకుని 30 నిమిషాల పాటు చర్చలు జరిపారు. 'రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అయితే మంగళవారం ఏదో ఒక ప్రకటన చేయాలి, రైల్వే జోన్‌ను ప్రకటించాలి, ఆర్థిక సహాయం ప్రకటించాలంటే సాధ్యం కాదు' అని మోదీ స్పష్టం చేశారని అంటున్నారు. అలాగే టీడీపీ సభ్యులు ఉభయ సభల్లో కొనసాగిస్తున్న నిరసనకు తెర దించాలని కూడా ప్రధాని సూచించినట్లు తెలిసింది. మోదీతో జరిపిన చర్చల సారాంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ప్రభుత్వం ఏదో ఒక ప్రకటన చేయకపోతే నిరసన విరమించడం సాధ్యంకాదని సీఎం చెప్పడంతో మరోసారి సుజనా చౌదరి ఎన్డీయే మంత్రులతో చర్చల ప్రక్రియ ప్రారంభించారు. ఆయన లోక్‌సభలోనే రాజ్‌నాథ్ సింగ్‌తో మూడుసార్లు చర్చలు జరిపారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ ప్రధాని మోదీ వద్దకు వెళ్లి వచ్చారు. అదే సమయంలో సుజనా చౌదరి లోక్‌సభలోనే బీజేపీ సీనియర్ నేత అద్వానీనిని కలిసి పరిస్థితి వివరించారు. ఆ తరువాత మంత్రులు అనంతకుమార్, అరుణ్ జైట్లీతో సంప్రదింపులు జరిపారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసే అంశంపై సుజనా చౌదరి, సీఎం రమేష్ ఇద్దరూ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో సంప్రదింపులు జరిపారు. ఉదయం ప్రారంభమైన ఈ చర్చల ప్రక్రియ సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఒక కొలిక్కి వచ్చింది. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో జైట్లీ రాజ్యసభలో ఏపీకి నాబార్డ్ ద్వారా రాయితీ నిధుల కేటాయింపునకు సంబంధించిన వివరణ ఇస్తే పియూష్ గోయల్ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసే అంశంపై ఓ వివరణ ఇచ్చారు. అరుణ్ జైట్లీ సాయంత్రం లోక్‌సభలో ఇదే ప్రకటన చేయటం గమనార్హం.

టీడీపీ సభ్యుల అసంతృప్తి

హామీల అమలుపై అరుణ్‌జైట్లీ తూతూమంత్రంగా హామీ ఇవ్వగానే లోక్‌సభలో నిరసన విరమించుకోవలసి రావడంపై పలువురు తెలుగుదేశం సభ్యులు అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. జైట్లీ ప్రకటన చేయగానే లోక్‌సభలోనే ఉన్న మంత్రి సుజనా చౌదరి సభ్యులను తమ సీట్లలోకి వెళ్లాలని సూచించారు. అయితే కొందరు ఎంపీలు తమ సీట్లలోకి వెళ్లకుండా పోడియం వద్దనే నిలబడిపోయారు. ఆర్థిక మంత్రి వివరణ ఎంత మాత్రం రుచించలేదనేది వారి ముఖాల్లో స్పష్టంగా కనిపించింది. పోడియం వద్దే నిలబడిపోయిన టీడీపీ ఎంపీలను మొదట సుజనా చౌదరి, ఆ తరువాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ వారి నచ్చజెప్పి వారివారి సీట్లలోకి పంపించారు. సుజనా ఆ తరువాత టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించినప్పుడు కూడా పలువురు ఎంపీలు తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. పోలవరం ప్రాజెక్టు నిధులు, రైల్వే జోన్ గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకున్నా లోక్‌సభలో నిరసన విరమించుకోవటం విచిత్రంగా ఉందని వారు వ్యాఖ్యానించారు.

కంటితుడుపు చందమే

జైట్లీ ప్రకటనపై వైఎస్సాఆర్‌సీపీ అసంతృప్తి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సాఆర్‌సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై మంగళవారం పార్లమెంట్ అవరణలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, వరప్రసాద్, విజయసాయిరెడ్డి ముందుగా ప్లకార్డ్‌లతో నిరసన తెలిపారు. లోక్‌సభలో పోడియం వద్ద ప్లకార్డుల ప్రదర్శిస్తూ, నినాదాలిస్తూ సాయంత్రం వరకూ నిరసన తెలిపారు. అరుణ్ జైట్లీ ప్రకటన చేసిన అనంతరం టీడీపీ ఎంపీలు నిరసన విరమించినప్పటికీ, వైఎస్సార్‌సీపీ ఎంపీలు మాత్రం అలాగే నిరసన కొనసాగించారు.



మంగళవారం పార్లమెంటు వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

మిథన్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టం హామీలైన పోలవరం నిర్మాణానికి నిధులు, ప్రత్యేక రైల్వే జోన్, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, దుగరాజపట్నం పోర్టు తదితర హామీలు ఇంతవరకు అమలు కాలేదని కేంద్రాన్ని నిలదీశారు. బెంగళూర్ మెట్రో రైల్‌కోసం నిధులు ఇచ్చారని, ఏపీకి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఏపీకి జరుగుతున్న అన్యాయం విషయంలో టీడీపీ-బీజేపీ బాధ్యత తీసుకోవాలని అన్నారు. అనంతరం లోక్‌సభలో నుంచి వాకౌట్ చేశారు.

ప్రత్యేక హోదా ఇవ్వండి: విజయసాయి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి రాజ్యసభలో డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని అప్పటి ప్రభుత్వం, ప్రధాని మన్మోహన్ సింగ్ హామీ ఇచ్చారని, ఇదే రాజ్యసభలో ఒప్పుకుంటూ ప్రకటన చేశారని విజయసాయిరెడ్డి గుర్తుచేశారు.

మీ వల్లే ఏపీకి ఈ గతి

రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాడుతుంటే అభ్యంతరం తెలుపుతారా?

లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులపై దుమ్మెత్తిపోసిన టీడీపీ ఎంపీలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకోసం తాము లోక్‌సభలో పోరాడుతుంటే మీరు అభ్యంతరం తెలుపుతారా? అంటూ తెలుగుదేశం సభ్యులు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ, ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఇతర కాంగ్రెస్ సభ్యులపై దుమ్మెత్తిపోశారు. మీవల్లనే రాష్ట్రం ఆథోగతి పాలైందంటూ వారు తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. బీజేపీ మిత్రపక్షమైన మీరు మావైపు నిలబడి నిరసన ఎందుకు తెలుపుతున్నారు, అధికార పక్షం వైపు నిలబడవచ్చు కదా అని ప్రశ్నించిన కాంగ్రెస్ సభ్యులతో తెలుగుదేశం సభ్యులు గొడవపడ్డారు. మీవల్లే ఏపీకి ఈ గతి పట్టిందంటూ గల్లా జయదేవ్, కేశినేని నాని, కింజారపు రామమోహన్ నాయుడు, శ్రీరాం మల్యాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో వారు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీతో వాదనకు దిగారు. పరిస్థితిని అర్థం చేసుకున్న సోనియా వారికి నచ్చజెప్పేందుకు తీవ్రంగా కృషి చేయవలసి వచ్చింది. రాష్ట్రంలో మీకు సున్నా ఎదురైనా బుద్ధి రాలేదా అంటూ గల్లా జయదేవ్ కాంగ్రెస్ సభ్యుడు వేణుగోపాల్‌పై మండిపడ్డారు. మల్యాద్రి, రామమోహన్ నాయుడు నేరుగా సోనియా గాంధీతో వాదనకు దిగారు. ఏపీకి అన్యాయం జరుగుతుంటే సహించి ఊరుకోవాలా? అంటూ వారు ప్రశ్నించారు. పోడియం వద్ద నిలబడి నిరసన తెలపటం మా హక్కు, మీరు దీనిని కాదన లేరంటూ వారు సోనియా గాంధీ, ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గేతో వాదనకు దిగారు. దీనితో కాంగ్రెస్ సభ్యులు జ్యోతిరాదిత్య సింధియా, హుడ్డాతోపాటు మరో ఐదారుగురు కాంగ్రెస్ సభ్యుల ముందుకు వచ్చి తెలుగుదేశం సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కేశినేని నాని సీపీఎం సభ్యుడు సలీంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మా రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే మీరిలా మాట్లాడుతారా? అంటూ నిలదీశారు. మాట్లాడకుండా మీ సీట్లో కూర్చోండి అంటూ మండిపడ్డారు. తెలుగుదేశం సభ్యులు మంగళవారం ఉదయం పదకొండు గంటల నుండి పోడియం వద్ద ప్రతిపక్షం వైపు నిలబడి ఏపీకి న్యాయం చేయాలి, పోలవరం నిర్మించాలి, రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి, అమరావతికి నిధులివ్వాలి, బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలిచ్చారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించేందుకు లేచినప్పుడు కూడా ఇరుపక్షాల మధ్య గొడవ జరిగింది. తన ప్రసంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ఒక పథకం ప్రకారం తెలుగుదేశం సభ్యులతో సభలో గొడవ చేయిస్తోందని ఖర్గే ఆరోపించారు. ఆ తరువాత కాంగ్రెస్ సభ్యుడు వేణుగోపాల్ లేచి బీజేపీ మిత్రపక్షమైన తెలుగుదేశం సభ్యులు పోడియం వద్ద ప్రతిపక్షం వైపు నిలబడకుండా అధికార పక్షం వైపు నిలబడి నిరసన తెలపాలని సూచించారు. మీరిలా నా నాయకుడికి అడ్డంగా నిలబడటం మంచిది కాదని ఆయన చెప్పారు. దీనికి తెలుగుదేశం సభ్యుల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీ వల్లనే మాకీ గతి పట్టింది, మేము ఇక్కడ నిలబడే నిరసన తెలుపుతాం, ఇది మా హక్కు అంటూ నినాదాల జోరు పెంచారు. పలువురు తెలుగుదేశం సభ్యులు కాంగ్రెస్ సభ్యుల సీట్ల వైపు వెళ్లి వాదనకు దిగారు. ఇంతలో కాంగ్రెస్ చీఫ్‌విప్ జ్యోతిరాధిత్య సింధియా లేచి తెలుగుదేశం సభ్యులు ప్రస్తావిస్తున్న అంశాలకు సభలో ఉన్న ప్రధాని మోదీ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం సభ్యుల ఇంత గొడవ చేస్తుంటే నరేంద్ర మోదీ ఎందుకు జోక్యం చేసుకోవటం లేదు, సమస్యను పరిష్కరించేందుకు ఎందుకు ప్రయత్నించటం లేదని ఆయన నిలదీశారు. అయితే మోదీ మాత్రం స్పందించలేదు. విభజన హామీల అమలుకోసం సభలో నిరసన తెలుపుతున్న తెలుగుదేశం సభ్యులను అడ్డుకుంటే ఏపీలో కాంగ్రెస్‌కు రాజకీయంగా నష్టం కలుగుతుందని గ్రహించిన సోనియా వెంటనే జోక్యం చేసుకుని కాంగ్రెస్ సభ్యులను వారించటంతోపాటు తెలుగుదేశం సభ్యులకు స్వయంగా శాంతపరిచేందుకు ప్రయత్నించారు. పోడియం వద్ద నిరసన తెలపటం మా హక్కు, దీనిని ఎవ్వరూ కాదనలేరని శివప్రసాద్, అవంతి శ్రీనివాస్ ఆవేశంతో అన్నారు. మల్లికార్జున ఖర్గే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగించినంత సేపు తెలుగుదేశం సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ఇస్తూనే ఉన్నారు.



చిడతలు పట్టిన శివప్రసాద్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను అమలు చేయాలని, బడ్జెట్ కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం చేసిన ఆందోళనలో ఎంపీ శివప్రసాద్ వినూత్నంగా చిడతలు పట్టి భజన చేస్తూ నిరసన తెలిపారు. ముందుగా పార్లమెంట్ అవరణలో గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మిత్ర ధర్మాన్ని కాపాడి ఆంధ్రప్రదేశ్‌ను అదుకోవాలని అన్నారు. అనంతరం లోక్‌సభలో ఎంపీలు పోడియం వద్దకు వచ్చి తమ నిరసన తెలపడంతోపాటు పెద్దఎత్తున నినాదాలు కూడా చేశారు. ఈ సందర్భంలో శివప్రసాద్ చిడతలు వాయిస్తూ పాటలు పాడటం మొదలుపెట్టారు. దీంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి సభలో చేయడం సరైనది కాదని హెచ్చరించారు. స్పీకర్ ఎన్ని హెచ్చరికలు చేసిన చిడతలు వాయిస్తూ గోవిందా... గోవిందా... హరా..హరా అంటూ పాటలు పాడారు. ఆ సమయంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సభలోనే ఉన్నారు.

అది ద్రవ్యబిల్లు

కేవీపీ ప్రైవేటు మెంబర్ బిల్లును తిప్పిపంపిన రాజ్యసభ సచివాలయం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ఎగువసభకు సమర్పించిన ప్రైవేటు మెంబర్ బిల్లును ద్రవ్యబిల్లుగా పేర్కొంటూ రాజ్యసభ సచివాలయం తిప్పిపంపింది. గత ఏడాది నవంబరు నెలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వల్ల 2015-20 మధ్యకాలంలో అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్ర-రాష్ట్రాల మధ్య వాటాల నిష్పత్తి 90:10 ఉండాలని, కేంద్రం వాటా 90 శాతం ప్రతి ఆర్థిక సంవత్సరం చివరిలో రాష్ట్రానికి అందజేయాల్సి వుంటుందని ఆ ప్రైవేటు మెంబరు బిల్లులో పేర్కొన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రారంభించే అన్ని పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలతోపాటు, పన్ను మినహాయింపులు ఇవ్వాలని కోరుతూ రాజ్యసభకు కేవీపీ ప్రైవేటు మెంబరు సమర్పించారు. అయితే ఈ ప్రైవేటు మెంబరు బిల్లు రాజ్యాంగపు ఆర్టికల్ 110 ప్రకారం ద్రవ్య బిల్లు అవుతుంది కావున ఎగువసభలో ప్రవేశపెట్టడానికి రాజ్యసభ సచివాలయం నిరాకరించింది.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టీఆర్ఎస్ ఎంపీలు

రోడ్ల విస్తరణకు సహకరించండి

కేంద్ర మంత్రిని కోరిన తెలంగాణ ఎంపీలు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల విస్తరణకు సహకరించాలని, నీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టీఆర్ఎస్ ఎంపీలు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర రవాణా, జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌లతో రాష్ట్ర రోడ్లు భవనాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్ కుమార్, బూర నర్సయ్యగౌడ్ కలిశారు. అనంతరం తుమ్మల విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలో రహదారుల అభివృద్ధి, విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి గడ్కరీకి వివరించినట్టు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటయ్యాయని, అందువల్ల రహదారు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్టు చెప్పారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు, పాలమూరు ఎత్తిపోతల పథకానికి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రిని కోరినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణాలకు అనుమతుల మంజూరును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

గొలుసుకట్టు చెరువులకు పూర్వవైభవం

వలసల జిల్లాలో కృష్ణమ్మ గలగలలు ◆ మిషన్ కాకతీయతో పాలమూరులో హరితవిప్లవం ◆ తెలంగాణలో నిండుకుండలా బోరు బావులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 6: దాదాపు మూడు దశాబ్దాల తర్వాత సముద్రం పొంగి పొర్లింది. పెద్ద చెరువులను తెలంగాణ ప్రజలు సముద్రంగా పిలుచుకునే ఆనవాయితీ ఉంది. వనపర్తి జిల్లా గణప సముద్రం పొంగి పొర్లుతోంది. ఈ చెరవు మిగతా చెరువుల మాదిరి పొంగితే వింత కాదు, కానీ వందేళ్లలో మూడోసారి మత్తడి దుంకడమే గణపసముద్రం విశేషం. ఫిబ్రవరిలో ఎండాకాలం ముఖద్వారం దగ్గర ఈ అద్భుతం ఆవిష్కృతమైంది.

ఘనపురం మండలం కరువు దుర్భిక్షానికి వలసలకు పేరు. సప్త సముద్రాలున్నా చుక్క నీటిబొట్టుకు ఘనపురం అల్లాడిపోయింది. గత పాలకవర్గాల నిర్లక్ష్యం అలసత్వం వల్ల గణ సముద్రం పూర్తిగా పూడుకుపోయింది. కల్వకుర్తి ప్రాజెక్టు నుండి మొదటిసారి ఘనపురం బ్రాంచి కెనాల్‌కు సాగునీటిని విడుదల చేయడంతో గణపసముద్రం అలుగుపారుతోంది. మిషన్ కాకతీయ రెండో దశ కింద గణపసముద్రం ఫీడర్ చానల్ మరమ్మతులు చేపట్టి పూడిక తొలగించి దానిని పునరుద్ధరించడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. కరెంట్ మోటార్లు లేకుండానే కృష్ణా జలాలు పొలాల్లో ప్రవహిస్తున్నాయి. చాలాకాలం తర్వాత నీటి కోసం చూసి చూసి కళ్లు కాయలు కాసిన తర్వాత రైతుల కళ్ల నుండి ఆనందభాష్పాలు రాలాయి. గణపసముద్రం మత్తడి దుంకడం అనే విషయం రైతులు కలలో కూడా ఊహించనిదని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు సంగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పనులను వేగంగా పూర్తి చేయడానికి రేయింబవళ్లు కృషి చేస్తూ గణపురం బ్రాంచి కెనాల్‌కు నీటి విడుదలపై చొరవ తీసుకున్న నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు చొరవతోనే ఇది సాధ్యమైందని అన్నారు.



గణపసముద్రం చెరువు నిండటంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలసంపద కూడా అనూహ్యంగా పెరిగింది. దీంతో గణపసముద్రం పరిసరాల్లో పాతాళగంగ ఉబికి వస్తోంది. దాదాపు 200 బోర్లు రీఛార్జి అయ్యాయి. 10 మీటర్లు తవ్వకుండానే భూగర్భ జలసంపద లభిస్తోంది.

వనపర్తి నియోజకవర్గంలో 2016-17లో 74 చెరువులను కాకతీయ మొదటి దశ కింద చేపట్టిన కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా నింపి 12,399 ఎకరాలకు సాగునీరు అందించారు. 2017-18లో 246 చెరువులను మిషన్ కాకతీయ కింద చేపట్టి 22,539 ఎకరాలకు సాగునీరు అందించారు. మిషన్ కాకతీయ కారణంగానే చెరువులు నింపడం, చెరువులు నిండిన కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జల సంపద పెరగతడంతో ఘనపురం మండలం రైతాంగం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వనపర్తిలోని రంగ సముద్రం, గోపాల సముద్రం, శంకరమ్మ సముద్రం, మహాబూపాల సముద్రం, రాయసముద్రం, కృష్ణ సముద్రం, వీరసముద్రం వంటి ఏడు సముద్రాలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 10వేల ఎకరాలకు సాగు నీరు అందేది. 600 ఎకరాలకు నీరు అందేలా కృష్ణ సముద్రం చెరువును నిర్మించారు. కొత్తకోటలో ఉన్న ఈ చెరువును బీమాలో చేర్చారు. బీమా నుండి వచ్చే నీటిని ముందుగా శంకరసముద్రంలో నింపి తర్వాత కృష్ణ సముద్రాన్ని నింపుతారు. దీంతో సంకిరెడ్డిపల్లి రాయనిపేట గ్రామాలతోపాటు 10 గ్రామాలకు తాగు, సాగు నీరందుతుంది. సప్తసముద్రాల్లో మరొకటి రంగసముద్రం. ఇది పెబ్బేరు మండలంలోని శ్రీరంగాపురంలో ఉంది. దీని ఆయకట్టు దాదాపు 3వేల ఎకరాలు. వనపర్తి సంస్థానాదీశుల కాలంలో కొల్లాపూర్ సురభి వంశస్తులు దానిని నిర్మించారు. కాగా ఈ చెరువు బీమాకు లింకు చేయడంతో 20వేల ఎకరాలకు సాగు నీరు, 15 గ్రామాలకు తాగునీరు అందుతోంది. కొత్తకోట మండలం లోని కానాయపల్లి దగ్గర ఉండే శంకరసముద్రాన్ని 160 ఏళ్ల కిందట శంకరమ్మ పాలనలో నిర్మించారు. ఈ చెరువు కింద 2700 ఎకరాల ఆయకట్టు ఉంది. దానిని గతంలో జలయజ్ఞంలో భాగంగా బీమా ద్వారా నీరందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పనులు పూర్తయితే దాదాపు 40వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ మూడు చెరువులు మినహాయిస్తే మిగతా నాలుగు సముద్రాలు వాటి ఉనికిని కోల్పోతున్నాయి. వీరసముద్రం, రాయసముద్రం, మహబూపాల్ సముద్రం, గోపాల్ సముద్రాలు అంతరించిపోయే స్థితిలో ఉన్నాయి.

రాయసముద్రాన్ని వనపర్తి సంస్థానాదీశుల కాలంలో నిర్మించారు. దీనిద్వారా 12వందల ఎకరాలకు నీరు అందేది. మహబూపాల్ సముద్రం చెరువును వనపర్తి రాజు రాజారామేశ్వరరావు వంశీయులు నిర్మించారు. గతంలో 400 ఎకరాలకు నీరు అందేది. ప్రస్తుతం జూరాల నీటితో చెరువును నింపుతున్నారు. ఈ చెరువును పూర్తిస్థాయిలో నింపితే దాదాపు 10వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. పెబ్బేరు మండలంలో వీర సముద్రం చెరువు ఉంది. ఈ చెరువు గతంలో వెయ్యి ఎకరాలకు నీరు అందించేది. పెద్దమందడిలో ఉండే గోపాలసముద్రం వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించేది. ఇపుడు కాల్వలు పూడుకుపోయి శిఖం అన్యాక్రాంతం అయ్యింది.

పంటపొలాలు బీళ్లుగా మారకుండా ఒక ఊరి చెరువు కాపాడుతుంది. ఒక ఊరి చెరువు నుండి మరో ఊరి చెరవుకు నీరు ప్రవహించే గొలుసుకట్టు చెరువుల నిర్మాణం తెలంగాణలో అనాదిగా ఉన్న వ్యవస్థ. ప్రత్యేక రాష్ట్ర సాధన జరుగుతున్న క్రమంలోనే నేటి ఉద్యమ నేత కెసిఆర్ తెలంగాణకు మణిహారమైన గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి పరచాలని తలపెట్టారు. నీటిపారుదల మంత్రి క్రమపద్ధతిలో ఒక్కొక్క చెరవుకు ప్రాణం పోస్తూ నడ్డివిరిగిపోయిన తెలంగాణ నీటిపారుదల రంగాన్ని గాడిలో పెడుతున్నారు. ఏడాదికి 25 శాతం చెరువుల చొప్పున కాకతీయ కింద అభివృద్ధి పరుస్తూ నాలుగేళ్లలో మొత్తం చెరువులకు పూర్వవైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఈ సప్తసముద్రాలకు మహర్దశ వచ్చిందని రైతులు సంబరపడుతున్నారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90



అగ్ని-6 మిస్సైల్‌ను విజయవంతంగా ప్రయోగించటంలోప్రధాన పాత్ర పోషించిన కేరళకు చెందిన టెస్సీ థామస్ మిస్సైల్ ప్రాజెక్టులో భాగస్వామ్యమైన తొలి మహిళా సైంటిస్ట్‌గా చెప్పవచ్చు.

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే


ఆంధ్రభూమి

బుధవారం 7, ఫిబ్రవరి 2018

దుస్తులు చెప్పే దారుణాలు!

లైంగిక వేధింపులపై అవగాహన

మ్యూజియం ఏర్పాటుతో సామాజిక సేవ





అది బెంగళూరులోని ఓ చిన్న గది. ఆ గదిలోనికి వెళితే వందల్లో దుస్తులు కనిపిస్తాయి. యువతులు, మహిళలు, పిల్లలు ధరించిన దుస్తులే. ఒక్కొక్క డ్రెస్స్ వెనుక ఒక్కొక్క కథ దాగివుంది. ఈ దుస్తులను సేకరిస్తుంది బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త జాస్మిన్ పతేజా. దేశంలో విచ్చలవిడిగా జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులకు వస్త్రాధారణే కారణం అని విమర్శలు వస్తున్న నేపథ్యంలో అత్యాచారానికి గురికావటానికి, వారు ధరించిన దుస్తులతో ఎలాంటి సంబంధం లేదని నిరూపించేందుకు నడుం బిగించారు జాస్మిన్ పతేజా. ఈ నిజాన్ని ప్రపంచానికి చాటేందుకు ఆమె ఓ మ్యూజియం ఏర్పాటుచేసి అత్యాచారం లేదా లైంగిక వేధింపులకు గురైన బాధితుల దుస్తులను సేకరించి అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. జాస్మిన్ పతేజా చేస్తున్న సామాజిక సేవకు పలువురి నుంచి మంచి స్పందన సైతం లభిస్తోంది. ఈ దుస్తులను చూస్తుంటే జరిగిన దారుణానికి, దుస్తులకు ఎలాంటి సంబంధం లేదని ఆ మ్యూజియంను సందర్శించినవారికి అవగతమవుతోంది.

ఎరుపు,బ్లాక్ రంగుల్లో ఉన్న జంప్‌సూట్ దుస్తులు ఓ యువతివి. ఆమె నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని వస్తుండగా లైంగిక వేధింపులకు గురైంది. ఆరోజు అందరు ఆడపిల్లల వలే సింపుల్‌గా ఉండే దుస్తులే ధరించింది. క్రీమ్ కలర్ కుర్తా, ఎరుపు, నలుపు ప్రింట్స్ ఉన్న దుస్తులు వేసుకుంది. సంప్రదాయ దుస్తులు వేసుకున్నా ఆ ముష్కరులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలైన ఆ యువతి ఓ రోజు కొయంబత్తూర్‌కి రైలులో వెళుతుండగా.. ఆ ప్రయాణంలో ఓ మహిళ పరిచయం అయింది. ఆ కొద్ది గంటల వ్యవధి పరిచయంతోనే వారు మంచి స్నేహితులుగా మారిపోయారు. ఆమె ఆ యువతికి ఈ డ్రెస్సును ప్రెజెంట్ చేసింది. అలాంటి డ్రెస్సులో నూతన సంవత్సర వేడుకలకు వెళ్లి వస్తూ లైంగిక వేధింపులకు గురైంది. మరొక పింక్ డ్రెస్స్ చూపిస్తూ.. ఈ దుస్తులు వేసుకున్న బాధితురాలు ఈ డ్రెస్సును తనకు అందజేస్తూ.. "ఈ డ్రెస్సును తీసుకుపోండి. వీటిని చూస్తుంటే విపరీతమైన బాధకు గురవుతున్నాను. ఒక్కొక్కసారి అనారోగ్యానికి సైతం గురవుతున్నానని" ఆవేదన వెళ్లబుచ్చింది. అలాగే వైట్ డ్రెస్స్, స్విమ్‌సూట్, తొమ్మిదేళ్ల చిన్నారి గౌను, స్కూలు యూనిఫాం కూడా ఉన్నాయి. వీటి వెనుక దాగి ఉన్న దారుణ సంఘటనలు వింటుంటే.. అసలు దుస్తులకు, ఈ దారుణానికి ఎలాంటి సంబంధం లేదని చూసేవారికి అర్థమవుతోంది.

పదిహేనళ్ల నుంచి పోరాటం..

అత్యాచారాలు, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గత పదిహేను సంవత్సరాల నుంచి ఆమె పోరాటం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే 'ఐ నెవర్ ఆస్క్ ఫర్ ఇట్' అనే ప్రాజెక్టు పేరుతో తన ఇంట్లోనే మ్యూజియం ఏర్పాటు చేసి బాధితుల నుంచి దుస్తులు సేకరించటం ప్రారంభించింది. ఆ దుస్తులు వెనుక జరిగిన సంఘటన వివరాలు, వేసుకున్న దుస్తులు, ఎక్కడ? ఎలా జరిగిందో తదితర వివరాలను ఆ దుస్తులు వెనుక రాసి పెడుతుంది. ఓ రోజు ఓ గదిలో అమ్మాయిలు సమావేశమయ్యారు. ఆ గదిలోనికి వెళ్లి మీరు లైంగిక వేధింపులకు గురైతే.. వాటి వివరాలను పేపర్ మీద రాయమని అడిగాను. వారు రాసిన వివరాలు చూస్తే.. అందులో ప్రతిఒక్కరూ బాధితులే. అశ్లీలంగా మాట్లాడటం, తాకడం, నిరసన ధ్వనులు చేయడం, అసభ్య చర్యలకు పాల్పడటం చేశారని ప్రతిఒక్కరూ రాయటం ఆశ్చర్యం కలిగించింది. బహిరంగ ప్రదేశాలలో ఇలాంటి వేధింపులు సర్వసాధారణమయ్యాయి. ఇలాంటి వికృత చర్యలకు, దుస్తులకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడైంది. రాత్రికి ఇంటికి ఆలస్యంగా రావడం, ఒళ్లు కనిపించేలా దుస్తులు ధరించటం, తాగి ఉండటం వంటి కారణాలు కనిపించలేదు. వితంతువులు ఎరుపు రంగు దుస్తులు ధరించినా వేధింపులకు గురైన సందర్భాలు ఉన్నాయని జాస్మిన్ వెల్లడించింది. పద్నాలుగేళ్ల ఆడపిల్లల నుంచి 30-40 సంవత్సరాల నడివయస్సు స్త్రీలు, వృద్ధ మహిళలు సైతం ఈబాధితుల్లో ఉన్నారు. కోల్‌కతా నుంచి బెంగుళూరుకు వచ్చిన జాస్మిన్ ఇలాంటి బాధిత మహిళలు, యువతులు, పిల్లలు దుస్తులు సేకరించి సంఘటన వివరాలు రాసి ఈ మ్యూజియం సందర్శించిన వారిలో అవగాహన కల్పిస్తోంది.



ఐడియా..

డ్రైఫ్రూట్స్ తీసుకుంటే వ్యాధులు చాలా తక్కువగా వచ్చే అవకాశం వుంటుంది. పోషకాలు పుష్కలంగా ఉండటంతో ఆరోగ్యానికి చాలావరకూ మేలు చేకూరుతుంది. నిద్రలేమి, ఊబకాయం, కంటివ్యాధులు, రక్తహీనత, కీళ్లనొప్పులతో సతమతమయ్యేవారు క్రమపద్ధతిలో వీటిని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారు.

ఆడపిల్లను కాపాడుకుందాం..



అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా పడుకోవలసిన ఆ పసికూనలు మురికికాలువల పక్కన, చెత్తకుప్పలలో కనబడుతున్నారు. ఆ ముక్కుపచ్చలారని పసిపిల్లలు కుక్కలకు ఆహారం అవుతున్నారు. కళ్లు తెరిచి సమాజాన్ని చూసేలోపే చిదిమేస్తున్నారు. అసలు పుట్టిందాకా ఎందుకు? అమ్మ కడుపులో ఉన్నప్పుడే పుట్టేది ఎవరో తెలుసుకోవటానికి స్కానింగ్ సెంటర్లకి పరిగెడుతున్నారు. కాసుల కోసం కక్కుర్తిపడి, మానవతా విలువలను మరిచి పురిట్లోనే అర్థాంతరంగా చంపేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయించుకునే వాళ్లలో చదువుకున్నవారూ ఉన్నారు. గ్రామాలలోనే కాదు పట్టణ ప్రజలు కూడా ఆడ, మగ అనే వ్యత్యాసం చూపిస్తున్నారు. కొన్నిచోట్ల పసర మందు వాడితే మగ పిల్లలు పుడతారనే అపోహ కూడా ఉంది. ఆడపిల్ల అంటే మైనస్ అని, మగపిల్లాడు అంటే ప్లస్ అనే నానుడి పోవాలి. ఇదివరకురోజుల్లో ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టింది అని అనేవారు. ఇపుడు అలాంటిమహాలక్ష్మీ పుడితే భారంగా, బరువుగా భావిస్తున్నారు. ఇంట్లో మహాలక్ష్మిలా తిరగవలసిన ఆడపిల్లలకి ఉనికే లేకుండా చేస్తుంటే బాధేస్తోంది. పుట్టిన ఆడపిల్లలకి సరిగ్గా పౌష్టికాహారం పెట్టక మధ్యలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. ఆడపిల్లలను ఇంకెక్కడైనా పుట్టనివ్వండి మా ఇంట్లో మాత్రం మగ పిల్లాడే పుట్టాలి అని మొండిపట్టు పట్టి కూర్చునేవాళ్ళు ఎంతోమంది ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు కూడా స్కానింగ్ చేసి అమ్మాయి, అబ్బాయని చెప్పాలంటే నోటితో చెప్పకుండా, పేపర్ మీద రాయకుండా ఆడపిల్ల అయితే శుక్రవారం రమ్మని, మగపిల్లాడు మంగళవారం రమ్మని చెప్పి చాలా తెలివి ప్రదర్శిస్తున్నారు. వాళ్ళ ఆగడాలకి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. బిడ్డ ఆరోగ్యం, అవయవాలు అన్నీ సరిగ్గా ఏర్పడ్డాయో లేదో అని చూడటానికి వాడాల్సిన పరికరం కాస్తా ఇపుడు పుట్టేది ఆడపిల్లా, మగపిల్లాడా అని తెలుకోవడానికి వాడుతున్నారు అంటే ఆశ్చర్యం కదా. మగ పిల్లాడిని కంటేనే ఇంటికిరా, లేకపోతే పుట్టింట్లోనే ఉండు అంటున్న మగవాళ్ళు ఎందరో.. ఆడపిల్లని కన్నావు అని వేధించే అత్తమామలు ఇంకెందరో.

కేరళలో అక్షరాస్యతా శాతం ఎక్కువ కాబట్టి ప్రతి 1000 మంది అబ్బాయిలకి 1040 అమ్మాయిలు ఉన్నారు. మన రాష్ట్రంలో కూడా ఆడపిల్లల్ని కనాలి అనే కనీస అవగాహన ప్రజలకి కలిగించాలి. రాను రాను అసలు ఎటుపోతుందో ఈ సభ్య సమాజం అని అందరూ ఆలోచించుకోవలసిన ప్రశ్న. కని పెంచడానికి అమ్మ కావాలి, చివరివరకూ తోడుండాలి కాబట్టి భార్య కావాలి, కానీ కడుపున పుట్టడానికి మాత్రం ఆడపిల్ల వద్దు. ఈ ఆడదే లేకపోతే అసలు సృష్టే లేదు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి, ప్రభుత్వాలు స్కానింగ్ సెంటర్లమీద నిఘా పెట్టాలి. పిసిపిఎన్‌డిటి చట్టం పూర్తిగా అమలు చేయాలి. ఆడపిల్లల వల్ల కలిగే లాభాల గురించి పూర్తి అవగాహన కల్పించాలి. ఆడపిల్ల అంటే ఎక్కడో పిల్ల, మన ఇంటి పిల్ల కాదు అన్న పాతకాలపు ఆలోచన పోవాలి. ప్రజల్లో అలాంటి మార్పుగనుక రాకపోతే ఎన్ని చట్టాలు తెచ్చినా, స్కానింగ్ సెంటర్లమీద నిఘా ఉంచినా కడుపులో పుట్టి కడుపులోనే కడతేరిపోతుంది ఆడజన్మ. మొదటిసారి ఆడపిల్ల పుట్టినవాళ్ళు రెండోసారి మగపిల్లాడు కోసమే ఎదురుచూస్తున్నారు. మొదటిసారి ఆడపిల్ల పుట్టినవాళ్లమీద నిఘా ఉంచితే కొంతమంది ఆడపిల్లలనైనా మనం కాపాడుకోవచ్చు. ఇలాంటిది ఎన్నో రాష్ట్రాలలో అమలు చేసి సక్సెస్ అయ్యారు మన రాష్ట్రంలో కూడా ఇలాంటిది ఒకటి అమలు చేయాలి. 21వ శతాబ్దంలో కూడా ఆడపిల్లా, మగపిల్లాడు అనే వివక్షత చూపకండి. వృద్ధాప్యంలోకి వచ్చాక తల్లిదండ్రులను చూసుకునే ఆడపిల్ల అయినా మగపిల్లాడు అయినా ఒక్కటే. ఆడపిల్ల పుట్టకపోతే జాతి అభివృద్ధి ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. ఆడపిల్లను బతికిద్దాం, కాపాడుకుందాం.

-కాసర సింధూరెడ్డి



దేశంలో ప్రతి 1000 మంది అబ్బాయిలకి 943మంది ఆడపిల్లలు, ఆంధ్రప్రదేశ్‌లో 1000 మందికి 993 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు. దేశంలో 0-6 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలు అయితే 1000మంది అబ్బాయిలకి 919 ఆడపిల్లలు, ఆంధ్రప్రదేశ్‌లో 1000 మందికి 939 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.



మగవారికంటే ఆడవారు ఏ మాత్రం తక్కువ కాదు. అన్ని రంగాలలో ముందుంటున్నారు. ఇద్దరు పిల్లలకు తల్లైనా మగాళ్లకి దీటుగా బాక్సింగ్ ఆడే మేరీకోమ్ కావచ్చు, దేశం మొత్తం తన ఆటతో తనవైపునకి తిప్పుకున్న పి.వి.సింధు కావచ్చు, తన గానంతో అందరినీ మంత్రముగ్ధులను చేసిన లతా మంగేష్కర్ కావచ్చు, అంతరిక్షంలోకి కాలుమోపిన కల్పనా చావ్లా, దేశాల్ని ఏలిన ఇందిరాగాంధీ, ప్రజలకు సేవ చేసిన మదర్ థెరిస్సా, తన అందంతో, అభినయంతో ఆకట్టుకొన్న విశ్వసుందరి సుస్మితాసేన్, క్రికెట్‌లో తన సత్తాచాటిన మిథాలీ రాజ్, రాణి లక్ష్మీబాయి, కిరణ్‌బేడీ, సరోజినీ నాయుడు, సుష్మాస్వరాజ్, సునీతా విలియమ్స్, పి.టి.ఉషా... ఇలా ఒకరా, ఇద్దరా ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆణిముత్యాలు భారతదేశం కీర్తి ప్రతిష్ఠలని ఎవరెస్టు మీద కూరోబెట్టారు. మన ఇంట్లో కూడా అలాంటి ఆడపిల్ల పుట్టొచ్చు. 30 పదులు వయస్సు మీదపడినా ఇంకా పెళ్లికాని బ్రహ్మచారులు ఎంతమందో... దీనికి కారణం ఆడపిల్లల నిష్పత్తి దారుణంగా పడిపోవడమే.

మాతృభూమికి రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500

కర్మభూమి

రచనే, చిత్రమో నాట్యమో
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుభోగముల మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి బుధవారం,7 ఫిబ్రవరి 2018

ఆరున్నొకటి

కొందరికి కొన్ని సంఖ్యలు అంటే ఇష్టం మరికొన్ని అంటే అయిష్టంగా ఉంటుంటాయి. చాలామందికి కొన్ని సంఖ్యలపట్ల కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలుంటాయి. 'ఏడు'సంఖ్యను కాదు ఏడు అన్న పదాన్ని పలుకడానికి కూడా ఇష్టపడరు. ఏడు అని చెప్పడానికి జానపదులు ఆరున్నొకటి అంటుంటారు. ఇది వ్యాపారస్థుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఏపని చేయని వాళ్లను 'సాడేసాత్‌గాడు'అని అనడానికి ఏడు అన్న పదం పనికి రాదని భావం. జానపదంలోను, పురాణాల్లోను ఏడుకు ప్రాముఖ్యత ఉంది. సంస్కృతంలో ఏడు ను 'సప్త', లాషిన్ 'స్టెపెటమ్' అని, ఇంగ్లీష్‌లో 'సెవెన్'అని హిందిలో 'సాత్'అని 'స' పరమైన అక్షరంతో ప్రారంభిస్తారు. గణిత శాస్త్రంలో ఏడు బేసి సంఖ్య. సరి సంఖ్యకన్నా బేసి శుభప్రదం. కాని మనకు మాత్రం ఏడు అంటే ... ఆరున్నొకటే...

వ్యూహం



37 అలపర్తి రామకృష్ణ

మన దృష్టి ప్రతిక్షణం వాళ్ళమీదే వుందని వాళ్ళు గ్రహించకూడదు!'' వివరంగా చెప్పాడు స్కంద.

''ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుంది సార్ మన వేట?''

''వాళ్ళ ఆట ముగియబోతున్నది... మన వేట మొదలు కాబోతున్నది.. జస్ట్.. వన్ మంత్! వాళ్ళ ఖేల్ ఖతమ్... కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యింది'' అన్నాడు స్కంద.

⁂

ఇంటర్‌కమ్‌లో కాశిని తన ఛాంబర్‌కు రమ్మన్నాడు డాక్టర్ అరవింద్.

అతను వచ్చేక ''నా రూములో ఏసి సరిగ్గా పని చెయ్యడంలేదు.. వెంటనే రిపేర్ చేయించు'' అన్నాడు అరవింద్.

''అలాగే.. మీరు కాన్ఫరెన్స్ హాల్‌కు వెళ్తున్నారు గదా! కాన్ఫరెన్స్ అయ్యేక లంచ్ ఏర్పాట్లు జరిగేయి.. మీరు లంచ్ ముగించుకుని మీ ఛాంబర్‌కు తిరిగి వచ్చేసరికి రెండు మూడు గంటలు పడుతుంది. ఈలోపు ఎలక్ట్రీషియన్ వచ్చి బాగు చేస్తాడు. మీరు వెళ్లిరండి'' అన్నాడు కాశి.

డాక్టర్ అరవింద్ వెళ్ళేక లెనిన్ వచ్చాడు గదిలోకి.



కాశి డ్రాయర్ సొరుగులో వున్న తాళాలు తీసి షెల్ఫ్ ఓపెన్ చేశాడు. షెల్ఫ్‌లో వున్న డాక్యుమెంట్లను వెతికాడు. తనకు అవసరం లేవనుకున్న పేపర్లు ఎక్కడవున్నవి అక్కడ ఉంచేశాడు. షెల్ఫ్‌లో వుండేవన్నీ హాస్పిటల్లో జరిగే ఆపరేషన్స్‌కు సంబంధించినవి.

అరిఫ్‌తో వుండే లావాదేవీలు, ఫైనాన్షియల్ మాటర్స్‌కు సంబంధించినవి, ల్యాండ్ డాక్యుమెంట్లు మాత్రం ఆ షెల్ఫ్‌లో వుండవు. వాటిని భద్రంగా లాకర్‌లో దాస్తాడు. ఆ లాకర్ అరవింద్ ఓపెన్ చేస్తూ వుంటాడు. కాశిని కూడా ఆ లాకర్ దగ్గరకు రానివ్వడు. లాకర్ తాళాలు అతని దగ్గరే వుంటాయి. కోడ్ నెంబర్లుకూడా అతనికే తెలుసు. ఆ కాన్ఫిడెన్షియల్ డాక్యుమెంట్స్ కాపీలు దొరకడం కష్టమని స్కందకు ఎప్పుడో చెప్పేశాడు కాశి...

కిడ్నీ, లివర్ ఆపరేషన్స్‌కు సంబంధించిన పేపర్లు దొరికాయి. అవన్నీ లామినేటెడ్ కవర్లో పెట్టి లెనిన్‌కు ఇచ్చాడు కాశి.

''ఈ పేపర్లు తీసుకువెళ్లి మీ బాస్‌కు ఇవ్వు.. భద్రాచలం వెళ్ళే రోడ్డులో రత్న ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర మీ బాస్ వుంటాడు. తొందరగా తిరిగొచ్చెయ్యి'' అన్నాడు కాశి.

''నా బైక్‌మీద వెళ్ళశమంటారా?'' అడిగాడు లెనిన్.

''నీ చేతిలో వున్న కవర్ చూస్తే సెక్యూరిటీ వాళ్ళకు అనుమానం వస్తే ఇబ్బంది. నా కారులో వెళ్ళు.. గేటు దగ్గర సెక్యూరిటీవాళ్ళు నా కారు చూడగానే చెక్ చెయ్యడానికి సాహసించరు. నువ్వే డ్రైవ్ చేసుకుని వెళ్ళు!'' అన్నాడు కాశి.

కాశి కారు తీసుకుని స్కంద, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నిలబడ్డ చోటుకి స్పీడుగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాడు. స్కందకు సెల్యూట్ కొట్టి పేపర్ల కవరు ఇచ్చాడు లెనిన్.

''హస్పిటల్ పేపర్లు తీసుకువచ్చాడు.. ఇతనెవరు సార్?''

''మన క్రైమ్ బ్రాంచ్‌లో పని చేస్తాడు. అతని ఐడెంటిటి మన పోలీసు డిపార్టుమెంటులోనే ఎవరికీ తెలియదు. అతను ఎవరి దగ్గర పనిచేస్తుంటే వాళ్ళకే తెలుస్తుంది. వెరీ సిన్సియర్ అండ్ డాషింగ్ కానిస్టేబుల్.. ఎలక్ట్రీషియన్ అవతారంతో ఈ హాస్పిటల్లో పనిచేస్తూ వున్నాడు.. మీరు వెంటనే ఈ పేపర్లు జిరాక్స్ తీయించండి.. పదిహేను నిమిషాల్లో పని పూర్తికావాలి! క్విక్!'' అన్నాడు స్కంద.

జిరాక్స్ సెంటర్‌లోకి పరుగెత్తారు సర్కిల్ ఇన్స్‌పెక్టర్, లెనిన్.

కాశీ పంపించిన పేపర్లు అన్ని జిరాక్స్ తీశాక, ఒరిజినల్ సెట్ తన దగ్గర వుంచుకుని జిరాక్స్ సెట్ లెనిన్‌కు ఇచ్చాడు.

'''మీరు ఎక్కడనుంచి తీశారో అదే ప్లేసులో ఈ పేపర్లు ఉంచమని కాశికి చెప్పు! డాక్టర్ అరవింద్‌కు అవి జిరాక్స్ పేపర్లా, ఒరిజినల్ డాక్యుమెంట్లా అని వెరిఫై చేసుకునే తీరిక వుండదు'' అన్నాడు స్కంద. కారు డ్రైవ్ చేసుకుంటూ తిరిగి హాస్పిటల్‌కు వెళ్లిపోయాడు లెనిన్.

షెల్ఫ్‌లో పేపర్లు సర్దుతూ వున్నాడు కాశి. అప్పుడే వచ్చాడు డాక్టర్ అరవింద్.

''ఏమిటి? నా షెల్ఫ్ సర్దుతున్నావ్?'' అడిగాడు కాశిని.

ఇంకాఉంది

అభినవ ఘంటసాల

డా.అక్కిరాజు సుందర రామకృష్ణ జగమెరిన కళాకారుడు. ఈయన కవి, నటుడు, గాయకుడు, వ్యాఖ్యాత- ఇన్ని మంచి గుణాలు ఒకే మనిషిలో ఉండటం చాలా అరుదు. హైదరాబాద్‌లో ప్రైవేటు కళాశాలలో ఆంధ్ర ఉపన్యాసకులుగా పనిచేసి, ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా బహుమతి తీసుకున్నారు. పద్యకవి, అధిక్షేప కావ్య రచయిత వీరు!



డా.అక్కిరాజు సుందర రామకృష్ణ

★ మీరు ఏ పుస్తకాలు రాశారు?

నేను ఎన్నో పుస్తకాలు రాశాను. వాటిలో శారదా, రంగ రంగా, అమ్మతోడు, మాధవా కేశవా, బాపూ రమణా మొదలైనవి ప్రసిద్ధ గ్రంథాలు. దాదాపు 30 రాశాను.

★ మీరు ఆడియో సిడీలు కూడా రిలీజు చేశారు కదా!

చాలా సీడీలు వచ్చాయి నావి. వాటిలో శ్రీకృష్ణార్జున, షిర్డీసాయి సుప్రభాతం, సత్యసాయి స్తుతి, బాసర సరస్వతి, కాళహస్తీశ్వరా మొదలైనవి చాలా ప్రసిద్ధమైనవి.

★ మీరు ఎన్నో పాత్రలు వేశారుకదా, రంగస్థలంలో?

అవును. చింతామణి నాటకంలో బిల్వమంగళుడిగా ఎంతోమంది ప్రశంసలు అందుకున్నారు. శ్రీకృష్ణతులాభారంలో, శ్రీకృష్ణరాయబారంలో కృష్ణుడి పాత్రకి బాగా ఖ్యాతి వచ్చింది. ప్రఖ్యాత సినీనటి, కళాభినేత్రి శ్రీమతి జమునగారితో నేను శ్రీకృష్ణతులాభారం యావద్దేశం పర్యటించాను. అర్జునుడి పాత్ర కూడా చాలాసార్లు వేశాను. 'భువన విజయం' అనే సాహిత్య రూపకం ఆనాటి శ్రీకృష్ణదేవరాయలు అష్టదిగ్గజాలను నేడు కళ్ళ ముందుకు తెస్తుంది. నేను తెనాలి రామకృష్ణుడిగా భారతదేశంలో, ఎన్నో విదేశాలలో కూడా వేశాను.సత్యహరిశ్చంద్ర చాలా ప్రఖ్యాతి తెచ్చింది. సాహిత్య రూపకాలు చాలా వేశాను. భారతావతరణం, కనకాభిషేకం- శ్రీనాథుడి దర్బారు అందులో శ్రీనాథుడిగా వేశాను. నేనుసినిమాల్లో కూడా శివ, ముఠామేస్త్రిలో గవర్నరు, ఠాగూరులో ప్రిన్సిపాలు, ఎగిరే పావురంలో సంగీత విద్వాంసుడు- ఇలా దాదాపు వంద సినిమాలలో వేషంకట్టాను.



కళాంజలి

- డా. శ్రీలేఖ కొచ్చెర్ల కోట

★ మీరు టీవీ సీరియల్స్‌లో కూడా చేశారు!

అవును. పోతన, శ్రీనాథుడు, నన్నయభట్టు, అల్లసాని పెద్దన పాత్రలు వేశాను. మర్యాదరామన్న సీరియల్‌లో ఎన్నో పాత్రలు వేశాను. జెమిని వారి పెళ్లిపందిరిలో వంద ఎపిసోడ్స్‌లో వేశాను.

★ విదేశాలలో కొన్ని ముఖ్య అనుభవాలు, ఎలాంటివి?

నేను యుఎస్‌ఏ ఆరుసార్లు వెళ్ళాను. దుబాయి, సింగపూరులో కూడా ప్రదర్శించాను. ముఖ్యంగా యుఎస్‌ఏలో అట్లాంటిక్ మహా సముద్రంనుండి, ఫసిఫిక్ సముద్రందాకా మియామి, బిఫలో, శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ భువనవిజయం ప్రదర్శించారు. ముఖ్యంగా తెనాలి రామకృష్ణుడి పాత్ర వేసినా, సందర్భోచితంగా శ్రీకృష్ణదేవరాయలుగా కూడా వేశాను. యుఎస్‌ఏలో శ్రీకృష్ణదేవరాయలుగా పూర్వాశ్రమంలో శ్రీ ప్రసాదరాయ కులపతి వేశారు. ఆయన నేడు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేంద్రస్వామి. తిమ్మరుసుగా ముదిగొండ శివప్రసాద్, నేను తెనాలి రామకృష్ణగా వేశాను. అవి మనస్సుకు హత్తుకుపోయిన ప్రదర్శనలు.

★ కళాకారుడిగా మీరు ఇబ్బందులు ఎలా అధిగమించారు?

జవాబు:ఏ కళలో అయినా ఇబ్బందులు ఉంటాయి. ముఖ్యంగా టీవీ, సినిమా, రంగస్థలం పోటీ రంగం. కేవలం నా ప్రతిభ, కృషి, అభ్యాసంతో పైకి వచ్చాను. రబ్బరుబంతిలా ఎగిరి పైకి వచ్చాను. నాకు ఇప్పుడు 70 సంవత్సరాలు. అయినా ఇప్పటికీ రంగస్థలంలో ప్రదర్శిస్తున్నాను. నిన్న హైదరాబాదు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో భువనవిజయంలో వేశాను. కేవలం కళపై నాకున్న ప్రేమ, మమకారం నాకు ప్రేరణ ఇచ్చింది.

★ కళాకారులకు మీరు ఇచ్చే సందేశం

జవాబు:అడ్డదారులు, షార్టుకట్స్ తీసుకోకూడదు. ఇది అన్ని రంగాలకి వర్తిస్తుంది. సంగీతం, సాహిత్యం, నృత్యం, రంగస్థలం, టివి, సినిమా- ఎందులోనైనా కష్టపడి పైకి రావాలి. కేవలం ప్రతిభ, అభ్యాసం, సృజనమీద ఆధారపడాలి.

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)
విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలనమేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడే వారు జాగ్రత్తగా నుండాలి. ఆటంకాలుంటాయి.

● వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.

● మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)
కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. దైవ ప్రార్థన మిమ్ములను శక్తివంతులను చేస్తుంది. దేవాలయాలను సందర్శిస్తారు.

● కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు. అనుకొన్న పనులు పూర్తి చేయడానికి శ్రమ చేయాల్సి ఉంటుంది.

● సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణవిముక్తి లభిస్తుంది. మానసికానందం పొందుతారు.

● కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)
ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది.శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

● తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)
కుటుంబ విషయాలపై అనాసక్తితో వుంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.కొన్ని కార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. తీర్థయాత్రలకోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు.

● వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)
బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. విదేశయాన ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.

● ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)
మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతాయి. పట్టుదలతో అనుకొన్న కార్యాలను పూర్తి చేస్తారు.

● మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)
సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు.

● కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)
ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు. కొత్త పనులకు శ్రీకారం చుడుతారు.

● మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)
ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. అజీర్ణ బాధలు అధికమగును. కీళ్ళనొప్పుల బాధనుండి రక్షించుకోవడం అవసరం. మనోవిచారాన్ని కలిగివుంటారు. ఆకస్మిక ధనలాభ యోగముంటుంది.

నేర్చుకుందాం — నరసింహ శతకం

సీ. ఆయురారోగ్యపుత్రార్థ సంపదలన్ని
గలుగఁజేసెడి కార్యకర్తనీవె
చదువులెస్సగ నేర్పి సభలో గరిష్ఠాది
కార మొందించెడి ఘనుఁడవనీవె
నడక మంచిది పెట్టి నరులు మెచ్చెడునట్టి
పేరు రప్పించెడి పెద్దనీవె
బలుపైన వైరాగ్య భక్తిజ్ఞానములబ్బి
ముక్తిఁబొందించెడి మూర్తి నీవె

తే. అవనిలో మానవుల కెల్ల నాపలిచ్చి
వ్యర్థులను జేసి తెలిపెడి వాఁడనీవె
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ నరసింహస్వామీ! లోకంలో ఆయుస్సు, ఆరోగ్యం, సంతానం, ధనం మొదలైన సంపదల్ని ఇస్తావు. మంచిచదువులు నేర్పి సభలలో గొప్ప గౌరవం గల్పిస్తావు. ప్రవర్తనని చక్కదిద్ది పేరు ప్రఖ్యాతలు గల్గేటట్లు చేస్తావు. భక్తిజ్ఞాన వైరాగ్యాల్ని ఇచ్చి ముక్తిని ప్రసాదిస్తావు. మానవుల్లో ఆశలు రేకెత్తించి వారిని వ్యర్థుల్ని చేస్తావు. అన్నీ నీ పనులే.

ఆశ ఖరీదు అణా



గోరాశాస్త్రి గారి రేడియో నాటిక

వినమరుగైన..

(బాజాలు అలా అలా దూరం అయిపోయి, మళ్లీ గల్లీలో వాహనాల చప్పుళ్ళూ జనసమ్మర్దం అవీ వినబడతాయి)

యు:వెళ్లిపోయింది అమ్మాయి. పేరు అడుగుదామనుకున్నాను, భయం వేసింది. ఎందుకో! మన భయాలన్నీ యిలాగే వుంటాయి. ముక్కూ మొహం ఎరగని నాతో నిర్భయంగా జంకూ గొంకూ లేకుండా మాటాడింది. బజాలు విని హడలిపోయి తుర్రుమని లోపలికి పారిపోయింది. కొందరికి చావంటే భయం. మరికొందరికి బతుకంటే భయం.. ఎక్కడికో యీ మనుషులంతా? ఎన్ని కార్లు! ఎన్ని కార్లు! వాటిల్లో అందమైన ఆడవాళ్ళూ! ఖరీదైన మగాళ్లూ- ఎవళ్ళో వాళ్ళంతా? ఎక్కడికి వెడుతున్నారు అంత హడావిడిగా? రంగు రంగుల పానీయాల మత్తుందనాల్లోకి- తాంబూలాల సువాసనల్లోకి- అగరుధూపాల అర మోడ్పు కన్నుల అవతలి గట్టులకి.

(సైకిల్ బెల్ చప్పుడు)

ఒక పడుచువాడు: హలో! కొంచెం దారి యిస్తారా? సైకిల్ గుమ్మం గట్టు దాటించి లోపలికి తీసుకుపోతాను. లోపలి వాటాలో ఉంటున్నాం లెండి!

యు: తప్పకుండా.

పడు:థాంక్స్.. మీరేనా మేడ గదిలోకి కొత్తగావచ్చింది?.. పొద్దున్న యధాలాపంగా చూశాను. మీరే అనుకున్నాను. కుటుంబంతోనే వచ్చారా?

యు: లేదండి, ఇంకా పెళ్లికాలేదు.

పడు: ఓహో.. వస్తానండీ, మావాళ్ళు కనిపెట్టుకుంటారు. కనిపిస్తూనే ఉంటాలెండి. నేను బాంకులో పనిచేస్తున్నాను. మీ ఎకౌంటు ఏ బాంకులో ఉంది?

యు: నా ఎకౌంటండీ- నా జేబులోనే ఉంటుందండి. పైగా అది ఖాళీగా ఉండే సమయాలే ఎక్కువ.

పడు: బాగా చెప్పారు!

(కాస్త దూరం నుంచి 'లోపలికి రావేంరా నాయనా' అని ఒక ప్రౌఢ స్త్రీ కంఠం)

పడు:ఒస్తానండి! మా అమ్మ పిలుస్తోంది. మా ఆవిడ కూడా కనిపెట్టుకుంటుందీ....

(దూరం నుండి రేడియోలో జంత్ర సమ్మేళనం సన్నగా వినబడుతుంది)

మా పై వాటాలోవాళ్లులెండి.. కూతుళ్ళకు పెళ్లిళ్ళు చెయ్యరు గాని.. ఇరవై నాలుగ్గంటలూ గ్రామఫోన్లు పెట్టుక్కూర్చుంటారు.. ఇందిరా, ఆనందలక్ష్మి.. ఆహా.. పేరు గొప్పా ఊరు దిబ్బా అన్నాడు.

(జంత్ర సమ్మేళనం తీవ్రంగా వినబడుతుంది)

యు:ఇందిరా, ఆనందలక్ష్మి! ఎంత మంచి పేరు ఎందుకో మరి యీ సైకిల్ యోధుడికి నచ్చలేదు. పెళ్లిగాని అమ్మాయిలూ, బ్యాంక్ ఎకౌంట్ లేని నాలాంటి వాళ్ళూ అతనికి నచ్చరు. అలా నచ్చనివన్నీ ఏరిపారేయగా అతనికి మిగిలింది చాలా చిన్నలోకం అయుండాలి. తనూ, తన కుటుంబం, ఉద్యోగం, ఇంక్రిమెంటూ, తమ్ముడి ఉద్యోగం, చెల్లెలి పెళ్లి అంత చిన్న లోకాన్ని పదిలంగా రూపాయి కాగితంలో పొట్లం గట్టి మర్యాద బ్యాంకు లో డిపాజిట్ చేసేసి ఉంటాడు.. ఇందిరా- ఆనందలక్ష్మి! వాళ్ళ గురించి కొంచెం తెలిస్తే బాగుండును! నేను గోడలకి మేకలు కొడితే ఆ ఇందిరకి నిద్రాభంగం! ఇప్పుడేం చేస్తున్నారో వాళ్ళు!?

⁂

లక్ష్మి:ఇందిరా!ఇందిరా!

ఇం:(ప్రవేశిస్తూ) ఏం లక్ష్మి?

లక్ష్మి:అన్నయ్యింకా రాలేదేమే? ఇంత రాత్రయిందీ! నాకెందుకో భయం వేస్తోంది.

ఇం:వస్తాడు, జేబులో కానీ కూడా లేదాయె. ఎక్కణ్ణించి నడుచుకుంటూ రావాలో!

లక్ష్మి: అమ్మకి కాస్త కునుకుపట్టినట్టుంది. నువెళ్లి భోజనం చెయ్యరాదూ? వెళ్లు. నేను కూర్చుంటాను అమ్మ దగ్గిర.. తరవాత మళ్లీ బార్లీ నీళ్ళూ అవీ కలపాలా!

ఇం: ఇంకేమిటో ఆకలిగా లేదు లక్ష్మి! అక్కడ నాన్నకి జెయిల్లో గంజినీళ్ళూ ఇక్కడఅమ్మకి జబ్బు మంచం మీద బార్లీ నీళ్ళూ.

లక్ష్మి:ఆపేశావేం? అన్నయ్యకి ఉద్యోగం ల ఏదు, మనకి పెళ్లి లేదు- లిస్టు చాలా ఉంది.

ఇందిర: అదికదా లక్ష్మి, తలుచుకుంటే నవ్వాలో ఏడవాలో తెలియడంలేదు. ఉన్న ధైర్యం ఏవిటంటే, ఇంతకన్నా అట్టడుక్కి వెళ్లడానికి ఇంకేం వుందని!

లక్ష్మి:అలా అనకు. దిగినకొద్దీ సముద్రం లోతు, ఎక్కినకొద్దీ ఆకసం ఎత్తూ- అలా ఉంటూనే వుంటాయి. వెళ్లి భోంచేసి రావూ?

ఇం:ఏం భోజనమే! ఆకల్లేదు. అలా పడుకోవాలని ఉంది. మెలకువకంటే నద్ర నయం. మంచి కలలైనా వస్తాయి.

లక్ష్మి: ఏమిటీ హామీ! తీరా చేసి పీడకలలు వస్తే?

ఇం:చంపేశావు! మేలుకుంటేనీడ, నిద్రపోతే పీడ! ఏం దారి మరి?

లక్ష్మి:రెండింటికీ మధ్య ఏదో మగతగా బతికేస్తే సరి!

ఇం:అంతేనంటావ్! సరేలే.. ఇప్పుడు చేస్తున్నదీ అంతే.. హాయిగా ఎవరైనా పాడితే బాగుండును! ఏదైనా ఒక పాట- మైమరపించేది, హాయనిపిచేది..

ల:పాడిన కాస్సేపూ బాగుంటుంది. ఆ తరువాత?

ఇం:కాస్సేపు బాగున్నా చాలు.. పోనీలే.. నాన్న యీ నిముషాన జైల్లో ఏం చేస్తున్నాడో?

ల:నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు.

- సశేషం

(ఆకాశవాణి సౌజన్యంతో...)

మాటాట

నిర్వహణ: సుధామ 1556

1		2		■	■	3
	■		■	4		
5		■	6		■	
■	■	7	■		■	■
8	■	9		■	10	11
12			■	13	■	
	■	■	14			

ఆధారాలు

అడ్డం:
1. జవ్వాజి
4. చేర్చి కట్ట కట్టిన పుస్తకభాగం
5. పిచ్చి , వెర్రి వంటిదే
6. శ్రమ జీవికి రాత్రి వరం
9. ప్రసిద్ధి , నాణ్యత, బాగు
10. పనసపండులోనిది
12. అల
14. మరణించిన రెండో రోజు ఎముకలు ప్రోగు చేయుట

నిలువు:
1. అంశము , వ్యవహారము
2 మరల
3. వండిన రాగి లేక జొన్న ముద్ద
4. సముద్రము
7. తలుపు
8. ఓ ఆంగ్ల నవలా రచయిత మొదట ఉండుడి
11. కన్ను
13. హంస

మాటాట -1555 సమాధానం


■	1 కృ	ష్ణ	2 కు	మా	రి	■
3 హి	■	■	ద్య	■	■	4 గో
5 త్రో	6 వ	■	ము	■	7 సం	చి
■	8 సం	జ్ఞ	■	9 ఖా	తా	■
10 హి	తం	■	11 ని	■	12 సం	13 ద
క్క	■	■	శా	■	■	వ్వె
■	14 అ	శ	ని	పా	తం	■

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

స్మరణం పాపవినాశనం




పరమేశ్వరుడు లేని పదార్థం లేదు. పరమేశ్వరమయం అయిన ఈ లోకంలో ఈశ్వరుడు తన విభూతిని జ్యోతిర్లింగాల రూపంలోసౌరాష్ట్రంలో సోమేశ్వరునిగాను, ఆంధ్రరాష్ట్రంలో శ్రీశైల మల్లికార్జునిగాను, ఉజ్జయినీలో మహాకాలేశ్వరునిగాను, మాలవ్యలో ఓం కారేశ్వరునిగాను, హిమాలయాల్లో కేదారేశ్వరునిగాను, ఢాకినీ నగరంల భీమశంకరునిగాను, కాశీ క్షేత్రంలో విశ్వేశ్వరునిగాను, నాసిక్‌లో త్రయంబకేశ్వరునిగాను, చితాభూమిలో వైద్యనాథునిగాను, దారుకావనంలో నాగేశ్వరునిగాను, రామేశ్వరంలో రామేశ్వరునిగాను ఎల్లోరా గుహల వద్ద ఘృష్ణేశ్వరునిగాను దర్శనమిస్తున్నాడు. ఈ ఆలయాల దర్శనం వల్ల పుణ్యం లభించినట్లుగానే ఈ ఆలయాల నామస్మరణ వల్ల కూడా అంతే పుణ్యం లభిస్తుంది.

యాజ్ఞసేని



30

త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము



అంతా నిశ్శబ్దం ఆవరించింది. ఎవరితోనూ ఎవరూ మాట్లాడుకొనుటలేదు.

అట్లా వున్న అందరినీ ఆశ్చర్యపరుస్తూ వృష్ణివంశజుడూ, ధర్మపక్షపాతి అయిన శ్రీకృష్ణవాసుదేవుడు అన్న బలరాముతో కలిసి పాండవులను చూడటానికై పాండవులున్న కుమ్మరి ఇంటిలోనికి ప్రవేశించాడు.

అజాతశత్రువు, రాజ సమూహం చేత సేవింపదగినవాడూ, ఉన్నత గుణాలతో ప్రకాశించేవాడూ, తనకు మేనత్త కొడుకూ, బాల సూర్యునితో సమానమైన తేజస్సు గలవాడూ, నలుగురి తమ్ముల మధ్య ఆసీనుడై ఉన్నవాడూ, కుంతీదేవి పెద్దకుమారుడూ అయిన 'ధర్మరాజును' చూచాడు.

శ్రీకృష్ణవాసుదేవుని చూచిన ద్రౌపది ఒక్కసారి ఉలిక్కిపడింది. తనకు స్వప్నదర్శనమిచ్చి నిజ రూపాన్ని చూపినవాడు, తనతో ప్రీతితో మాట్లాడినవాడూ యిక్కడెలా వచ్చాడు అని ఆశ్చర్యచకితురాలైంది. నేను ఆనాడు చూచింది స్వప్నంలో కాదు కదా అని అనిపిస్తున్నది. ఆనాడు నా పైన మాయను ఆవహింపజేశాడా? నా మందిరానికెలా వచ్చాడు. నిజంగానే దర్శనమిచ్చాడా? అంతా అగమ్యగోచరంగా ఉన్నది అని తలపోసింది.

ధర్మరాజును చూచిన శ్రీకృష్ణుడు అతడి పాదాలను పట్టుకొని 'నేను శ్రీకృష్ణుడను' అని తనకు తాను పరిచయం చేసుకొన్నాడు. బలరాముడు కూడా తన పేరును చెప్పుకొని ధర్మరాజును అభినందించాడు. ధర్మరాజు కన్నా తాను పెద్దవాడైనందున నమస్కరించలేదు.

తన మేనత్త అయిన కుంతీదేవిని చేరి శ్రీకృష్ణబలరాములు ఆమెకు పాదాభివందనం చేశారు.

భీమార్జున నకుల సహదేవులను ప్రేమతో కౌగిలించుకొని పరమానంద భరితులైనారు. భీమార్జున నకుల సహదేవులు శ్రీకృష్ణబలరాములకు పాదాభివందనం చేశారు.

పాండవులందరూ సంతోషించారు. ధర్మరాజు శ్రీకృష్ణుని చూచి-

కృష్ణా! వాసుదేవా! మాకు ప్రీతిపాత్రులైన దేవకీ వసుదేవులు క్షేమమే గదా! నేడు మాకెంతో సంతోషాన్ని కలిగిస్తున్నది. మేము ఈ రీతిగా మిమ్ములను చూడగలగటం మా అదృష్టం. సదా మా హితవరులైన మీరు స్వయంవరానికివచ్చి మాకు అండగా నిలిచినందులకు కృతజ్ఞులము'' అని ఆనందం వెల్లివిరియగా అన్నాడు.

ఈ హఠాత్పరిణామానికి ద్రౌపది ఆశ్చర్యచకితురాలైంది. వారి సంభాషణలను విన్న ఆమెకు ఇది నిజమా? లేక కలయా అనే సందేహం కలిగింది. కొంత తడవుకు మనస్సును కుదుటపరచుకొన్నది. వీరైదుగురు పాండవులు అని తెలిసికొన్నది. మత్స్యయంత్రాన్ని కొట్టినవాడు ఎవరో కాదు అతడే అర్జునుడు. మనసు పులకరించింది. సంతోషించింది.

మరలా ధర్మరాజు అన్నాడు, ''శ్రీకృష్ణవాసుదేవా! విరోధంతో మేము కౌరవులకు దూరమై, బ్రాహ్మణ వేషాలు ధరించి, మమ్ములను ఎవ్వరూ గుర్తించకుండా ఈ విధంగా యున్న మమ్ములను మీరు ఎలా తెలిసికొన్నారు'' అని అడిగాడు.

శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ ''బావా! ధర్మరాజా! సూర్యుని మేఘసమూహం కప్పివేసినా, అగ్ని గూఢంగాయున్నా మీ తేజస్సును లోకంలో జనులకు కనిపించకుండా చేయడం సాధ్యమా? అట్లాగే మీరు రహస్యంగా మారువేషంలో ఉన్నా అడ్డగించ సాధ్యంగాని మీ తేజస్సును అడ్డగించగలిగినవారెవరు?'' అని అన్నాడు.

ఎన్నో కష్టాలను అనుభవించి చివరకు ద్రౌపదిని గెల్చుకొని మహదానందంతో ఉన్న సమయంలో శ్రీకృష్ణుడు మొదటిసారిగా వారిని కలిసి వారితో మాట్లాడటం వారి ఆనందాన్ని ఇనుమడింపజేసింది.

వారి మాటలను వింటున్న ద్రౌపదికి మీరు ఎవరో గాదు పాండవులేనన్న దృఢ నిశ్చయం కలిగింది. వారు మరణించలేదనీ తమ రాజపురోహితుడు తండ్రి అన్న మాటలు వాస్తవ రూపం దాల్చిందని లోలోన అమదానంద భరితురాలైంది. ఇంత ఆనందంలోనూ ఏదో ఒక విషయం మనస్సును మరలా తొలుస్తున్నది.

శ్రీకృష్ణుడు మరలా అన్నాడు- ''అంతమంది రాజుల ముందు మానవులకు అసాధ్యమైన ఇటువంటి అద్భుత కార్యం చేయటం అర్జునుని వంటివానికిగాక మరి ఇతరులకు సాధ్యమా? అది గ్రహించాము. మీ పరాక్రమమే మిమ్ములను మాకు తెలియ పరిచింది. అధర్మవర్తనులైన ధృతరాష్ట్ర దుర్యోధనాదులు తలబెట్టిన లాక్షాగృహదహనం నుండి తప్పించుకొన్నారు. ఇక మీకు మేలు కలుగుతుంది'' అని.

ధర్మరాజు అనుమతిని పొంది శ్రీకృష్ణబరాములు వారి శిబిరాలకు వెళ్ళారు.

- ఇంకావుంది

వాతాపి జీర్ణం



ఇల్వలుడు, వాతాపి అను ఇద్దరు రాక్షసులుండేవారు. వారిద్దరు బ్రాహ్మణ వేషాలు వేసుకొని దారిన పోయే పండితులను, వేదాధ్యయన పరులను భోజనానికి పిలిచేవారు. అతిథి పూజ చేస్తేగాని మేము భోజనం చేయమనే నిబంధన మాకు పెట్టుకున్నాము. రండి రండి అని పిలిచేవాళ్లు. వీళ్లు చెప్పేది నిజమనుకొని బాటసారులు భోజనానికి వచ్చేవారు. (అపుడు అంతా నడుచుకొంటూ వెళ్లేవారుకదా) అలా వచ్చిన వారికి వాతాపిని ఇల్వలుడు ఆహార పదార్థంగా తయారు చేసి వారికి వడ్డించేవారట. వారు తిని భుక్తాయాసం తీర్చుకోవడానికి కాసేపు అరుగు పైన కూర్చునేసరికి 'వాతాపి, వాతాపి! ఇలా బయటకు రా' అని ఇల్వలుడు పిలిచేవాడట. వాతాపి ఆ తిన్నవారి కడుపు చీల్చుకుని బయటకు వచ్చేసేవాడట. దాంతో ఆహారం తిన్నవారు చనిపోయేవారు.

ఇక ఏముంది ? హాయిగా ఇద్దరూ ఆ మనిషిని తినేసేవారట. ఇట్లా వీరి ఆగడాలు మరీ శ్రుతిమించి పోయాయి. బాటసారులు అటు వెళ్లాలంటే భయపడి పోయేవారట. దాంతో వారంతా వచ్చి అగస్త్యునికి తమ బాధను చెప్పుకున్నారు. ఆయన కూడా వాతాపి, ఇల్వలుల దగ్గరకు వెళ్లాడు. ఆ మహర్షిని వీరు భోజనానికి పిలిచారు. భోజనం పెట్టారు.

కాని అగస్త్యుడు భోజనం తినగానే తన పొట్టను తడుముకొంటూ జీర్ణం జీర్ణం వాతాపి అన్నాడట. అంతే అక్కడ వాతాపి జీర్ణం అయిపోయాడు.

ఇల్వలుడు ఎప్పటిలాగే 'వాతాపి బయటకు రా'అని పిలిచాడట. మహర్షి 'ఇల్వలా! ఇంకెక్కడ వాతాపి వాడు నా పొట్టలో జీర్ణమైపోయాడు..ఇక నీవంతు'అన్నాడట. దాంతో వీనికి బుద్ధి వచ్చింది. మహర్షి కాళ్లావేళ్లా పడ్డాడు.

అదిగో అప్పట్నుంచే మన పెద్దలు చిన్న చిన్న పిల్లలకు ఉగ్గు పెట్టినప్పటినుంచి ఏం పెట్టినా వారు తిన్న వెంటనే ఇలా అంటారు.

జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుట్కాల్ తిన్న గుగ్గిళ్లరిగి
ఏనుగుల్ తిన్న వెలక్కాయలరికిగి
అర్జునుడు తిన్న అరటిపళ్లరిగి
భీముడు త్ని పిండి వంటలరిగి
గణపతి తిన్న ఖజ్జాలరిగి
అబ్బాయి తాగిన పాలు ఆముదం అరిగి
పందల్లే పాకి, కుందల్లే కూర్చుండి
నందల్లే నడచి, గుఱ్ఱమంత పరుగు
ఏనుగంత సత్తువ ఉండేటట్టు
సాకుమీ యీ బిడ్డను సంజీవ రాయా!

అనేవారు. చూశారా వాతాపి జీర్ణం వెనుక ఎంత కథ ఉందో ...

- చరణశ్రీ

ఇటువంటి సేవ మనకెందైనా గలుగునా



ఇటువంటి సేవ మనకెందైనా గలుగునా
పటుతరమైన రాఘవ ప్రభు సన్నిధి నే గాక
తేటకస్తురి నుదట - నీటు గులుకు చుండ
హాటకాంబరుడైన శ్రీ- హరి సభయందునె గాక
ఆడుచు నాదమున - బాడుచు నెదుటను
వేడుచు నామది - గూడి యుండుటె చాలు
వాసిగ భద్రశైల - వాసుని దాసాను
దాసుడౌ నరసింహ - దాసావనుని గనకున్న
దాసుడే నరసింహ - దాసావనుని గనకున్నా....

అన్న తూము నరసింహ దాసు కీర్తనలు వింటూనే ఉంటాం కదా. ముక్కోటి దేవతలున్నట్లుగానే ముక్కోటి రకాలైన భక్తులున్నారు. ఈ భక్తులు ఒక్కొక్కరు ఒక్కోవిధంగా భగవంతుని పై తమ భక్తిని చాటుకుంటూ ఉంటారు. వాగ్గేయకారులు, సంగీతజ్ఞులు పాటలు పాడి వారి భక్తిని భగవంతునికి నివేదిస్తుంటారు.

తమ భక్తిని గానం చేసి ప్రకటించిన వారు వాగ్గేయకారులుగానో, సంగీత సామ్రాట్టులుగానో కీర్తి పొందుతున్నవారు ఉన్నారు.

వారిలో తూము నరసింహదాసుగారొకరు. అచ్చయ్య మంత్రి, వెంకమ్మల ముద్దుబిడ్డడు తూము నరసింహదాసుగారు. వీరికి భక్తివారసత్వంగా లభించింది. వీరుతమ కుటుంబంతో కలసి దక్షిణ దేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి ఆయా దేవీదేవతలను చూసారట. అక్కడంతా ఆయన తన భక్తిని పాటరూపంలో కైంకర్యం చేసారు. ఒక సారి చెన్నపట్నం వచ్చి అక్కడ పార్థసారథి స్వామిని దర్శించారు. వీణ కుప్పయ్యగారింటిలో బసచేశారట.అక్కడ త్యాగరాజ స్వామిని దర్శించుకునే వీలు కలిగిందట. ఆయన మురిసిపోయి త్యాగరాజు మీద పద్యాలు అల్లి పాడారట. ఆ తరువాత నెల్లూరుకు వచ్చి రంగనాథుని సేవించారట. అక్కడ ఆయనకు రామదాసు అనే భక్తుడు తారసిల్లాడు. ఆయన సాయంతో భద్రాచలం చేరాడు. అక్కడ రాముని సేవించారు. అప్పుడు అక్కడ రామునిసేవలో సంకీర్తనలు ఆలపిస్తుండగా కంచెర్ల గోపన్న గారి విభవాన్ని తెలుసుకొన్నారట. ఆ గోపన్ననే రామదాసుగా కీర్తి గడించారిని విన్నారు. ఆ రామదాసు సేవించిన రామచంద్రమూర్తికి అప్పటి ముస్లిం నవాబు తానీషా నిత్యకైంకర్యానికి ఇచ్చిన దాన శాసనాన్ని దుష్టులెవరో పాడు చేసి ఉండడం చూశారు. ఎంతో బాధ పడి తిరిగి ఆ శాసనాన్ని తూము నరసింహదాసుగారు చెక్కించారట. అప్పటి నుంచి మళ్లీ ఆ నవాబు చేత రాముని కైంకర్యానికి వార్షికాలను ఏర్పాటు చేసేట్లుగా చేశారట. ఇక అప్పటి నుంచి నరసింహ దాసుగారు రామదాసుగా రాముని సేవిస్తూ కాలం గడిపేరట. చివరకు రామునిలోనే ఐక్యం చెందారని రామభక్తులు తూము నరసింహదాసుగురించి చెబుతారు. ఆయన పాడిన పాటలను ఈనాటికి ప్రాచుర్యంలోనే ఉన్నాయి. సంగీత సామ్రాజ్యంలో ఉన్నవారంతా ఒక్కసారన్నా తూము నరసింహదాసుగారి రచించి కీర్తించిన ఆ కీర్తనలు పాడుకుంటూ ఉంటారట.

- జి. కల్యాణి

సాయి పాదానంద

పువ్వు పుట్టగానే పరిమళించినట్టు 1906లో ఏప్రిల్ 15 వెంకట్రామయ్యర్, లక్ష్మి అమ్మాళ్ గార్లకు పుత్రోత్సాహాన్ని సాయి పాదానంద రాధాకృష్ణగా పుత్రోత్సాహాన్ని కలిగించాడు. ఆ రాధాకృష్ణ బాల్యంలోనే వారి తల్లిదండ్రుల భక్తివారసత్వాన్ని అందుకున్నారు. ఇతని తాతగారికి కొన్ని సిద్ధులుండేవని వీరు చెప్పేవారు.

ఒకసారి రాధాకృష్ణ తాతగారు నాగుపాము నోటిలోని ఇరుక్కున్న ముల్లును తీసివేశారట. ఆ ఉపకారం పొందిన నాగుపాము వీరి వంశాన్ని మూడు తరాల వరకు కాపాడుతానని సంకేతాన్ని ఇచ్చిందని వీరి తాతగారు వీరికి చెప్పారట. వీరు ఒకసారి చిన్నప్పుడు ఆడుకుంటుండగా దేవుని గదిలో ఏదో చప్పుడు వస్తే చూడడానికి వెళ్లాడట. అక్కడ ఓ ముప్పది సంవత్సరాల యువతి వచ్చి కూర్చుని ఉందట. ఈ రాధాకృష్ణను దగ్గరకు పిలిచి కాసేపు ఆడించివెళ్లిందట. ఇది నా చిన్ననాటి మరిచిపోలేని అనుభవమని సాయి పాదానంద చెప్పేవారు. వీరు పెరిగి పెద్దవారై ఉద్యోగస్థులుగా ఊటీలో ఉన్నప్పుడు వీరికి నారాయణ మహారాజ్ అనేవారు దత్తాత్రేయ



మంత్రం ఉపదేశించారట. అప్పటి నుంచి రాధాకృష్ణ నృత్యం పట్ల ఆకర్షితులైనారట. వారు మంత్రోచ్చారణలోనే నృత్యం చేస్తుండేవారట. సాయిసమాజ్ లో భాగవత సమ్మేళనం జరుగుతుండగా రాధాకృష్ణ స్వామి నామోచ్చారణలో ఆనందపరవశులై నృత్యం చేశారట.

ఒకసారి శ్రీ బి.వి. నరసింహస్వామి వారు రాధాకృష్ణకు దర్శనం ఇచ్చారట. ఆ స్వామితో మాట్లాడుతూ 'స్వామీ నాకు ఈ రాధాకృష్ణ అన్న పేరు ఎందుకు స్థిరపడుతుందో చెప్పండి'అని అడిగారట.

ఆ నరసింహస్వామి మరోసారి దీనికర్థం నీకు తెలుస్తుంది అని చెప్పారట. వీరి కలలో సాయి మహరాజ్ కనిపించి 10వ అధ్యాయం చదువు అని ఆదేశించారట. వీరు మేల్గాంచిన భాగవతంలోని పదవ అధ్యాయం అనుకొని దాన్ని పారాయణ చేశారట. మళ్లీ ఈ నరసింహస్వామి కనిపించి కాదు భగవద్గీతలోని 10 అధ్యాయం అని చెప్పారట. అలా నరసింహస్వామికి దగ్గర శిష్యులైన వీరు సాయి పాదానందగాసన్యాస నామం తీసుకొని పారమార్థిక సేవలో తరిస్తూ 1980 జనవరి 14న శివైక్యం చెందారు.

-ఆర్. శ్రీరాములు

ఉనికి

ఒకానొక కాలంలో ఓ గొర్రెలు మేపే వానికి వైరాగ్యం వచ్చింది. ఎంతకాలం చూసినా ఈ గొర్రెలను మేపడం, యజమాని ఇచ్చిన డబ్బుతీసుకోవడం, దానితో దిన వెచ్చాలుకొనుక్కోవడం, అవి తినడం అంతేనా బతుకు అంటే నేను పుట్టాను. పెరిగాను. రేపొద్దున చనిపోతాను. కాని నేను పుట్టినందుకు ఏం చేస్తున్నాను. నేను పోయేక ఎవరైనా నన్నుగుర్తుపెట్టుకుంటారా అనుకొన్నాడు.

అసలు నువ్వు ఇపుడు బతికి ఉన్నావు కదా. మరి నిన్ను ఎవరైనా గుర్తుపడుతారా అని అతని మనసు అడిగింది. ఆయనకూ అది నిజమే కదా అనిపించింది. వెంటనే ఆ వూరి కరణం దగ్గరకు వెళ్లాడు.బాబూ నేను ఎవరో మీకు తెలుసా అని అడిగాడు. కరణం 'నీవు ఎక్కడ ఉంటావు. ఏం చేస్తుంటావు'అని అడిగాడు. అంటే నన్ను అసలు ఇతనికి తెలియదన్నమాట అనుకొని వెళ్లిపోయాడు. అప్పటినుంచి బాగా ఆలోచించాడు. ఏదోపెద్ద దానాలుచేస్తే దానకర్త అని పేరురావచ్చు అనుకొన్నాడు. లేదు గొప్ప పారిశ్రామిక వేత్తనై ఎందరికో ఉద్యోగాలను కల్పిస్తే బోలెడంత మంది నన్ను ఉపాధి కల్పించిన వాడినని మెచ్చుకుంటారు అనుకొన్నాడు. లేదు గొప్ప నిర్మాణం ఏదైనా తలపెడితే అందరూ నన్ను మొదలుపెట్టిన నాటి నుంచి గొప్పగా చెబుతారు కదా. టీవీల్లో కూడా చూపిస్తారు అనుకున్నాడు.

కాని ఇవన్నీ చేయడానికి నీకు డబ్బు ఉందా అని అతని మనసు మళ్లీ అడిగింది. దాంతో మళ్లీ నిరాశ కలిగింది. నిట్టూర్పు విడిచాడు. అవునునిజమే. ఏ పని చేయాలన్నా డబ్బు ఉండాలి. అదే నా దగ్గర లేదుకదా. అయినా ఈ యజమాని ఇచ్చే డబ్బు నాకు తినడానికే సరిపోవడం లేదు. ఇంకా నేను పెళ్లిపెటాకులు చేసుకొంటే నా ఇల్లాలికి ఏం పెడతాను అనుకొన్నాడు.

అట్లా అనుకొంటూ నడుస్తూ వెళ్తున్నాడు. దారిలో పెద్ద లారీ మోత మోగిస్తూ వస్తోంది. ఎందుకింత మోత మోగిస్తోందో అని ఆ వంక చూశాడు. ఆ లారీకి ఎదురుగా ఓ చిన్న ఐదేళ్ల పాప పరుగెత్తి వెళ్తోంది.. వెంటనే గొర్రెల కాపరి పరుగెత్తి వెళ్లి ఆ పాపను పక్కకు తీశాడు. లారీ పెద్ద శబ్దంతో ఆగింది. ఆ డ్రైవర్ కిందికి దిగి 'ఏమయ్యా! నీకు బుద్ధి లేదా పిల్లల్ని అలా రోడ్డుపైన వదల వచ్చా అని అడిగాడు.'

'అయ్యో ఈ పాప నా పాప కాదండి.. నాకు తెలీదు నేను ముందుగా చూడలేదు'అని చెప్పాడు మేపరి.

అంతలోఅక్కడికి చర్చి లో ప్రార్థన చేసి వస్తున్న దంపతులు పరుగెత్తుకు వచ్చారు. ఆమె 'పాపా ! పాపా ! అని ఏడుస్తూ దగ్గరకు తీసుకొని ముద్దులు పెడుతోంది.


అతను 'మీకు శతకోటి దండాలు. మీవల్లే మాకీ రోజు గండం తప్పింది. మీరుగనుక లేకపోతే ఈ రోజు మేము ప్రాణాలు నిలుపుకోలేకపోయేవారిమి. మీ వల్లనే మా ఐదు ప్రాణాలు నిలిచాయి మేమెంతో ఋణ పడి ఉన్నాము' అని అతని రెండు చేతులు పట్టుకొని కృతజ్ఞతలు చెబుతున్నాడు.

మేపరికి ఏమీ అర్థం కాలేదు. అతను తన కారులో ఈ గొర్రెల కాపరిని ఇంటికి తీసుకొని వెళ్లాడు. అక్కడ అతని తల్లిదండ్రులతో జరిగిన విషయం చెప్పాడు.

వాళ్లు 'అయ్యా! నీవు ఏసుప్రభువలె వచ్చి మా బిడ్డను కాపాడావు.మేము పొద్దున నుంచి వెతుకుతున్నాము. మా బిడ్డ వాకిట్లో ఆడుతూ ఆడుతూ మా పని మనిషి చెంత నుంచి తప్పించుకొని ఎటో వెళ్లిపోయింది అప్పటి నుంచి వెతుకుతున్నాము. మాప్రాణాలు కాపాడావు బాబు. నీకు మేం ఏం చేయగలం 'అని అడిగారు.

కాపరికి ఏం చేయాలో అర్థం కాలేదు.

మళ్లీ కారులో తీసుకొని వెళ్లిన అతనే



మీరు మా ఇంట్లోనే ఉండండి. మీ పిల్లలను మేము చదివిస్తాము. మీరు ఏదో ఒకపనిని చేయండి. మా పాపను మీరు పెంచడంలో సాయం చేయండి 'అని అడిగాడు.

గొర్రెల కాపరి తన సంగతి చెప్పాడు. వారు పరమ సంతోషంతో అతడికి ఇల్లు ఇచ్చారు. పెళ్లి చేశారు. వారింట్లో పనివారి మీద మేస్త్రీగా పని కల్పించారు. అటు పని చేయించడం, ఇటు ఆ పాపను జాగ్రత్తగా బడికి తీసుకొని వెళ్లి ఇంటికి తీసుకొని రావడం అతని బాధ్యతలు.

ఒకరోజు దారిలో గొర్రెల కాపరి వెళ్లుతుంటే 'అనంతయ్యా! మీ యజమాని చాలా మంచివారట కదా. వారున్నారా నాకు వారితో కాస్త పని ఉందిమీరు వారితో మాట్లాడే అవకాశం ఇప్పిస్తారా. మీరు చెబితే వారు సాయం చేస్తారని విన్నాను'అన్నాడు. అలా అన్నది ఆ ఊరి కరణం.

'బాబూగారు మీ దగ్గరకు నేను ఇంతకు ముందు వచ్చినపుడు నాగురించి తెలీదు అన్నారు కదా. ఇపుడేంటి నా గురించి మీరు ఇన్ని విషయాలు చెబుతున్నారు 'అని ఆశ్చర్యం గా అడిగాడు.

అపుడు కరణం. 'ఏముంది బాబూ! నీ మంచితనం నీకు మంచి దారి చూపించింది. ఆ దారిలోనీవు వెళుతూ మంచి పనులు చేస్తూనే ఉన్నావు.నీవు చేసే మంచి పనులే నీకు పేరు తెచ్చి పెట్టాయి 'అని చెప్పాడు.

ఆరోజు నిద్ర పోయేముందు నా గురించి నలుగురికీ తెలిసిందికదా అనుకొన్నాడు. 'నువ్వు మంచి పనులు చేస్తున్నంత కాలమూ నిన్ను నలుగురూ గుర్తిస్తారు. పొగుడుతారు. నీ ఉనికి నలుగురికీ నీవు వద్దన్నా తెలుస్తునే ఉంటుంది. మరి నీవు నిర్ణయించుకో నీవు ఏం చేయాలో' అంది అతని మనసు.

నిజమే నేను సదా మంచి పనులే చేస్తాను.. గట్టిగా అనుకొన్నాడు.

- దాసరి రాణి

తరగని సంపదిదే!


విభూతి ధారణ వల్ల ముక్తి లభ్యం. ఇది అందరకూ తెలిసిన విషయమే. పునర్జన్మ కలుగదు. విభూతి అనే మాట కు సంపద అనే అర్థం ఉంది.సంపదలు రెండు రకాలు. లౌకికము, అధ్యాత్మికము అని వీటిని చెప్పుకోవచ్చు. భగవంతుని అనుగ్రహం కూడా సంపదే. శైవ సంప్రదాయంలో విభూతికి చాలా ప్రాధాన్యం ఉంది. షట్కాల శివపూజ అంటే శివుణ్ణి ఆరుసార్లు పూజించడం అనిఅర్థం. అష్టావర్ణములు అనగా భస్మ, రుద్రాక్ష, పాదోదకం, వంటి ఎనిమిది ముఖ్య శివాచారములు. శైవులకు రుద్రాక్షలు, బిల్వము ఎంత ముఖ్యమో భస్మధారణ కూడా అంతే ముఖ్యం.



ఈ భస్మమును తయారు చేసే పద్ధతులు కొన్ని ఉన్నాయి. ఒక్కొక్క రకమైన ఆవు పేడ నుండి తీసే భస్మమునకు ఒక్కో రకమైన శక్తి ఉంటుందని శాస్త్ర ప్రమాణం. ఇందుకు సంబంధించి మనకు ముఖ్యమైన గ్రంథాలు కూడా ఉన్నాయి. సిద్ధాంత శిఖామణి అనేది ఇందులో ముఖ్యమైంది. దీనిని శివాచార్యులువారు సంస్కృతంలో వేయి యేళ్లకు పూర్వం రచించారు. ఇందులో విభూతి ప్రకరణములు చాలా వివరంగా శుద్ధ, సిద్ధ, ప్రసిద్ధ భస్మముల గురించి ఉంది.

పాల్కురికి సోమనాథుడు సోమ నాథ భాష్యములో కూడా విభూతి మాహాత్మ్యము వివరించబడి ఉంది. ఇతడు 13 శతాబ్దంలోని కాకతీయ సామ్రాజ్యములోని మహాపండితులు. భస్మమును ముఖంపైన కంఠమునకు, చేతులకు, భుజములకు, ఉదర భాగమునకు ఇలా శరీరంలో 32 స్థానములలో ధరించవలెనని చెప్పారు. ఇది ముప్పైదిరెండు తత్వములకు ప్రతీక. లౌకికంగా చూస్తే ఆవుపేడతో తయారు చేసిన విభూతి రోగ నిరోధక శక్తి కలది. విభూతిలో కాల్షియం ఉంటుంది. విభూతి ధారణ వల్ల శరీరానికి చల్లదనం కలుగుతుంది.

- ప్రొ. ముదిగొండ శివప్రసాద్





హీరోయిన్లకు ఆ స్వేచ్ఛ తక్కువ

లావణ్య త్రిపాఠి

టాలీవుడ్ లోకి 'అందాల రాక్షసి'గా పరిచయమై తొలిచిత్రంతోనే తెలుగమ్మాయిగా చక్కటి ఇమేజ్‌ను తెచ్చుకుంది లావణ్య త్రిపాఠి. ఆ తరువాత తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చే పాత్రలు చేస్తూ క్రేజీ హీరోయిన్‌గా మారింది. వరుస సినిమాలతో బిజీగా మారిన లావణ్య తాజాగా 'ఇంటిలిజెంట్' చిత్రంలో నటిస్తోంది. సాయిధరమ్ తేజ్ హీరోగా, ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సి.కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 9న విడుదలవుతున్న సందర్భంగా లావణ్య త్రిపాఠితో ఇంటర్వ్యూ...

★ ఇంతకీ ఇంటిలిజెంట్ ఎవరు?

- నేనైతే కాదు. ఎందుకంటే సినిమా అంటేనే హీరో డామినేషన్ కదా! అందువల్ల తన తెలివిని ఉపయోగించి విలన్లను ఎలా దెబ్బతీస్తాడు, అతని ప్రతీకారాన్ని ఎంత తెలివిగా తీర్చుకున్నాడన్నది చూసి తెలుసుకోవాలి.

★ ఇందులో మీ పాత్ర?

- నా పాత్ర పేరు సంధ్య. అమెరికాలో పుట్టి పెరిగిన అమ్మాయి. తండ్రికి వ్యాపారంలో హెల్ప్ చేస్తుంటుంది. కొంచెం కోపంగా, కొంచెం డామినేటింగ్‌గా వుండే పాత్ర.

★ సాయిధరమ్‌తో పనిచేయడం?

- తేజ్‌తో పనిచేయడం చాలా కంఫర్ట్‌గా వుంటుంది. తను చాలా మంచి వ్యక్తి. ముఖ్యంగా సినిమా పట్ల చాలా తపన వుంది. మంచి డాన్సర్ కూడా. మేమిద్దరం సెట్‌లో బాగా ఎంజాయ్ చేశాం. తనతో డాన్సులు చేయడం కొంచెం కష్టమన్పించింది. తనతో రెండు మూడుసార్లు మాట్లాడాను. చాలా సిగ్గరి. ఎదురెదురుగా కూర్చుంటే మాట్లాడేవాడు కాదు. కానీ సినిమాలో మా ఇద్దరిమధ్యా కెమిస్ట్రీ బాగా కుదిరిందని అంటున్నారు. ఈ సినిమాతో మాకు తేజ్ మంచి ఫ్రెండ్ దొరికాడు.

★ మీ కెరీర్‌కు ఈ చిత్రం ఎలా ఉపయోగపడుతుంది?

- తప్పకుండా నాకు ఇది మరో డిఫరెంట్ సినిమా అవుతుంది. ఏ సినిమాకైనా దర్శకుడు మారేకొద్దీ ఆయన స్టయిల్‌లోనే పాత్రలుంటాయి. ఇందులో వినాయక్ మార్క్‌లోనే సినిమా వుంటుంది. ఆయన సినిమాల్లో వుండే హీరోయిన్‌గానే నేను కన్పిస్తాను. ఆయనతో పనిచేయడం చాలా కొత్త అనుభూతి కలిగింది.

★ చిరంజీవి పాటను రీమిక్స్ చేస్తారన్నప్పుడు మీ ఫీలింగ్?

- నిజానికి సెట్‌లోకి వెళ్లాకే ఈ పాట గురించి చెప్పారు. అది చిరంజీవి గారి సాంగ్. లెజెండరీ పాట. అలాంటి పాటలు నేను డాన్సు చేయడం అన్న ఆలోచనకు షాక్ అయ్యాను. నేను చిరంజీవిగారికి పెద్ద ఫాన్‌ను. అలాంటిది ఆయన పాటకు డాన్సు చేయడం కొత్త ఉత్సాహాన్ని కలిగించింది. కాస్త కష్టంగా అన్పించినా డాన్సు చేశాను.

★ దర్శకుడు వినాయక్ గురించి?

- వినాయక్ పెద్ద డైరెక్టర్. అయినాకూడా చాలా కూల్‌గా వుంటారు. ప్రతీ విషయాన్ని క్లారిటీతో చెబుతారు. ఆయనతో పనిచేయడం చాలా సాఫ్ట్‌గా వుంటుంది. నన్ను చిన్న పిల్లలా చూసుకున్నారు. ఆయనతో పనిచేయడం అదృష్టమని చెప్పాలి.

★ మీ సినిమాలు చూసుకుంటారా?

- తప్పకుండా. ఎందుకంటే మనం చేసిన పని ఎలా వుందో తెలుసుకోవాలని సినిమాలు చూస్తాను. అలాగే ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాను. కొన్నిసార్లు నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ ఇస్తారు. అందరు చెప్పింది వింటా. కానీ నాకేది కావాలో అదే చేస్తా. దానివల్ల మనం ఇంకా బెటర్‌గా ఇవ్వడానికి స్కోప్ ఉంటుంది కదా!

★ ఫెయిల్యూర్స్‌ని ఎలా తీసుకుంటారు?

- దాని గురించి అంతగా పట్టించుకోను. ఎందుకంటే, మనం చేయాల్సిన పని కరెక్టుగా చేశాం. ఫలితం మన చేతుల్లో లేదు. అసలు తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తా. సక్సెస్ వచ్చినపుడు ఎగరను, ఫెయిల్యూర్ వచ్చినపుడు కృంగిపోను. అయినా నేను చేసిన ఏ సినిమాపట్ల అసంతృప్తిగా లేను

★ నిర్మాతలను ఇబ్బంది పెడతారని వార్తలొచ్చాయి?

- అలాంటిదేం లేదు. మనం విన్న వార్తలన్నీ నిజం కావు! ఇప్పటివరకూ నేను చేసిన ప్రొడక్షన్ హౌస్‌లన్నీ నా పనితీరువల్ల సంతోషంగానే ఉన్నాయి. కొన్నిసార్లు కొన్ని కాంబినేషన్లు కుదరకపోవచ్చు. అలాంటప్పుడు బయటికి రావడమే బెటర్ అని నా ఉద్దేశ్యం.

★ ఈమధ్యే తమిళ నిర్మాతలు మీపై కంప్లైంట్ చేశారు కదా!

- కొన్నిసార్లు మనకు పడటంలేదని తెలిసినపుడు తప్పుకోవడమే ఉత్తమం. అక్కడ అదే జరిగింది. కానీ తెలుగులో ఇప్పటివరకూ అలాంటి పరిస్థితులు రాలేదు.

★ సినిమాలో గ్లామర్ డోస్ పెంచారట!

- పాత్రకోసం తప్పదు. అన్నీ మనం అనుకున్నట్టుగా పాత్రలు ఉండవు కదా!

★ ఈ బ్యానర్‌లో పనిచేయడం?

- నిర్మాత కల్యాణ్ మంచి తపన వున్న నిర్మాత. ఆయన సినిమా అంటే చాలా ఇష్టం. అందుకే ప్రతిదీ దగ్గరుండి చూసుకునేవాళ్లు. ఈ బ్యానర్‌లో పనిచేయడం చాలా ఆనందంగా వుంది.

★ కథల విషయంలో హీరోలకున్న వెసులుబాటు హీరోయిన్లకు ఉండదా?

- ఉండదు. ఎందుకంటే, ఇక్కడ సినిమా అంటేనే హీరో. హీరోయిన్ల పాత్రలు కొన్ని పరిధుల వరకే పరిమితం. కాబట్టి ఆ అవకాశం చాలా తక్కువ. ఉన్నంతలో మంచి పాత్రలు ఎంచుకునే అవకాశం మాత్రం ఉంటుంది.

★ హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యారా?

- ఈమధ్యనే స్థలం తీసుకున్నాను. హైదరాబాద్ చాలా నచ్చింది. ముంబైలో మాకు ఇల్లు ఉంది. అయితే హైదరాబాద్‌కు వచ్చే ఆలోచన ఉంది.

★ తదుపరి చిత్రాలు?

- ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ ఏడాది నాలుగు చిత్రాలు విడుదలయ్యాయి. అందుకే తెలుగులో ఏదీ ఓకె చేయలేదు. నెల రోజులపాటు బ్రేక్ తీసుకోవాలనుకుంటున్నా.

- శ్రీ

ధనుష్ కోసం..

కొత్తదనాన్ని అందించడంలో ఎప్పుడూ ముందుండే ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున హీరోగానూ, భిన్నమైన సినిమాలు చేస్తూనే అటు నిర్మాతగా కూడా తన అభిరుచిని చాటుకుంటున్నాడు. తాజాగా ఆయనకు మరో భిన్నమైన పాత్ర చేసే అవకాశం వచ్చింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఈమధ్య సౌత్‌లో కూడా మల్టీస్టారర్ సినిమాలు ఎక్కువయ్యాయి. తాజాగా తమిళంలో ఓ మల్టీస్టారర్ సినిమాకోసం హీరో ధనుష్ ప్రయత్నాలు చేస్తున్నాడు. రజనీ కాలా చిత్రానికి నిర్మాతగా మారిన ధనుష్ దర్శకుడిగా మారేందుకు రెడీ అయ్యాడు. ఈ నేపథ్యంలో ఓ కథను సిద్ధం చేసుకున్న ధనుష్ అందులో మరో హీరో పాత్ర కూడా ఉంటుందని, దానికోసం నాగార్జునను సంప్రదించాడట. తమిళంలో నటించడం నాగార్జునకు కొత్తేమీ కాదు. అయితే కథ విన్న నాగార్జున ఆలోచనలో పడ్డాడని తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెట్టాడట ధనుష్. మరి ఆయన నాగ్ అంగీకారం కోసం వెయిట్ చేస్తున్నాడని తెలిసింది. నాగార్జున ఓకె అంటే రెండు భాషల్లో ఈ చిత్రాన్ని ఏకకాలంలో విడుదల చేసే అవకాశాలున్నాయి.

ఫస్ట్‌లుక్ వస్తోంది..



నితిన్, మేఘా ఆకాష్ జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రేష్ఠమూవీస్, పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుంది. త్రివిక్రమ్ కథ అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను ఈనెల 12న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ- హైదరాబాద్, ఊటి, అమెరికాలో జరిగిన షూటింగ్‌తో చిత్రీకరణ పూర్తయింది. ఈనెల 12న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి టీజర్‌ను ప్రేమికుల రోజు సందర్భంగా విడుదల చేస్తున్నాం. ప్రేమతోపాటు కుటుంబ కథా విలువలతో సరదాగా సాగిపోయే చిత్రమిది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నితిన్ కెరీర్‌లో మరో మంచి చిత్రంగా నిలుస్తుంది. త్రివిక్రమ్ అందించిన కథ ప్రత్యేక హైలెట్‌గా నిలుస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఏప్రిల్ 5న విడుదల చేస్తామన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎం.నటరాజా సుబ్రహ్మణ్యం, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, సమర్పణ: నికితారెడ్డి, నిర్మాత: ఎం.సుధాకర్‌రెడ్డి, దర్శకత్వం: కృష్ణచైతన్య.



మెగా హీరోతో..

విభిన్నమైన కథ, కథనాలతో చిత్రాలు రూపొందించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి. ఐతే, సాహసం, మనసంతా వంటి చిత్రాలను రూపొందించిన ఆయన తాజాగా మెగా హీరోతో సినిమా చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటిలిజెంట్ చిత్రంతో నటిస్తున్న సాయిధరమ్ తేజ్, ఆ తరువాత కరుణాకరన్‌తో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా తరువాత ఆయన చంద్రశేఖర్ యేలేటితో సినిమా చేస్తాడట. ఇప్పటికే వీరిమధ్య కథా చర్చలు జరిగాయని, అద్భుతమైన కథను సాయిధరమ్ కోసం రూపొందించాడట. కథ నచ్చడంతో వెంటనే ఓకె చెప్పాడట తేజ్. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయని, త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక వివరాలు వెలువడే అవకాశాలున్నాయి.

పెళ్లి బాజాలు?

దక్షిణాదిలో దశాబ్దకాలంపాటు గ్లామర్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల భామ శ్రియ త్వరలో పెళ్లికి సిద్ధమవుతోంది. కొంత గ్యాప్ తరువాత సెకెండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఈమె, సరికొత్త పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం గాయత్రి చిత్రంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న శ్రియ పెళ్లికి సిద్ధమైందని బి టౌన్‌లో వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ఓ రష్యన్ యువకుడితో ఈమె ప్రేమాయణం సాగిస్తుందంటూ కథనాలు వస్తున్నాయి. వీరిద్దరి వ్యవహారంపై ఇప్పటికే బాలీవుడ్ కోడై కూస్తోంది. ఈ నేపథ్యంలో శ్రియ వివాహం సదరు రష్యన్ యువకుడితోనే జరుగుతుందని, ప్రస్తుతం శ్రియ తల్లిదండ్రులు పెళ్లి సన్నాహాల్లో ఉన్నారని టాక్. అన్నీ కుదిరితే వచ్చే నెలలో వివాహం జరుగుతుందని సమాచారం. అయితే ఈ విషయంపై శ్రియ మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం విశేషం.



ప్రేమికుల రోజున..



అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయం అవుతూ తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్య..నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్‌కుమార్‌లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. పస్ట్ ఇంపాక్ట్‌తో భారీ ఇంపాక్ట్ సంపాదించుకొని అద్భుతమైన టీజర్‌తో ప్రకంపనలు సృష్టించి సైనిక సాంగ్‌తో ఫుల్‌క్రేజ్ సంపాదించుకున్న నా పేరు సూర్యకు సంబంధించిన మరో పాటను ఈ నెల 14న విడుదల చేయబోతున్నారు. అంతేకాదు, ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ భార సరిహద్దుల్లో.. అది కూడా మైనస్ 12 డిగ్రీల సెల్సియస్‌లో చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ - 'నా పేరు సూర్య టీజర్ చూసిన వారంతా వావ్ అంటూ ప్రశంసల జల్లు కురిపించారు. టీజర్ చూసిన వారంతా అల్లు అర్జున్ డెడికేషన్ గురించి, మేకోవర్ గురించి మాట్లాడుకుంటున్నారు. భావోద్వేగమైన సైనిక సాంగ్ ప్రతీ ఒక్క మనసును కదిలించింది. మేకింగ్ వీడియో సినిమా స్టామినాను చూపించింది. దీనికి కొనసాగింపుగా ఫిబ్రవరి 14న మరో సాంగ్ విడుదల చేయబోతున్నాం. మరో వైపు ఈ చిత్ర షూటింగ్ భారత సరిహద్దుల్లో క్లిష్టమైన ప్రదేశాల్లో జరుగుతోంది. మైనస్ 12 డిగ్రీల సెల్సియస్‌లో ఈ షూటింగ్ చేస్తున్నాం. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణను మా దర్శకుడు వక్కంతం వంశీ పకడ్బందీగా ప్లాన్ చేశారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్-శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

16న 'రాజరథం'



నిరూప్, అవంతిక జంటగా ఆర్య ముఖ్యపాత్రలో అనూప్ భండారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రానికి సంబంధించిన ఇటీవలే విడుదలైన రెండు పాటలకు అనూహ్యమైన స్పందన లభించింది. ఈ సందర్భంగా దర్శకుడు వివరాలు తెలియజేస్తూ- 'నీలిమేఘమా..' పాట చిత్రీకరణ చాలా చలిలో జరిగింది. హీరో హీరోయిన్లు ఆ చలికి తట్టుకోలేకపోయారు. అయినా కూడా పాట బాగా రావడానికి ఎంతో కష్టపడ్డారు. ఒక్కో సమయంలో వారిపై వేడి నీళ్లు పోయాల్సి వచ్చింది. అంత చలిలో తెరకెక్కించాం. అనూప్ అందించిన పాటలు మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తికావచ్చిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునే అంశాలతో రూపొందింది. ఉన్నత స్థాయి నిర్మాణ విలువలతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. ఈ నెల 16న వస్తోన్న ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుంది అన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: అజయ్‌రెడ్డి, అంజు వల్లభనేని, విష్ణు దకప్పగారి, సతీష్ శాస్త్రి, దర్శకత్వం: అనూప్ భండారి.